# వందే గోమాతరం


రచయిత

ఎస్. గోపాలకృష్ణ



ప్రచురణ :

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2010


# *VANDE GOMAATHARAM*


*By*
***S. Gopala Krishna***



*T. T. D. Religious Publications Series No.871*



*© All Rights Reserved*



***First Edition :*** *Dec, 2010.*

***Copies :*** *1,000*

***Published by :***
***Sri I.Y.R.Krishna Rao,*** *I.A.S.,*
*Executive Officer,*
*T. T. Devasthanams,*
*Tirupati.*

***Cover Design :***
*B.Gurukumar Reddy*

***D.T.P.***
*Chief Editor's office. T.T.D.*

***Printed at:***
*Tirumala Tirupati Devasthanam's Press,*
*Tirupati - 517501*

# ముందుమాట

'వందే గోమాతరం'–గోప్రశస్తిని బహుముఖాల చాటే మంచిపుస్తకం. రచయిత ఎస్. గోపాలకృష్ణగారు. వారు దర్శకత్వం వహించి నిర్మించిన 'కామధేనువు' అనే డాక్యుమెంటరీ చిత్రం; ఈ చిత్రం ఉత్తమచిత్రంగా ఎన్నికైనందుకుగాను ఆంధ్ర ప్రదేశ్ ఫిలిం నంది అవార్డు లభించింది.

గోవును గురించి తమచిత్రంలో శ్రీ గోపాలకృష్ణ కొన్ని విషయాలు చెప్పారు. అంతటితో ఊరుకొనక గోవుపట్ల తమకున్న శ్రద్ధాసక్తులతో వారు మరిన్ని విషయాలు శ్రమించి సేకరించి వందేగోమాతరంలో పొందుపరచారు.

గోవును గురించి శ్రుతిస్మృతి పురాణేతిహాసాల్లో కనిపించే, ప్రజా బాహుళ్యంలో వినిపించే కథలు గాథలు సంగ్రహరూపంలో చొప్పించి గ్రంథం విలువ పెంచారు. హిందూ సమాజంలో గోవుకున్న పూజ్యతను ఉగ్గడిస్తూ గోదాన మహిమ ఎలాంటిదో పేర్కొన్నారు.

గోపూజా విధానం, గోవుకు చెందిన అష్టోత్తరశతనామావళి, గణపతి పూజావిధానం, తన్నామావళి ఈ పుస్తకంలో కుదురుకొనడం వల్ల పసుపు కుంకుమలు పెట్టి గోవులను అర్చించే మహిళామ తల్లులకు ఈ గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుంది.

ఆంధ్రదేశంలో ఎన్నెన్ని గోశాలలు ఎక్కడెక్కడున్నాయో ఆ పట్టికనిస్తూ వాటికి ప్రభుత్వంయొక్క ప్రజలయొక్క సహాయసహకారాలు లభించాలని మనసారా రచయిత కోరుకుంటున్నారు. గోరక్షణ, గోసేవ ఎందుకు చెయ్యాలో రచయిత చెప్పారు. పంచగవ్య ప్రాశస్త్యం,



గోవులవల్ల రైతుకు కలిగే లాభాలు ఈ గ్రంథంలో విపులంగా వివరించారు. గోవులను గురించి ఇటువంటి పుస్తకములు బహుశా తెలుగులో ఎక్కువగా లేవు. కాబట్టి తి.తి.దేవస్థానం ఈ పుస్తకాన్ని స్వీయ ప్రచురణగా స్వీకరించి పాఠకుల కరకమలాల్లో ఉంచింది. ఈ రచనకు చదువరుల మన్నన లభించగలదని ఆశిస్తున్నాను.

**కార్యనిర్వహణాధికారి,**
**తిరుమల తిరుపతి దేవస్థానములు,**
**తిరుపతి.**

# విజ్ఞప్తి

నేను 'కామధేనువు' ('గోవు')ను గురించి చదివి చాలా విషయాలు సేకరించాను. నేను నిర్మించి, దర్శకత్వం వహించిన 'కామధేనువు' డాక్యుమెంటరీ చిత్రంలో కొన్ని విషయాలు చెప్పగలిగాను. ఇంకా ఎంతో సమాచారాన్ని అందరికీ తెలియజేయాలని ఈ పుస్తకం రాయడానికి సంకల్పించాను. ఈ చిత్రానికి గాను ఆంధ్రప్రదేశ్ ఫిలిం నంది అవార్డు (ఉత్తమ చిత్రం) రావడంతో మరికొంత ఉత్సాహంతో దీన్ని తయారుచేశాను.

గోవును గురించిన పూర్తిసమాచారాన్ని అందరికీ తెలియజేయడం నా ధ్యేయం. ఈ పుస్తకంద్వారా గోవును గురించి తెలుసుకోగలిగితే, గోవును కూడా దేవునితో సమానంగా చూసి గోపూజకు పూనుకుంటారని నా ఆశ మరియు ఆశయం కూడానూ! గోసేవ చేసి గొప్ప ఫలితాలను పొంది లాభ పడతారని నా అభిలాష.


దేనిని నమ్మినా నమ్మకపోయినా సైన్సును నమ్మక తప్పదు. గోవువల్ల కలిగే లాభాలను తెలుసుకుని, రాష్ట్రప్రభుత్వం పట్టణాల్లో, పల్లెల్లో దీన్ని గురించి విస్తృత ప్రచారం చేసినట్లైతే, గొప్ప ప్రగతిని సాధించవచ్చు. ప్రస్తుతం నడుస్తున్నది కంప్యూటర్ యుగమని, గోవు కంటే ఫలితాల నిచ్చేవి ఇంకా ఏవో ఉన్నాయను కుంటే అది పొరపాటే అవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో అనేక గోశాలలు ఉన్నాయి. అవి స్వచ్ఛంద సంస్థలుగా బరువు, బాధ్యతలను మోసి, గోరక్షణ చేస్తున్నాయి. గోవులు ఆర్థిక, ఆరోగ్య, వైజ్ఞానిక, పర్యావరణపరంగా ఎంతో ఉపయోగకరమని చెప్పక తప్పదు. అలాగే గోసేవ ప్రతిఒక్కరి బాధ్యత, విధి, కర్తవ్యం.

ఈ పుస్తకంలోని అంశాలను నాకు తెలియబరచిన గ్రంథాలకు, మరియు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయసహకారాలు అందించిన వారందరికీ నా కృతజ్ఞతలు.

**- ఎస్. గోపాలకృష్ణ**





# విషయసూచిక


| విషయసూచిక | | పుట |
|---|---|---|
| 1. వేదాలలో గోవు | - | 1 - 9 |
| 2. పంచగవ్యములు | - | 9 - 23 |
| 3. గో సంరక్షణ | - | 23 - 35 |
| 4. జరిగిన కథలు - యథార్థసంఘటనలు | - | 35 - 55 |
| 5. గోవ్రతకథ | - | 55 - 64 |
| 6. విశ్వ గో సమ్మేళనం - గోసంస్కృతి | - | 64 - 72 |
| 7. గో పూజావిధానం | - | 72 - 94 |
| 8. గో మహితోక్తులు | - | 94 - 100 |
| 9. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని గోశాలలు | - | 100 - 103 |
| 10. q%ఖ QË‹ ¬ĺă #O Ð QË‹ Ө‹ ø$u Ð2007 | | 103 - 115 |
| 11. గోవిందుడు | - | 116 |

# వేదాలలో గోవు

**యజుర్వేదం :**

**'గో సమానా న విద్యతే'** - ప్రపంచంలోని ప్రాణులు అన్నిటికంటె ఆద్యంతము మనకు ఉపయోగపడేది గోవు మాత్రమే.

**సామవేదం :**

గోవునుండి లభించే ప్రతిపదార్థమూ పవిత్రమే. అందుకే గోవు మన శరీరాన్ని, మనస్సును, బుద్ధిని కూడా పవిత్రము చేస్తుంది. పర్యావరణములోని కాలుష్యాన్ని శుద్ధి చేస్తుంది. గోవు **('సదా గా వః శుచయః')**

**ఋగ్వేదము :**

గోవుయొక్క పాలు, పెరుగు, నెయ్యి, మూత్రము, పేడ (గోమయము) మొదలగు వీటిని పంచ గవ్యములు అని అంటారు. ఇవి పౌష్టికాహారములే గాక అద్భుతంగా పనిచేసే దివ్యౌషధాలు, అమృత తుల్యములు. **'అమృతస్య నాభిః'**

**అథర్వణ వేదం :**

**'ధేను స్సదనం రయీణామ్'** ఐశ్వర్యాలకు నిలయం గోవు - అష్టైశ్వర్యాలు గోవులో చోటుచేసుకున్నాయి. గోలక్ష్మితో రైతు ధనవంతుడవుతాడు. పాడి పంటలను అనుభవిస్తాడు.

**'గౌరగ్నిహోత్రమితి ప్రాణాపానాభ్యా మేవాగ్నిగ్ం**
**సమర్ధయతి అవ్యర్ధుకః ప్రాణాపానాభ్యాం భవతి య ఏవం వేద'.**

అగ్నిహోత్రుని సామర్థ్యం వల్ల గోవు సృష్టించబడింది. బ్రహ్మదేవుడు అగ్ని, వాయువు, ఆదిత్యులను సృష్టించాడు. బ్రహ్మ మానవులను హోమం ద్వారా సృష్టించాడు కనుక మనం కూడా హోమం చేసి సృష్టి చెయ్యాలని అగ్ని, వాయువు, ఆదిత్యులు హోమం చేశారు. **'ప్రాణానామగ్నిః తను వై వాయుః చక్షురాదిత్య'** అని అలా ఆ ముగ్గురూ హోమం చెయ్యగా గోవు పుట్టిందట - అప్పుడు ' ఆ గోవుపాలు ఎవరికి చెందాలి? వాటిని ఎవరు అనుభవించాలి?



అనే విషయంలో ఆ ముగ్గురికీ వివాదం ఏర్పడింది. ' నా సహాయం వల్లనే ఈ గోవు పుట్టింది కనుక నేనంటే నేనే అనుభవించాలి' అని ముగ్గురూ వాదించుకున్నారు. అలా ఏ పరిష్కారానికి రాలేక తీర్పు చెప్పమని బ్రహ్మ దగ్గరకు వెళ్లారు. ఎవరు ఏ విధంగా హోమం చేశారని అడిగాడు బ్రహ్మ. నేను ప్రాణదేవతను హోమం చేశానన్నాడు అగ్ని. శరీరాభిమాని దేవతకి హోమం చేశానన్నాడు వాయువు. చక్షుస్సులకి హోమం చేశానన్నాడు ఆదిత్యుడు. **'ప్రాణేభ్యః స్వాహా'** అని అగ్ని హోమం చేశాడు కనుక ఈ గోవు అగ్నికే చెందుతుందని బ్రహ్మదేవుడు తీర్పు చెప్పాడు. ప్రాణం లేకుంటే ఇంద్రియాలకు, శరీరానికి పని ఏముంది? 'ప్రాణముంటేనే గదా ఏమైనా?' అనే బ్రహ్మగారి వాదనను కాదనలేకపోయారు వాయువు, ఆదిత్యుడు. అగ్ని హోమం వల్ల పుట్టింది కనుక గోవుకు అగ్నిహోత్రత్వం ఉంది. గోవంటే సాక్షాత్తు అగ్నిస్వరూపమే. అగ్నివల్ల ఋగ్వేదం, వాయువువల్ల యజుర్వేదం, ఆదిత్యునివల్ల సామవేదం పుట్టాయి. అందుచేత అగ్ని, వాయువు, ఆదిత్యుల సామర్థ్యాల వల్ల జన్మించిన గోవును పూజిస్తే, పోషిస్తే మూడు వేదాల అధ్యయనఫలం, అగ్నిహోత్రఫలం లభిస్తుంది. గో పోషణ చేస్తే అగ్నిహోత్ర కర్మానుష్ఠానంవల్ల కలిగే ఫలం వస్తుందని వేదాల్లో చెప్పబడింది.

**'సూర్యోఽతివిద్యయా త్రయ్యా హవిషాగ్నేయ జేతమాం ఆతిథ్యేన తు విప్రాగ్నే- గోష్వంగ యవసాదినా' 'గావో విశ్వస్య మాతరః'** గోవు విశ్వానికే మాత - అని ప్రసిద్ధి చెందింది. అందుకే పూర్వులు దీనిని సేవించి ధర్మార్థ కామమోక్షాలు పొందారు.

ఆయుర్వేద గ్రంథాలు చరకము, సుశ్రుతము, ధన్వంతరి, భావ ప్రకాశాదులు ఆవువల్ల కలిగే లాభాలను లెక్కించలేమని పేర్కొన్నాయి.

ఉపనిషత్తులను గోవుగను, శ్రీకృష్ణుని గోపాలునిగను, ఉపనిషత్తుల సారాంశమైన గీతామృతమును పాలుగను, అర్జునుని దూడగను, జ్ఞానిని భోక్తగను పోలుస్తారు. శ్రీకృష్ణుని గోవిందుడు, గోపాలుడు, గోపాలకృష్ణుడు

అని కీర్తిస్తున్నాము. పంచపాండవుల్లో సహదేవుడు 'పశువైద్య' శాస్త్రాన్ని రచించాడు.

గోవు యొక్క పుణ్య నామమును ఉచ్చరించువాడు పుణ్యాత్ముడు అవుతాడు. గోబ్రాహ్మణ హింస జరిగే చోట అబద్ధమాడవలసి వచ్చి అబద్ధ మాడినా దోషం లేదని వ్యాసభారతం చెప్పింది.

**'సూర్యోగ్ని ర్బ్రాహ్మణో గావః వైష్ణవః ఖం మరుజ్జలం'** సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, గోవు మొదలైన పదకొండు స్థానములు అధిష్ఠానములని భాగవతంలో చెప్పబడ్డాయి. సూర్యోపాసన వేద త్రయముతో చెయ్యాలి - అగ్ని ఉపాసన హవిస్సులతో చెయ్యాలి- బ్రాహ్మణులకు అతిథి మర్యాదలు చెయ్యాలి- గోవుల సంరక్షణ చెయ్యాలి. వీటిని చేస్తేనే నేను సంతోషిస్తానని శ్రీకృష్ణుడు చెప్పాడు.

**కామధేనువు :**

దేవదానవులు క్షీరసాగరమథనం చేసే సమయంలో అమృతమునకు తోడు కల్పవృక్షం, కామధేనువు, శ్రీమహాలక్ష్మి కూడా వెలువడ్డాయి. కామ ధేనువు అంటే కోరిన వాటిని ఇచ్చే ధేనువు అని అర్థం. అట్టి కామధేనువు సంతానమే గోవు - దాని సంతానమే ధర్మస్వరూపము గల వృషభం. అదే శివుని వాహనమైన నంది. ప్రపంచంలోని పశుగణం కామధేనువు నుండి మనకు సంప్రాప్తమయిందని పురాణాలు చెబుతున్నాయి. దేవతలకు, ఋషు లకు, అవసరమైన పాలను ఇచ్చే మహత్తర శక్తిగలది ఈ దేవత.

పవిత్రమైన గోవుకు మూడు పేర్లున్నాయి. 1) కామధేనువు, 2) సురభి 3) నందిని. ఈ మూడూ మూడు రకాల ఆవులు కావని తెలుసుకోవాలి. ఈ విషయం వ్యాసభారతం (అరణ్యపర్వం, అధ్యాయం 9, 7-17 శ్లోకాల్లో) చెప్పబడింది. దీనిలో సురభి, కామధేనువు అనే పేర్లు గోవులకు పెట్టబడ్డాయి. వ్యాసభారతం ఆదిపర్వంలో అధ్యాయం 99 (ప.14)లో నందిని అనే పేరు



ఆవుకు పెట్టబడింది. పురాణాల్లో సురభిని దక్షుని కుమార్తెగా, కశ్యపుని భార్యగా వర్ణించారు. సురభికి రోహిణి, గాంధర్వి పుట్టారు. ప్రపంచంలో రోహిణి ద్వారా ఆవులు, గాంధర్వి ద్వారా గుఱ్ఱాలు పుట్టాయి.

**కామధేనువుకు దైవిక శక్తులు ఎలా వచ్చాయి?**

**(మహాభారతం ఆనుశాసనిక పర్వం, అధ్యాయం 99)**

పూర్వం కశ్యప మహాముని భార్య అదితి మహావిష్ణువును తన గర్భంలో పెంచింది - ఒంటి కాలిపై నిలబడి తపస్సు చేసింది. ఆ సమయంలో సురభి కైలాసానికి వెళ్ళి బ్రహ్మకోసం పదివేల సంవత్సరాలు తపస్సు చేసింది. దేవతలు ఆమె తపస్సుకు మెచ్చి బ్రహ్మతో కలసి సురభి దగ్గరకు వచ్చి 'సురభీ! నీకు మేము దేవతాపదవి నిస్తున్నాము. నీవు స్వర్గం, భూమి, నరకం ఈ మూడు లోకాలకు పైనుంటావు. అదే గోలోకంగా ప్రసిద్ధి పొందుతుంది. ప్రజలంతా నిన్ను కొలుస్తారు. గోవులంతా నీకు చెందినవే' అని చెప్పారు. పురాణాల్లో వసిష్ఠుని ఆశ్రమంలో ఒక కామధేనువు, వరుణునితో ఒక కామధేనువు, మరొకటి క్షీరసాగరమథనంలో పుట్టినది.

వ్యాసభారతం, ఉద్యోగపర్వం, అధ్యాయం 102లో బ్రహ్మ అమృతాన్ని ఎక్కువగా త్రాగితే, నోటినుంచి కారిన నురుగులో నుంచి కామధేనువు పుట్టిందని, అది 'రసాతల' లోకంలో నివసిస్తోందని చెప్పబడింది.

ఒకనాడు శ్రీకృష్ణుడు,రాధ ఏకాంతప్రదేశంలో విహరిస్తూండగా అలసిపోయి పాలు తాగాలనిపించిన సమయంలో శ్రీకృష్ణుడు తన ఎడమచేతి ప్రక్కనుండి తన మనశ్శక్తితో సురభి అనే ఆవును, మనోరథమనే దూడను సృష్టించాడు. ఆవుపాలు పితికి త్రాగుచుండగా చేతిలోని కుండ జారి క్రింద పడి పాలు నేలమీద ఒలికిపోయాయి. ఆ పాలు వంద యోజనాలు విస్తరించి ఒక నదిగా పారాయి. దానిలో రాధ ఆమె చెలికత్తెలు స్నానం చేసి ఆనందించారు. అక్కడ లెక్కలేనన్ని ఆవులు పుట్టాయి. వాటిని శ్రీకృష్ణుడు గోపికలకు

బహుమతిగా ఇచ్చాడు. (దేవీభాగవతం - 9వ స్కంధం) ఈ విధంగా కామ ధేనువులు ఆశ్రమాల్లో ఉన్నట్లు పురాణాల్లో కనిపిస్తాయి.

బ్రహ్మ కృపతో కామధేనువులకు దైవికమైన శక్తులు లభించాయి. కశ్యప ప్రజాపతి కుమార్తె కామధేనువు నుంచి అనేక కామధేనువులు ఉద్భవించాయి. శ్రీకృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని గొడుగుగా మార్చి గోవులను కాపాడి, ఇంద్రుని జయించాడు. అప్పుడు కామధేనువు గోకులానికి వచ్చి క్షీరంతో శ్రీకృష్ణునికి అభిషేకం చేసిందని భాగవతం 10వ స్కంధంలో ఉంది.

## కార్తవీర్యార్జునుని గర్వభంగం చేసిన సురభి :

సప్తఋషులలో ఒకరైన జమదగ్ని రేణుకను వివాహం చేసుకుని, హోమధేనువు సురభిని సంపాదించి దాని మహిమతో సుఖజీవనాన్ని సాగించాడు. అపకారికి ఉపకారం చేసే సుగుణశీలి, కరుణాసముద్రుడు జమదగ్ని.

కార్తవీర్యార్జునుడు సైన్యంతో ఒకసారి జమదగ్ని ఆశ్రమానికి వస్తాడు. అతని రాకకు సంతోషించి హోమధేనువు సహాయంతో షడ్రసోపేతమైన విందు ఏర్పాటు చేస్తాడు. కార్తవీర్యార్జునుడు అందుకు సంతోషించి ఆ సురభి తనకు కావాలనికోరుతాడు. జమదగ్ని నిరాకరిస్తాడు. అందుకు కోపించిన కార్త వీర్యార్జునుడు జమదగ్నిపై యుద్ధం ప్రకటించగా, జమదగ్ని సురభి సహాయంతో సైన్యాన్ని సృష్టించుకుని యుద్ధం చేస్తాడు. ఘోరయుద్ధం జరుగగా సురభి సైన్యం ముందు రాజుసైన్యం ఓడిపోతుంది. 24సార్లు యుద్ధం చేయగా అన్నిసార్లూ రాజు ఓడిపోతాడు. ఇంకేమీ చేయలేక జమదగ్నిని సంహరించి, ధేనువు కోసం చూడగా, ధేనువు అక్కడి నుంచి మాయమైపోతుంది. ఈ విషయం తెలుసుకున్న భృగుమహర్షి జమదగ్నిని బ్రతికిస్తాడు. ఆ విధంగా సురభి కార్తవీర్యార్జునుని గర్వం అణుస్తుంది.

ఒకసారి జమదగ్ని మహర్షి తన తపోమహిమతో గోలోకానికి వెళ్లి కామధేనువును మెచ్చుకుంటే, ఆమె తన చెల్లెలు సుశీలను జమదగ్ని కిచ్చింది. అగ్నిపురాణం 18వ అధ్యాయంలో కామధేనువు అజస, ఏకపాత్, అహిర్ బుధ్ని, త్వష్ట, రుద్ర, విశ్వరూప అనే సంతానాన్ని కన్నట్లు చెప్పబడింది.



## సత్యవ్రతుడు (త్రిశంకుడు) కామధేనువును దొంగిలించుట :

సత్యవ్రతుడు ఇక్ష్వాకు వంశీయుడైన రాజు. అరుణకుమారుని కుమారుడు. అతడు కుటిలుడు. అవినీతిపరుడు. ఒక రోజు ఒక బ్రాహ్మణ నవ వధువును వివాహానికి ముందుగా వశపరచుకుని అనుభవించాడు. దానితో అతని తండ్రి కోపించి అతనిని రాజభవనం నుంచి పంపేశాడు. అతడు దిక్కుతోచక అడవులపాలయ్యాడు. అప్పటినుండి ఆ రాజ్యంలో కరువు కాటకాలు సంభవించాయి. మనుష్యులు, జంతువులు ఆకలితో చనిపోవ సాగాయి. ఆ సమయంలో విశ్వామిత్రుడు తన ఆలు బిడ్డలను వదలి ఘోర తపస్సులో ఉన్నాడు. ఆ సమయంలో క్లిష్టపరిస్థితుల్లో నున్న కుటుంబపోషణ నిమిత్తం విశ్వామిత్రుని భార్య తమ సంతానంలో ఒక కుమారుణ్ణి అమ్మకానికి పెట్టాలని బయలుదేరుతుండగా సత్యవ్రతుడు వచ్చి 'మీ కుమారుని అమ్మ వద్దు. నేను ప్రతిదినం కొంత మాంసం తెచ్చి మీకు ఇస్తాను. దానితో వారిని బ్రతికించండి' అని ఆదుకున్నాడు. ప్రతిరోజూ అలాగే చేశాడు. ఒక రోజు అతనికి మాంసం దొరకలేదు. అందుకని వసిష్ఠుని ఆశ్రమం లోని కామ ధేనువును దొంగిలించి, చంపి, తాను కొంత మాంసం తిని, తక్కిన దానిని విశ్వామిత్రుని కుటుంబానికిచ్చాడు.

మర్నాడు వసిష్ఠుడు ఈ విషయాన్ని తన దివ్యదృష్టితో గ్రహించి సత్యవ్రతుణ్ణి శపించాడు. సత్యవ్రతుడు మూడు తప్పులు చేశాడు. అవి ఆవును చంపడం, పరాయి స్త్రీని పొందడం, తండ్రికి అమర్యాద తేవడం. ఈ మూడు పాపాల ఫలితం అతడిని త్రిశంకునిగా శపించాడు. కామధేనువును బ్రతి కించాడు. (దేవీ భాగవతం - 7వ స్కంధం)

## విశ్వామిత్రుడికి కామధేనువుచే పరాభవం :

విశ్వామిత్రుడు రాజ్యపాలన చేస్తూ ఒకనాడు వేటకు వెళ్లాడు. అడవి దారిలో వసిష్ఠుని ఆశ్రమాన్ని దర్శించడం జరిగింది. వసిష్ఠుడు అతడిని అతిథిగా భావించి, అభ్యాగతునిగా ఆదరించి, తన కామధేనువును 'విశ్వామిత్రునికి,

అతని శిష్యులకు విందును ఏర్పాటు చేయుమని' ఆజ్ఞాపించాడు. కామ ధేనువు తన దైవీశక్తితో తక్కువ సమయంలోనే విందును ఏర్పాటు చేసింది. విశ్వామిత్రుడు తృప్తి చెంది కామధేనువును పొగడి, ఆ కామధేనువును తన కివ్వుమని వసిష్ఠుడిని అడిగాడు. కాని వసిష్ఠుడు అతని కోరికను నిరాకరించాడు. ఆ గోవుకు బదులుగా కోట్ల గోవులను ఇస్తానన్నాడు. కోపించి, పట్టుదలతో విశ్వామిత్రుడు కామధేనువును బంధించి, బలవంతంగా తీసుకెళ్ల డానికి ప్రయత్నించాడు.

కామధేనువు కోపోద్రేకంతో కంపించి, తన శరీరం రోమకూపాలనుంచి సైన్యాన్ని పుట్టించి, విశ్వామిత్రుడిని, అతడి పరివారాన్ని తరిమికొట్టింది. విశ్వామిత్రుని బాణాలన్నింటిని వసిష్ఠుడు తన యోగదండంతో నిలువ రించాడు. క్షత్రియుల శక్తికంటే బ్రాహ్మణశక్తి గొప్పదని విశ్వామిత్రుడు గ్రహించి తన రాజ్యాన్ని కుమారునికి అప్పగించి, తపస్సు చేసుకుందామని వెళ్లిపోయాడు. రాజు ఋషిగా మారాడు. (వాల్మీకి రామాయణం - బాలకాండ 52 సర్గ), (మహాభారతం - శల్యపర్వం, అధ్యాయం 40), (మహాభారతం - ఆదిపర్వం - అధ్యాయం 175)

మహాభారతంలో వైష్ణవధర్మ ప్రసంగం (బృహత్ అవాంతర పర్వం) కేవలం గో మహిమ మీదే జరిగింది. విష్ణు ధర్మోత్తర పురాణం, అగ్నిపురాణాల్లో మధురంగా, ఆకర్షణీయంగా, భక్తితో కూడిన వైదికసూక్తులు ఉప బ్రాహ్మణ స్వరూపమైన గో మహిమను గురించి వివరించబడింది.

ఆమూలాగ్రం భారతదేశం గో భక్తులతో నిండి ఉంది. ప్రాచీన సాహిత్యం, వైదిక, ఆరణ్యకోపనిషత్తులు, వైదిక వాఙ్మయం గోరక్షణ, గోపాలన సంబంధ వివిధ మార్గాల గురించి చెప్పబడింది. వేదాల్లోని ఉప బ్రాహ్మణ భూత చరిత్రలో గో మాహాత్మ్యం మీద విశేషాలెన్నో లభిస్తాయి. సర్వశ్రేష్ఠమయిన క్షేమం కలుగుతుంది. గోవుకు బాధ కలిగించడం మహాపాపం. అందువల్ల దుఃఖాలే కలుగుతాయి.



గోవులు నిత్యం సురభిరూపిణులు. పుణ్యమైన సుగంధాన్ని వెదజల్లేవి. గుగ్గులువంటి సువాసనలతో కూడినది గోవు. ఆవులతోనే ప్రాణికోటి ముడిపడి ఉంది. గోవు ధర్మ, అర్థ, కామ, మోక్షదాయిని. ఆవులు సర్వోత్కృష్టమైన ఆహారాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఆవు తన జీవితకాలంలో నాలుగు లక్షల పదివేల నాలుగు వందల నలభైమందికి ఒకపూట భోజనాన్ని ఇస్తుందట.

**నందినీ ధేనువు :**

దిలీప మహారాజుతో నందినీ ధేనువు ఇలా అందిట.**'న కేవలం పయసాం ప్రసూతిమ్ - అవేహి మాం కామదుఘాం ప్రసన్నాం'** - నన్ను కేవలం పాలిచ్చు పశువుగా మాత్రమే పరిగణించకండి - నేను ప్రసన్ననైతే మీ కోరిక లన్నింటిని తీరుస్తాను అని-

భూమాత గోరూపంలో దర్శనమిస్తుందని శ్రీమద్భాగవతంలో ఉంది. సకల తీర్థ దేవతా స్వరూపిణి గోమాత.

**గో విశ్వరూపం :**

గోవు యొక్క కంఠం మస్తకం మధ్య గంగ కలదు. గోవు యొక్క సమస్త అంగములయందు సమస్త దేవతలు గలరు. సప్తఋషులు, నదులు, తీర్థములు గోవులో గలవు - ఆవు యొక్క నాలుగు పాదాల్లోనూ ధర్మార్థ కామ మోక్షము లుంటాయి. అందుకే ఆవు కాళ్ళను కడిగి, ఆ నీరు తలపై చల్లుకుంటే పాపాలు నశిస్తాయి. ఆవు ముఖంలో నాలుగు వేదాలుంటాయి. అందుకే ఆవును ముందు ప్రవేశపెట్టి, ఆ తర్వాతనే నూతనగృహంలో యజమాని ప్రవేశి స్తాడు. గోధూళితో నవగ్రహ దోషాలు తొలగిపోతాయి. గోవుకి నవధాన్యాలు, ఆకుకూరలు, పళ్లు మొదలైనవి తినబెడితే శుభం కలుగుతుంది. ఋణగ్రస్తులు బాధల నుండి బయటపడతారు. అందుకే పండుగల్లోనూ, శుభకార్యాల సందర్భంగానూ గోపూజలు, గోదానం చేయడం అలవరచుకోవడం మంచిది.

సూర్యచంద్రులు, శివుడు, కుమారస్వామి, గణపతి, విష్ణుమూర్తి, బ్రహ్మ, సరస్వతి, హనుమంతుడు, నవగ్రహాలు, పర్వతాలు, కుబేరుడు, అగ్ని,

వరుణుడు, నాగరాజు, నారదుడు, లక్ష్మి, భౌమాదేవి, భైరవుడు, వాయుదేవుడు మొదలగు 33 కోట్లమంది దేవతలు గోవు శరీరంలో నివసించి ఉంటారు. గోవునకు ఆహారం సమర్పించినట్లైతే, 33 కోట్ల దేవతలకు నైవేద్యం సమర్పించినట్లే. అందుకే గోప్రదక్షిణం చేస్తే భూప్రదక్షిణం చేసినట్లు అన్నారు. గో పూజకు భక్తి ప్రధానం కాని మడి ప్రధానం కాదు. సూక్ష్మంలో మోక్షాన్ని పొందాలంటే గోపూజ, గోరక్షణ, గోదానం, గోవధ నిషేధం మన కర్తవ్యం.

**పంచగవ్యములు :**

గోవు ద్వారా పంచగవ్యములు లభిస్తాయి. పాలు, పెరుగు, నెయ్యి, మూత్రము, గోమయము. (పేడ) **'యత్త్వగస్థిగతం, పాపం దేహే తిష్ఠతి మామకే। ప్రాశనాత్ పంచగవ్యస్య దహత్యగ్ని రివేంధనమ్'** చర్మము నుండి ఎముకల వరకు శరీరములో గల రోగములు, అగ్నివలన ఇంధనము కాలిపోవునట్లు పంచగవ్యముల వలన నశించిపోవును. రసః, కటు, తిక్త, కషాయ, మధుర, లవణములు పంచరసయుక్తములు.

**గవ్యం పవిత్రం చ రసాయనం చ పథ్యం చ హృద్యం బలమూర్జితం స్యాత్।**
**ఆయుఃప్రదం రక్తవికాసహారి, త్రిదోష, హృద్రోగ, విషాపహం స్యాత్॥**

పంచగవ్యములు గొప్ప రసాయనములు. పథ్యము మనసుకు ఆనందము నిచ్చునది - బలము, బుద్ధి, ఆయువును ఇచ్చును. రక్త దోషములను తొలగించి; కఫము, వాతము, పిత్తము వలన కలుగు హృదయ రోగములను తొలగించును.

**గవ్యం సుమధురం కించిద్ దోషఘ్నం కృమి కుష్ఠనుత్।**
**కణ్డూతిం శమయేత్ వాతం సమ్యక్ దోషాపహం హి తత్॥**

(సుశ్రుత సంహిత - 500 సం॥ క్రిందటి ఆయుర్వేద గ్రంథం)

గోమూత్రం వగరు, కషాయము వలె తీక్ష్ణము, ఉష్ణము, మస్తిష్కమునకు బలము నిచ్చును. కఫ వాతములను హరించునది - శూలము, గుల్మము, ఉదరము, కుష్ఠవ్యాధి రోగములను పోగొట్టును.



**1. గాయత్ర్యా గోమూత్రం :**

**తత్సవితు ర్వరేణ్యం భర్గో దేవస్య**
**ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ ॥**

**2. గంధాద్వారేతి గోమయం :**

**గన్ధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్-**
**ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియమ్॥**

**3. ఆప్యాయస్వేతి క్షీరం :**

**ఆప్యాయస్వ సమేతు తే విశ్వతః**
**సోమవృష్ణియం భవావాజస్య సంగథే**

**4. దధిక్రావణ్ణో ఇతి దధి :**

**దధిక్రావణ్ణో అకారుషం। జిష్ణోరశ్వస్య**
**వాజినః సురభినో ముఖాకరత్। ప్రణఆయూగుంషితారిషత్ ॥**

**5. శుక్రమసీతి ఘృతం :**

**శుక్రమసి జ్యోతిరసి తేజోఽసి దేవో వః**
**సవితో పునాత్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసో స్సూర్యస్య రశ్మిభిః**

ఈ ఐదింటిని పంచగవ్యములు అని మనం అంటాము.

1. అందుకే ఆవునుండి వచ్చే పదార్థములు పాలు, పెరుగు, నెయ్యి మొదలగునవి ఉష్ణముతో కూడినవి (వేడిమి) అయిననూ **'ఘృతేన వర్ధతే బుద్ధిః'** ఆవు యొక్క నెయ్యి తినడం వల్ల మేథాశక్తి పెరుగునని శాస్త్రాల్లో కూడా చెప్పబడింది.
2. గోమూత్ర ప్రాశనం వల్ల రక్తపోటు మొదలగు వ్యాధుల నుండి విముక్తి లభించును. విద్యార్థులకు గోమూత్ర ప్రాశనం వల్ల ధారణశక్తి ఎక్కువగా

కలుగుతుంది. అందుకే వైదికపరమైన కార్యాల్లో, వేద పాఠశాలల్లో గో మూత్రము నకు ప్రాధాన్యత ఎక్కువగా ఇవ్వడమైనది.

మన శరీరము పృథ్వి, వాయువు, జలము, అగ్ని, ఆకాశము లను ఐదు తత్త్వములతో ఏర్పడుచున్నది. ఈ ఐదు తత్త్వములు పంచగవ్యములుగా లభించును. పంచగవ్యములలోని పంచతత్త్వములు దివ్యౌషధములు. మలబద్ధకము నుండి క్యాన్సరు వరకూ అన్ని రోగములను నివారించును.

**'గోమూత్రే త్రిదినం స్థాపయ, విషం తేన విశుధ్యతి'** ఆవు కడుపులోనికి విషపదార్థాలు ప్రవేశిస్తే, దానిని పాలతో మూత్రంలో కలియనీయకుండా వేరు వేరుగా నుంచును. మిగిలిన జంతువులకు అలా జరుగదు. కనుకనే గోక్షీరం, గోమూత్రం, గోమయం సమస్త రోగనాశకములు. అందుకే వీటిని పంచ గవ్యములలో చేర్చారు.

**ఆవు పాలు :**

**ప్రవరం జీవనీయానాం క్షీరముత్తమం రసాయనమ్** (చరకశాస్త్రం). జీవనశక్తి గల భోజన పదార్థాలన్నింటిలోనూ ఆవుపాలు అత్యంత జీవనీయ తత్త్వం గలవి. ఆవుపాలు హృద్రోగాలను దరిజేరనియ్యవు. జ్ఞాపకశక్తిని, బుద్ధిబలాన్ని, ఓజస్సును పెంచేశక్తి ఆవు పాలకుంది. దానిలో ఓరోటిక్ రసాయనం ఉండడం వల్ల చిన్న పిల్లలకు పచ్చకామెర్లు రానీయదు. లాక్టో కోకస్, బోసిన్, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. అటామిక్ రేడియేషన్ నుండి రక్షించగల సర్వాధిక శక్తి ఆవుపాలల్లో ఉందని రష్యన్ శాస్త్రజ్ఞుడు పేర్కొన్నాడు. ఆవు వెన్నెముకలోని సూర్యకేతు నాడి సూర్యుని ప్రకాశంతో చేతనం పొందిన కణంలో ఒక పసుపుపచ్చని పదార్థాన్ని వదులుతుంది. స్వర్ణ తత్త్వం గల ఈ పాలకు విషాన్ని హరింపచేసే శక్తి ఉంది. తల్లి పాలవలె సులభంగా జీర్ణం అయ్యే శక్తి ఆవు పాలల్లో ఉంది. ఇది సంపూర్ణాహారము. శరీరంలో తేలికగా ఇముడును. ఆవుపాలతో ఆరోగ్యము ఉత్సాహము



చేకూరును. శిశువులకు, వృద్ధులకు చాలా శ్రేష్ఠము. క్రొవ్వు ఉండదు. ఆవుపాలలో ప్రొటీనులు, కార్బోహైడ్రేట్లు, ఖనిజాలు, విటమినులు, మెగ్నీషియం, క్లోరిన్ మొదలగు లోహాలున్నాయి. ఎ, బి, సి, డి, ఇ, విటమిన్లు ఉన్నాయి. కనుకనే మనకు ఆవుపాలు మంచి శక్తినిస్తాయి. ఆవుపాలలో, ఆవు నెయ్యిలో అణుబాంబు విషమును నిరోధించే శక్తి గలదు. ఈ పాలలో Strontirin తత్త్వమున్నది. అది అణు వికీరణమును నిరోధించగలదు. చంటి పిల్లల తల్లులు, గర్భవతులు, అనారోగ్యముగా ఉన్నవారు, బలహీనులు అందరూ సేవించవచ్చును. దీనిలో సెరిబ్రోయిడ్ తత్త్వం ఉన్నందువల్ల మానసిక వికాసమునకు తోడ్పడును. ఆవుపాలు చలువ చేస్తాయి. అందుచే పిత్త వికారములు తొలగును. అల్సర్, ఎసిడిటి, దాహం, వేడి శరీరం గలవారికి ఎంతో శ్రేష్ఠం. జలోదర వ్యాధిగ్రస్తులకు ఆవుపాలు సేవించిన వ్యాధి ఉప శమించును. ఆవు పాలు, పెరుగు, మీగడల యందు పౌష్టికాహారము మిన్న - వీటిని సేవించుట వల్ల పూర్తి ఆరోగ్యము, రోగనిరోధక శక్తి పొందవచ్చును. ఆవు పాలతో తయారయిన మిఠాయి ధాతువర్ధన, వీర్యవర్ధన, కాంతివర్ధన కారులు. ఆవుపాలలో విటమిన్ ఎ-100, ఆవు నేతిలో ఎ-1900, పాలకోవాలో ఎ-400 యూనిట్లు ఉన్నాయి. ఆవుపాలలో యం.డి. జిజైజ్ ప్రొటీనులు ఉన్నందువల్ల అవి క్యాన్సర్ వ్యాధిని నిరోధించును. ఆవుపాలలో, ఆవు నెయ్యిలో కలిపిన వేడి వేడి హల్వా తిన్నట్లయితే క్యాన్సర్ తగ్గుతుంది. గ్రహణవ్యాధి నివారణకు, పదకొండు కిస్మిస్ పండ్లు, ఆవు పాలలో నానబెట్టి తినాలి. ఆ పాలు కూడా త్రాగాలి. అందులో పంచదార కలపరాదు. ఈ విధంగా పదకొండు రోజులు చేస్తే వ్యాధి నివారింపబడును. 5 కిస్మిస్, 5 ఎండుద్రాక్షపండ్లు, ఆవుపాలలో నానబెట్టి మలేరియా రోగి ఉదయం తిన్నట్లయితే వ్యాధి తగ్గును. వ్యాధి ముదిరినచో 10 గ్రాములు శొంఠి చూర్ణం కూడా కలిపి తిన్నట్లయితే వ్యాధి దూరమగును.

గర్భవతులయిన స్త్రీలు ఆవుపాలు త్రాగుతూ, ఆవును భక్తితో పూజించి, గోవు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే వారికి గర్భపాతదోషం పోతుంది. ఆరోగ్య

వంతులు, గుణవంతులు, బుద్ధిమంతులు, యోగ్యు లయిన సంతానాన్ని పొందుతారు. సుఖప్రసవం కూడా జరుగుతుంది. ఆవు యొక్క రంగును బట్టి పాలలో విశేషగుణాలున్నాయి. ఎరుపురంగు ఆవుపాలు పిత్తాన్ని హరిస్తాయి. తెల్లరంగు ఆవుపాలు కఫాన్ని నాశనం చేస్తాయి. నలుపురంగు ఆవుపాలు వాత నాశనకారి. ఆరవైఆరు పిండివంటలు ఆవు చంటిలో నున్నాయని పెద్దలంటారు.

సమస్త దేవతలకు ప్రీతి అయినవి ఆవు పాలు. పంచామృతాలు లేనిదే దేవతార్చనలు లేవు. '**గంగి గోవుపాలు గరిటెడైనను చాలు**' అంటారు.

**గాం జలం క్షీరం వా పిబంతీం న నివారయేత్**
**దోహనార్థం వారణా దన్యత్ర నిషేధః**
**నాపి పరకీయ క్షీరాది పిబంతీం తస్య జ్ఞాపయేత్ ॥**

నీరు త్రాగుచున్న గోవును, పాలు త్రాగుచున్న దూడను వారించ కూడదు. ఒరుల దూడలు పాలు త్రాగుచున్న విషయం వారికి తెలియ నియ్యకూడదు.

**జగత్ప్రసూతి ర్జగదేకపావనీ**
**వ్రజోపకంఠం తనయై రుపేయుషీ ।**
**ద్యోతిం సమగ్రాం సమితి ర్గవామసా**
**వుపైతి తం తైరివ సంహితాహుతిః ॥**

గోవులు జగత్తునంతటిని పావనం చేస్తాయి. గోవుల జగదేక పావనత్వం ఏమిటంటే ఏ పాపాలు చేసినవా రెవ్వరైనా ప్రాయశ్చిత్తం కొరకు పంచగవ్యాలు స్వీకరిస్తారు. నూతన గృహప్రవేశంలో ఆవుపాలు పొంగించడం, సూర్యదేవునికి ఆవుపాలు పొంగించి నైవేద్యం పెట్టడం మన సంస్కృతి.

లేత పసుపురంగు(బంగారురంగు) ఆవు పాలకు మాత్రమే ఉంటుంది. ఇది కిరోటిన్ అనే పదార్థము వల్ల వస్తుంది. ఈ రసాయనం గొంతు, ఊపిరి



తిత్తులు, మూత్రావయవములోని సున్నితమైన పొరలను పటిష్ఠం చేసి క్యాన్సర్ వ్యాధిని నిరోధించును. వాటివల్ల 'ఎ' విటమిన్ ఉత్పత్తి అయి, కంటి సంబంధ మైన రేచీకటి మొదలైనవాటిని నిరోధిస్తుంది.

మినపపిండి 10 గ్రాములు, గుగ్గిలం 10 గ్రాములు, 10 గ్రాములు ఏరండ తైలం, 10 గ్రాములు తాజాగా తీసిన ఆవు వెన్న విలేపనం తయారు చేసి ఉదయం, సాయంత్రం ఒక నెల రోజులు మర్దన చేస్తే గుండె సంబంధ మగు నొప్పులు తగ్గును. అందుకే ఆవు పాలు, పెరుగు, నెయ్యి వీనిని పౌష్టి కాహారంగా గ్రహించాలి.

**జెర్సీ ఆవులు :**

క్రాస్‌బ్రీడ్ ఆవులు మనదేశపు వేడికి తట్టుకోలేవు. వాటిని పెంచడం చాలా వ్యయ ప్రయాసలతో కూడినది. దేశవాళీ ఆవులకంటే రెట్టింపు తింటాయి. మనదేశంలో లేని రోగాలను మనకు తెచ్చి నష్టం కలుగజేస్తాయి. జెర్సీ ఆవు పాలు నాసిరకంగా ఉంటాయి. దేశవాళీ ఆవు పాల విలువలు జెర్సీ ఆవుపాలకు రావు. జెర్సీ ఆవులు మూపురాలు కూడా తక్కువగా ఉండడం వల్ల వ్యవసాయంలో కూడా దున్నడానికి పనికి రావు. ఆవుదూడను సంస్కృతంలో 'వత్స' అంటారు. '**వదతి మాతరం ఇతి వత్సః**' దూడ తన తల్లిని 'మా' అని పిలుస్తుంది. '**భక్తవత్సలః భగవాన్**'. మరియు '**ప్రజావత్సలః రాజా**'. వత్సయొక్క భావం వాత్సల్యం. బాలలను '**వత్స**' అని సంబోధిస్తాము.

మనదేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం పాలల్లో ఆవుపాలు 42శాతం మాత్రమే ఉండగా, ప్రపంచ సగటు 85శాతంగా ఉంది. ఆవుపాల ఉత్పత్తు లను ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఆవుల పెంపకాన్ని పెంచాలి.

**ఆవు పెరుగు :**

ఆవు పెరుగు, మజ్జిగ ఆకలిని పెంచుతాయి. జీర్ణశక్తిని కలిగిస్తాయి. వెండి పాత్రలో తోడు పెట్టిన పెరుగు చాలా మంచిది. ఆవు పెరుగు పంచా

మృతాలలో చేరుతుంది. దేవతలకు ప్రీతికరమైనది. దీనిలో క్రొవ్వు పదార్థం ఉండదు. ఆవు మజ్జిగలోని లాక్టిల్ జీవాణువులు శరీరంలో రోగనిరోధకశక్తిని పెంచుతాయి.

ఆవు పెరుగు సారాయి, బ్రాంది, గంజాయి, హెరాయిన్ మత్తు పదార్థాల తీవ్రతను తగ్గించును. ఆవు మజ్జిగను మూడుపూటలా తీసుకుంటే క్షయవ్యాధి నివారణమగును. మలేరియా నివారణకు 400 గ్రాములు పాలు విరగగొట్టి ఆ విరుగుడు, పంచదార కలిపి చిలికి వాడిన జ్వర నివారణ కలుగును. ఆవు పాలలో కొలెస్ట్రాల్ లేనందున గుండెకు రక్తమునకు ఏ విధమైన హాని కలుగదు.

**ఆవు నెయ్యి :**

దీనిని అమృతం అంటారు. ఇది బలము, ఆయువు, ఓజస్సు, తేజస్సులను ఇచ్చును. దీనిలో ప్రాణవాయువు ఉండును. శరీరమునకు పోషకశక్తి నిచ్చును. ఇది ఒక ఓషధి - ఆవునేతి వల్ల గాఢనిద్ర లభిస్తుంది; రోగనిరోధకశక్తిని పెంచుతుంది.

ఆవు నెయ్యి హోమం చేసిన ఆ పొగ ఎంతవరకు వ్యాపిస్తుందో అంత వరకూ అణు కీటకాలు నశిస్తాయి. కృత్రిమ వర్షం కురిపించడానికి అవసర మైన 'ప్రొపలీయన్ గ్యాస్' ఆవునేతి హవనం వల్ల వస్తుంది - బియ్యము ఆవునేతితో కలిపి హోమం చేయుట వల్ల ఇథలిన్ ఆక్సైడ్, ప్రొవలిన్ ఆక్సైడ్, ఫార్మా జొయాసిడ్ వాయువులు వెలువడును. ఈ వాయువులు జీవాణు రక్షణకు ఉపయోగపడతాయి.

ధర్మమునకు మూలం గోవు. యజ్ఞములు కేవలం గోవు యొక్క నెయ్యితోనే సఫలం అవుతాయి. నేటి ముఖ్య సమస్య అయిన వాతావరణ కాలుష్యం ఆవు నేతితో చేసిన యజ్ఞం ద్వారానే నివారణ అవుతుంది.యజ్ఞము చేయు స్థలం కూడా గోమయం, గోమూత్రంతోనే శుద్ధి అవుతుంది. ఆవు నెయ్యి శరీరములో కాంతిని వృద్ధి చేయును. అలసటను దూరం చేస్తుంది.



శరీరములోని దోషాలను శుద్ధి చేసి విషాన్ని అంతం చేస్తుంది. పిల్లలకు, వృద్ధులకు అవసరమైన సమస్త పోషక పదార్థాలను ఇస్తుంది.

ఒక తులం ఆవు నెయ్యితో యజ్ఞ యాగాదులు నిర్వహిస్తే ఒక టన్ను ఆక్సిజన్ లభిస్తుంది.

**గోమయం :**

భగవంతుని సృష్టిలో ఏ ప్రాణి యొక్క మూత్ర, పురీషాలకు ఇంత ప్రాధాన్యత లేదు. గో మూత్ర పురీషాలకు మాత్రమే ఉంది. అందుకే గోవును జగదేకపావని అన్నారు.

**గోమయేన సదా స్నాయాత్ కఱిషి చాప్యుపవిశేత్ ।**

(మహాభారతం, ఆనుశాసనికపర్వం)

ప్రతిరోజు పెండ పూసుకుని స్నానము చేయుట, ఎండిపోయిన పేడపై కూర్చొనుట చెయ్యాలి.

**గోష్ఠాంగణ గతిప్రియః**

(పురుషోత్తముని సహస్ర నామావళి - 10వ స్కంధం)

శ్రీకృష్ణుడు గోశాలలో పేడలో ఆటలాడుకొనుటకు ఇష్టపడతాడని చెప్పబడింది.

**గోమూత్రేన స్నాపయిత్వా, పునర్గోరజ సార్ధకమ్।**
**రక్షాం శకృత్ కృత్వా, ద్వాదశాంగేషు నామభిః॥**

(శ్రీమద్భాగవతం)

శ్రీకృష్ణుడు పూతన దగ్గర పాలు తాగిన తర్వాత గోపికలు శ్రీకృష్ణునికి స్నానం చేయించి గోరోజనం పెట్టి శరీరమంతా పేడరాశారు. పేడ గొప్ప మాహాత్మ్యం గలది.

**'యన్మే రోగం శోకం చ తన్మే దహతు గోమయమ్'**

పేడతో స్నానం చేసిన శరీర రోగములు తగ్గిపోవును. గోమయ మహత్తు వర్ణింపశక్యంకానిది. అది క్రిమికీటకనాశనము. కాంతిప్రదము, దుర్గంధ నాశకము, వీర్య వర్ధకము, శోధన గావించునది. పరమ పవిత్రమైనదిగా చెప్పబడినది.

భోపాల్ విషవాయువు వచ్చిన సమయంలో ఒక ఇంట్లో విషవాయువులు ఏమీ చేయలేకపోయాయట. ఆ యింట్లో ఏమీ చెక్కు చెదరలేదట. కారణం ఏమిటో తెలుసా? ఆ ఇంట్లో ఆవుపేడతో యజ్ఞం చేశారు కాబట్టి.

ఆవుపేడ కాలుష్యం లేని ఎరువు. రసాయన ఎరువులకంటే క్రిమి సంహారకమైన మందుగా ఉపయోగపడుతుంది. ఆవుపేడకు ప్లేగు, కలరా వ్యాధి క్రిములను నాశనం చేసే లక్షణాలున్నాయని చెన్నైకి చెందిన ఒక ప్రముఖ వైద్యుడు పరిశోధన చేసి కనుగొన్నాడు.

గోమయముతో, గోమూత్రముతో (యన్. పి.కె.) నత్రజని, భాస్వరం, పొటాషియం పుష్కలంగా ఉండే ఎరువులను తయారు చేసుకోవచ్చు. మానవ హానికరములుకాని సస్యరక్షణ మందులు తయారు చేసుకోవచ్చు. రసాయన ఎరువుల వల్ల లాభసాటి బ్యాక్టీరియా నశించి పంటనష్టం, భూమి బీడువారిపోవడం, సత్తువ క్షీణించడం జరుగుతుంది.

ఆవుపేడ వాతావరణ కాలుష్యం తొలగించును. క్రిమి సంహారక గుణం కలది. దోమలను నివారించును. చర్మ సంబంధమైన అన్ని రోగాలను అరికట్టును. గాయములను మాన్పును.

ఆవుపేడతో చేసిన పిడకలను మండించినప్పుడు మెథ్లిన్, ఫినాయిల్, అమ్మోనియం, ఫార్మెలిన్ వాయువులు వచ్చును. అందుచే వాతావరణ కాలుష్యం ఉండదు. ఆవు నెయ్యి మూడు పూటలా ముక్కులో వేసుకుంటే ముక్కుకి సంబంధించిన బాధలు తొలగుతాయి.



పర్యావరణ పరిరక్షణకు అడవుల అభివృద్ధి వన్యప్రాణుల సంరక్షణ అనేవి మనదేశ రక్షణకు ముఖ్యాంశాలు. ఆవు, దాని సంతతి వాతావరణ కాలుష్యాన్ని పోగొడతాయి. పచ్చిగడ్డి, ఎండుగడ్డి, ఆకులు, బార్లీ, గోధుమ, చెఱకు, పప్పుదినుసుల ఆకులు, వ్యవసాయిక వ్యర్థపదార్థాలను ఆవులు తిని మనలను రక్షిస్తాయి. లేనిచో ఆ పదార్థాలు కుళ్లి, కాలి వాతావరణాన్ని కాలుష్యం చేస్తాయి. గోమయం కాలుష్యంలేని బయో ఫెర్టిలైజర్. ఎద్దుల పేడ కూడా కాలుష్యం లేనిది. కరువు కాటకాలు రాకుండా కాపాడుతాయి. కాలుష్యం లేని బయోగ్యాస్‌ను ఇస్తాయి.

వీటితో వంటగ్యాస్, పెట్రోలు, డీజిల్, కిరోసిన్ మొదలగు నూనెలు తయారుచేసి లబ్ధి పొందవచ్చు. ఆవుపేడలో లక్ష్మీదేవి నివసిస్తుంది. అందుకే వాటికి నమస్కరిస్తే ధర్మం నాలుగు పాదాల నడుస్తుంది. బుద్ధిమంతుడు, మంగళం కోరే మానవుడు ఆవులకు ఎల్లప్పుడూ నమస్కరించడం అవసరం. ఇది పరమ పవిత్రమైన కర్మ. ఆవు పృష్ఠానికి నమస్కరించడం శ్రేయోదాయక మని శ్రీసూక్తంలో చెప్పబడింది.

పేడను, గోమూత్రాన్ని శుద్ధి చేసి దైనందిన అవసరాలకు ఉపయోగపడే వస్తువులను రూపొందించవచ్చునని ప్రయోగాలు చేసి నిరూపించారు. ఫేస్ పౌడర్, షాంపూ, పళ్లపొడి, తలనొప్పి బామ్, అగరువత్తులు, ధూపం, కేశతైలం మొదలగువాటిని తయారుచేసి అమ్ముతున్నారు.

**కామధేను తైలము :** గోమూత్రం, ఉప్పు, నూనె, గోమయ రసం, ముద్దకర్పూరం, వోమసత్తు మొదలైనవి కలిపి దీనిని తయారుచేస్తారు. దీనిని శరీరంలో ఏ భాగమందైనా నొప్పి ఉన్నచోట రాసి, తర్వాత కాపడం పెట్టాలి.

**గోపాలనశ్యం :** గోవత్సము, పాలు, మిరియాలతో తయారుచేసిన నశ్యం ముక్కు రంధ్రాలలో ఊదితే మూర్ఛరోగం తగ్గిపోతుంది.

**గోమయ సబ్బు :** స్వదేశీ ఆవుపేడ, జామట్టి, కర్పూరం, ముల్తానిమట్టి, గోమయరసంకలిపి వండిన నూనెలతో తయారుచేసిన ఈ సబ్బువాడితే ముఖం పై మచ్చలు పోయి, ముఖాన్ని కాంతిమంతంగా ఉంచుతుంది.

**కామధేను షాంపు :** గోమూత్రం, కర్పూరం, అరీతా, వోమపొడి కలిపి ఈ షాంపును తయారుచేస్తారు.

**గోమయ దంతమంజన్ :** ఆవు పేడతో, పిడకలతో కాల్చిన బొగ్గు, సాదా కర్పూరం, వాముతో కలిపి దీనిని తయారుచేస్తారు. ఇది వాడటం వల్ల చిగుళ్లవాపు, గొంతు బొంగురుపోవటం తగ్గుతుంది.

**గోమూత్రం :** గోమూత్రంలో రసాయనిక గుణాలు, శక్తులు గలవు. అవి శరీరములోని దుష్పరిణామములను, లోటుపాట్లను తొలగించు శక్తిని కలిగి యున్నవి. ఇది క్రిమినాశక పదార్థం. అందుకే దీనిని పవిత్రమైనదిగా భావిస్తారు.

**జాగర్ తులసి అరుగాయ్। తాఫుర్ వైద్యక బహునజాయ్।**
**కహాహై జీవన్తు అవధ్యాః తా మే విషస్య దూషణ్యాః॥**

గోవులను వధించకుండా ఉండాలి. గోవులు జీవించి ఉండాలి. అవి విషాన్ని తొలగిస్తాయి. ఆయుర్వేదములో విషపదార్థములను గోమూత్రముతో శుద్ధి చేస్తారు. గోమూత్రం ఏంటీటాక్సిన్, ఏంటీ సెప్టిక్, ఎంటీబయాటిక్ తెలిసికొని ఉపయోగించుకోవాలి. దానిలో విటమిన్ బి, కార్బాలికేసిడ్ ఉన్నాయి కనుక వందలకొద్దీ ఉన్నరోగాలను తగ్గించే గుణం గోమూత్రం కలిగి ఉంది.

గోమూత్రం, పురీషాదుల వల్ల బహిశ్శుద్ధి, అంతశ్శుద్ధి ఏర్పడుతుంది. మహాపాతకాలు, ఉపపాతకాలు నివారించబడతాయి. అందువల్లనే గోవును 'జగదేక పావని' అని శాస్త్రాలు పేర్కొన్నాయి.

**ఋషభాం శ్చాపి జానామి రాజన్ పూజితలక్షణాన్ ।**
**ఏషాం మూత్ర ముపాఘ్రాణం అపి వంధ్యా ప్రసూయతే॥**

(మహాభారతం - విరాటపర్వం)

ఉత్తమ లక్షణం గల ఎద్దుల గోపంచితమును వాసన చూసినంత మాత్రముననే వంధ్యలు (గొడ్రాళ్లు) సంతానవతులగుదురు.

గోమూత్రంలో 24 రసాయనాలు, 16 ఖనిజ అంశాలతోపాటు ఐరన్, కాల్షియం, ఫాస్ఫర్ వంటి గుణాలు కూడా ఉన్నాయని గుర్తించారు. అందుకే అది 108 వ్యాధులకు పరమౌషధం - సంజీవనిలాంటిది.



**గోమూత్రంలో గల రసాయనాలు :**

1) నత్రజని (Nitrogen), 2) గంధకం (Sulphur), 3)అమ్మోనియం (Ammonia), 4) అమ్మో నియం గ్యాస్ ($NH_3$), 5)తామ్రము (Copper Cu), 6)ఇనుము (Iron Fe), 7) యూరియా (Co $NH_2$), 8)యూరిక్ యాసిడ్ (Uric Acid C3 $H_4N_40_3$), 9)ఫాస్పేట్ (Phospate - P), 10) సోడియం (Sodium Na), 11)పొటాషియం (Potassium -K), 12)మాంగనీస్ (Manganese MN), 13)కార్బాలికేసిడ్ (Carbolic Acid HCo 0H), 14) కాల్షియం (Calcium Ca), 15)లవణము (Salt Nacl), 16)విటమినులు (Vitamins), 17)ఇతర ఖనిజములు (Other Minerals), 18)లాక్టోసు (Lactose ($C_6H_{12}0_6$), 19)ఎంజైములు (Enzymes), 20)జలము ($H_20$), 21)హిప్యూరిక్ యాసిడ్ (Hippuric Acid Cg Ng nox), 22)క్రియాటినిన్ (Creatinin $C_4$Hg $N_20_2$), 23)హార్మోనులు (ఎనిమిది మాసాల గర్భిణి అయిన గోమూత్రములో) 24) స్వర్ణక్షారము (Aurun Hydroxide $A_4$ 0H)

**గోమూత్రము వాడిన తొలగు వ్యాధులు :**

1) అజీర్ణము, 2) అతిసారము, 3) ఆమ్లపిత్తం, 4) అపస్మారము, 5) అర్శమొలలు, 6) అనాహము, 7) ఆమవాతము, 8) ఆమ్లాశయ వ్రణము, 9) ఉదర రోగము, 10) వడదెబ్బ, 11)పాండు, 12) ఉదావర్తము, 13) పిత్తవృద్ధి, 14) ప్లీహవృద్ధి, 15) బద్ధకోష్ఠము, 16) అతి మూత్రము, 17) అల్కాహాలిజం, 18) మసురిక, 19) ముఖరోగము, 20)మూర్ఛ, 21) మూత్రకృచ్ఛ్రము, 22) మూత్రనాళములో వ్రణము, 23) మదావృద్ధి, 24) యకృత్‌వృద్ధి, 25) రక్తపోటు, 26) రక్తపిత్తము, 27) రక్తవిహారము, 28) ఉన్మాదము, 29) ఉపదంశము, 30) ఉరతోయము, 31) ఉరస్తమ్భము, 32) కంఠరోగము, 33) మలబద్ధకము, 34) కుష్ఠువు, 35) కామెర్లు, 36) చెవిరోగము, 37) దగ్గు, 38) దాహము, 39) నమనము, 40) విరేచనము, 41) బాలారిష్టము, 42) బుద్ధిమాంద్యము, 43) భస్మకము, 44) దంతరోగము, 45) దాత్.

గోమూత్రం ఒక లీటరు రూ.120/-, పేడ కిలో రూ.15/- అమ్ముతోంది. మహారాష్ట్రలోని 'వెడప్ కాషా' అనే సంస్థ మూడు గోవుల ద్వారా రూ.60,000/- విలువ చేసే సేంద్రీయ ఎరువులను, రూ.2.50 లక్షలు విలువ చేసే అగరుబత్తులను తయారుచేసి సంచలనం సృష్టించింది.

గోమూత్రము వల్ల భూసారం 20శాతం అభివృద్ధి చెందుతుంది. ఒక గ్రాము గోమయంలో 300 కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి. అవి భూసారాన్ని పెంచుతాయి.

**'అగ్రమగ్రం చరన్తీనా మోషధీనాం వనే వనే'** అంటే ఆరోగ్యవంతమైన గోవుయొక్క మూత్రం ఔషధముగా పనిచేయును. ఒక రోగానికి అనేకమందులు వాడనక్కర్లేదు. సమస్త రోగాలకు గోమూత్రమే సరియైన మందు.

## గోవు గురించిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| 1)Cow is a Wonderful | : అమెరికా వ్యవసాయ పరిశోధనశాల | Laboratory |
| 2)గోసంపదే గ్రామోదయమ్: | శ్రీ బవన్‌లాల్ కొటారి అఖిల భారత గోసంరక్షణ సమితి అధ్యక్షులు | |
| 3) జై పంచగవ్య | : శ్రీ హుకుంచంద్ సావలా అఖిల భారతీయ గోరక్షణ సంఘటనా మంత్రి | |
| 4) గోమూత్రం పరమౌషధం: | శ్రీ బాపూరావు సర్ దేశాయ్ | |
| 5) పంచగవ్య చికిత్స | : డా॥ గౌరీశంకర్ మహేశ్వరి | |

**N.B. :** పంచగవ్యాలు అంటే స్వదేశీ గోవు ఇచ్చే పాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రం. (జెర్సీ ఆవువి కాదు)

పల్లెల్లో గోసంతతి ఎప్పుడైతే తగ్గుతుందో అప్పుడే పల్లె ప్రజలు పల్లెల్ను విడిచిపోతారు.



| | |
|---|---|
| Animal Welfare Board of-India, No.7, 2nd Cross Street, Venus Colony, Alwarpet,Chennai-18 | Sec.4 of prevention of cruelity to Animal Act. |

పశువులపై క్రూరత్వం, హింస అరికట్టాలని ఏర్పడింది.

**'ఆత్మవత్సర్వభూతాని యః పశ్యతి స పండితః**

ఎవరు అన్ని ప్రాణుల్లో ఆత్మభావం కలిగి ఉంటారో వారే పండితులని చెప్పబడింది.

**'తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః**

సకల ప్రాణుల హితములో సంలగ్నులు పరబ్రహ్మనే పొందుతారని చెప్పబడింది.

**'వందే ధేనుమాతరం'** గోసంతతి మనచుట్టూ ఉన్న వాతావరణ పరిస్థితులను బాగు చేసి రక్షిస్తుంది. అంతేకాకుండా జీవావరణాన్ని సమతౌల్యం చేస్తుంది.

మన హిందూ సంప్రదాయాల్లో, ధర్మశాస్త్రాల్లో, పురాణాల్లో, ఇతిహాసాల్లో గోవుకున్న స్థానం మరొక దానికి లేదు. కన్నతల్లి తన బిడ్డను ఎంత జాగ్రత్తగా చూసుకుంటుందో, రక్షిస్తుందో, అలాగే గోవు మనలను రక్షిస్తుంది. అందుకే గోవును గోమాత అన్నారు. ప్రతి జీవి మాతాపితరులకు సేవ చేసి తమ ఋణం ఎలా తీర్చుకుంటారో, అలాగే మానవుల కోర్కెలను తీర్చి, సదా ఆయురారోగ్యాలతో కాపాడే గోమాతను మనం రక్షించడం మన ధర్మం.

గోవు భారతీయ ధార్మిక చింతనలోనే కాదు; ఆర్థిక వ్యవస్థలోనూ ఒకనాడు కీలకమే. గోమాత మన భూభాగం మీద ద్రవ్యంగా చలామణి అయింది. భారతీయులు వ్యవసాయం మీద ఆధారపడితే, ఆ వ్యవసాయ భారాన్ని తమ భుజాల మీద మోస్తున్నవి ఎద్దులు. అలాంటి ఎడ్లనిచ్చేది గోవులే. అందుకే ఆవు మనకు అమ్మ. ఎద్దు మనకు అన్న.

మన సంస్కృతి మిగిలిన దేశాల సంస్కృతి కంటే భిన్నమైనది. మనది దైవికమైతే, మిగిలిన వారిది వస్తురూపమైనది. గోబ్రాహ్మణేభ్యః శుభమస్తునిత్యం సర్వేజనా స్సుఖినో భవంతు అని మనం శుభంకోరుతూ ఆవును ఆరాధిస్తాం. శ్రీకృష్ణుడు ఆవుల మంద మధ్య ఉండడానికి ఇష్టపడతాడు. 'నంది' శివునికి వాహనం. పశుసంపద మనకు ముఖ్య సంపద. వాటిల్లో ఆవు,ఎద్దు,ఆంబోతు మనకు ముఖ్యమైనవి.

**గోసంరక్షణ :**

గోసంరక్షణ ఉన్నతమైన ధ్యేయం కావడం వల్లనే భారత స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చింది. స్వాతంత్ర్య పోరాటం 1857లో ప్రారంభమైనప్పుడు బ్రిటిష్‌వారితో ఉన్న భారతీయులు గోవు కొవ్వుతో చేసిన తూటాలను నోటితో విప్పడానికి వ్యతిరేకించారు. మన జాతీయ నాయకులు లోకమాన్య బాల గంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ, లాలా లజపతి రాయ్, మదన్‌మోహన్ మాలవ్యా, పురుషోత్తమదాస్ టాండన్ వంటి వారందరూ స్వాతంత్ర్య పోరాటం తర్వాత అంటే స్వాతంత్ర్యం వచ్చాక 'గోసంరక్షణ, గోవధ నిషేధం' కోసం కృషి చెయ్యాలని. దాన్నే మొట్టమొదటి ధ్యేయంగా పెట్టుకున్నారు.

ఆర్టికల్ 48ఎ ప్రకారం పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని యొక్క బాధ్యత. మానవాళికే కాకుండా యావత్ ప్రపంచానికి ఆవు మేలు చేస్తుంది. కాబట్టి దాన్ని ప్రేమతో పెంచాలి. వాటికి హింస కలగకుండా చూసే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది. 'గోసంపత్తి - రాష్ట్ర సంపత్తి; గోరక్షణ - లోకరక్షణ' అని నాలుగు వేదాల్లో, శాస్త్రాల్లో, దేవతలు, ఋషులు అందరూ చెప్పారు. రాష్ట్ర పిత గాంధీజీ 'నాకు స్వాతంత్ర్యం కన్నా గోరక్షణే ప్రధానమన్నారు. అలాగే తిలక్ గోరక్షణే లోకకల్యాణం అన్నారు.

శ్లో॥ **ఉష్ణే వర్షతి శీతే వా మారుతే వాతి వా భృశమ్।**
**ప్రకృతీ త్వాత్మనః ప్రాణం గోరక్షిత్వా తు శక్తితః ॥**

ఎండవల్ల, వడగాడ్పులప్పుడు, చలిగాలులు వీస్తున్నప్పుడు, వర్షం వచ్చినప్పుడు ముందుగా నిన్ను నువ్వు రక్షించుకోవడం కాదు - గోవును రక్షించు.



శ్లో॥ **వానస్పత్యం మూలఫలం హోమద్రవ్యం తథైవ చ।**
**తృణం చ గోభ్య గ్రాసార్థ మస్తేయం మను రబ్రవీత్॥**

గోపోషణ కొరకు పరుల గడ్డివామిలోంచి గడ్డి తీసుకొని ఆవుకి వేస్తే అది దొంగతనం కాదు. కంచె వేయని ఫల వృక్షములను, దుంపలను, హోమానికి సమిధలు, గోవుకోసం గ్రాసం - వీటిని పరులవి గైకొన్నా దొంగతనం కాదని మనువు మనుస్మృతిలో చెప్పారు.

**'స్తోతా మే గోసఖా స్యాత్'**

నన్ను స్తుతించు నా భక్తుడు గోవు యొక్క మిత్రుడై ఉండాలి అని అధర్వణవేదంలో పరమాత్ముడు స్పష్టం చేశాడు. గోహత్యలు ఎక్కువగా జరుగుచున్నవి. వాటిని అరికట్టండి. గోమాతను రక్షిస్తున్నప్పుడు ఫలితం మీదకన్నా ప్రయత్నం మీదే ధ్యాస ఎక్కువ అవుతుంది. గోమాతలను రక్షిస్తే అవి మానవజాతిని రక్షిస్తాయి. ఈ సృష్టిలో మరెన్నో విషయాలను డబ్బుతో కొనగలుగుతాం. కాని, దైవ స్వరూపమైన గోవును కొనలేం. ఆవు వల్ల కలిగే లాభాలు నూటికి ఎన్నో! ఎన్నో! మరెన్నో!

గణతంత్ర రాజ్యాల మధ్య గోవులకోసం యుద్ధాలు జరిగిన విషయాన్ని 'ఉత్తరగోగ్రహణం' కథ చెబుతుంది. అనాథ ప్రేత సంస్కారాన్ని పవిత్రంగా భావించే పుణ్యభూమి మనది. మనిషి చనిపోయిన తరువాత ఆ కళేబరాన్ని ఖననం చేసేవరకూ ఎనలేని గౌరవాభిమానాలు చూపడం మన సమాజ లక్ష్యం. అదే గోమాత విషయంలో కూడా పాటించాలి.

**గోదాన ఫలం :**

శ్లో॥ **దాతాఽస్యాః స్వర్గ మాప్నోతి వత్సరాన్ లోమ సమ్మితాన్ ।**
**కపిలా చేత్తారయతి భూయాశ్చ సప్తమాకులమ్ ॥**

ఒక గోవును దానం చేస్తే సహస్ర గోవులను దానం చేసిన ఫలితం కలుగుతుంది. కపిల గోవును దానం చేస్తే ఏడు తరాలను తరింపజేస్తుంది. గోదానం చేస్తే పితృదేవతలు ఘోరమైన వైతరణీ నది దాటి స్వర్గానికెళతారని శాస్త్రంలో చెప్పబడింది.

శ్లో॥ **గో, భూ, తిల హిరణ్యాజ్య వాసో ధాన్య గుడాని చ**
**రౌప్యం లవణ మిత్యాహుః దశదానాః ప్రకీర్తితాః ॥**

ఆవుతో పాటు దూడను కూడా దానమివ్వాలి. దానమిచ్చే సమయంలో ఆవు ముఖం ఒకవైపూ, పాలు త్రాగుతున్న దూడ ముఖం మరొకవైపు తిరిగి ఉండాలి. అనగా గోదానకర్తకు, గోదాన ప్రతిగ్రహీతకు, గోవు-దూడ చెరియొకరికి అభిముఖులై ఉండాలి. గోదానం వల్ల ఇహంలోనూ, పరంలోనూ సుఖం కలుగునని భావం. అలాగే దానం చేసేవారికి పుణ్యప్రాప్తి, వారి పితృదేవతలకు పుణ్యలోక ప్రాప్తి కలుగునని భావము. అందుచే దానాలన్నింటిలోనూ గోదానం ఉత్తమమైనది.

## గోప్రదక్షిణ ఫలం :

బ్రహ్మదేవుడు సకలలోకాలు ఆశ్చర్యపోయేలా సౌందర్యమునకు ప్రతీకగా సృష్టించిన అహల్యను వివాహం చేసుకోవాలనే వారికి ఒక పెద్దపోటీ పెడతాడు.దేవతలందరితో పాటు పరమ పురుషార్థమయిన మోక్షమును లోకానికి చూపిన యోగీశ్వరుడు, సప్తఋషులలో ఒకడైన గౌతముడు పోటీలో పాల్గొంటాడు. భూప్రదక్షిణకు బదులు శాస్త్రప్రకారం ద్విముఖ గోవునకు ప్రదక్షిణం చేసి, ధర్మసమ్మతంగా అహల్యను వివాహం చేసుకున్నాడు. గో ప్రదక్షిణం భూప్రదక్షిణంతో సమానం. గోప్రదక్షిణం చేస్తే గర్భిణీ స్త్రీలు సుఖంగా ప్రసవిస్తారు.

## గో హత్యకు ప్రాయశ్చిత్తం లేదు :

వినాయకుడు తన తల్లి పార్వతీదేవికి సవతి బాధ లేకుండా చేస్తానని ప్రమాణం చేస్తాడు. అందుకే శివుని జటాజూటం నుంచి గంగను భూలోకానికి పంపాలని భావిస్తాడు. భూలోకాన్ని స్వర్గంగా మార్చడం గౌతమమహర్షివల్లనే జరుగుతుందని వినాయకునికి తెలుసు. పార్వతీదేవి చెలికత్తెను మాయ గోవుగామార్చి పంట పొలాల్లోకి వెళ్లి ఆ మహర్షి నిన్ను ఏమన్నా అంటే నీవు



తత్క్షణమే చనిపోవాలని ఆదేశిస్తాడు. ఆ పన్నాగం ప్రకారం మాయగోవు పంట పొలాల్లోకి చొరబడి పంటను మేస్తుంటే గౌతముడు చూచి, భరించలేక ఒక గరిక పుల్లతో అదిలించగానే ఆ గోవు మరణించింది. గౌతముడు గోహత్య చేశాడని ఆయన్ను నిందించారు. గౌతముడు వెంటనే వినాయకుని చేరి తన పాపానికి ప్రాయశ్చిత్తం ఏమిటని అడుగుతాడు. శివుని జటాజూటంలోని గంగను గోవుపై ప్రవహింపజేస్తే పాపం పోతుందని చెబుతాడు విఘ్నేశ్వరుడు. గౌతముడు శివుని కోసం తపస్సు చేసి మెప్పించి గంగను భూమిపైకి రప్పించగా మాయగోవు బ్రతికింది. శివుని జటాజూటం నుంచి వచ్చిన ఆ గంగే గౌతమిగా మారింది.

కలియుగంలో గంగానది, గీత, కపిలగోవు, రావిచెట్టు, సాధు పుంగవులసేవ, ఏకాదశీవ్రతం వీనికిమించిన పావనమైనవి ఏమీ లేవని స్కాంద పురాణంలో వివరించారు. గోవులను, బ్రాహ్మణులను ఎంగిలి చేత్తో ముట్టు కుంటే శిక్షగా వారి చేతులు కాలుస్తామని యమభటులంటారు. ఏడు జన్మల క్రితం గోవును నీళ్లు త్రాగడానికి అడ్డుపెట్టిన అపరాధానికి వందసంవత్సరాలు నరకాన్ని అనుభవించిన వ్యక్తికి ఒక పుణ్యాత్ముని రాకతో విముక్తి కలిగింది. ఇది విష్ణుపురాణంలో చెప్పబడింది.

## గోపద్మ వ్రతం :

ఏకాదశుల్లో ఆషాడశుద్ధ ఏకాదశి అత్యంత విశేషమైనది. ఈ ఏకాదశిని 'తొలి ఏకాదశి', 'శయనైకాదశి' అని కూడా అంటారు. ఆ రోజున 'గోపద్మవ్రతం' చెయ్యాలని పురాణాలు చెబుతున్నాయి. ఆదినం గోశాలను శుభ్రం చేసి గోమయంతో అలికి ముగ్గులు పెట్టి మధ్యభాగంలో బియ్యపుపిండితో 33 పద్మాలు పెట్టాలి. లక్ష్మీనారాయణులకు గంధ పుష్పాక్షతలతో పూజ చేసి, ప్రదక్షిణ నమస్కారములు సల్పి, పద్మానికి ఒకటి చొప్పున బ్రాహ్మణులకు వాయనం ఇవ్వాలి - గోమాతను పూజించాలి - దీని ఫలితం అద్భుతం! అత్యద్భుతం!

## నరఘోష నివారణ :

భోగి పండుగను నరఘోష నివారణ కోసం జరుపుకుంటారని ప్రతీతి. ఎవరైనా ధనధాన్యాలు, సిరిసంపదలతో తులతూగుతున్నారంటే వారిపై ఎక్కువ మంది దృష్టి పడడం సహజం. దీన్ని వక్రదృష్టిగా భావించడం కూడా సహజమే. ఆ వక్రదృష్టిని తనమీద నుంచి మళ్లించుటకే నెల పెట్టినప్పటి నుంచి రాత్రి వేళల్లో ఆవుపేడతో గొబ్బిళ్లు తయారు చేసి వాటిపై గుమ్మడి లేదా తంగేడు పూలను ఉంచుతారు. కొందరి దృష్టిదోషాన్ని వాటిపై మళ్లించడమే ఈ గొబ్బిళ్ళ వెనుక ఉన్న ఆంతర్యం - తరువాత గొబ్బిళ్ళతో పిడుకలు తయారుచేసి భోగి మంటలు వేసుకుంటారు.

భోగినాడు అష్టదళపద్మాకృతిలో ముగ్గులు వేసి దానిపై గొబ్బెమ్మను అమర్చి పూజిస్తారు. అదే లక్ష్మీదేవి ప్రతిరూపం. పూర్వం రాక్షసులు పెట్టే బాధలకు తట్టుకోలేక దేవతలు కామధేనువును ఆశ్రయించగా, విష్ణువు ఆనతిపై లక్ష్మీదేవి గోమయంలో దాగింది. ఆవు పేడతో ముంగిళ్లలో కలయంపి చల్లి అలంకరించిన వారికి ధనధాన్యాలు ఇస్తానని లక్ష్మీదేవి వరమిచ్చింది.

దేహంలో వేడి తగ్గించడానికి గోవుపాలు, గోవు పెరుగు, గోమూత్రం ఉపయోగిస్తాయి. ఆవు పేడతో చేసిన పిడుకలతో మంటలు వేస్తే శుభం కలుగుతుందని నమ్మకం. దృష్టిదోషనివారణతో పాటు తమ సంతానానికి మేలు జరుగుతుందని ఆవు పేడతో తయారుచేసిన పిడుకలను మాలలుగా చేసి పిల్లల మెడలో వేసి వాటిని తీసి మంటవేసి వాటి చుట్టూ పిల్లల్ని కూర్చోబెడతారు.

సంక్రాంతి పండుగనాడు గంగిరెద్దును ఇంటింటికీ త్రిప్పి విన్యాసాలు చేయిస్తారు. ఆనందోత్సాహాలతో ప్రజలు దాన్ని తిలకించి బహుమతు లిస్తారు.

సంక్రాంతినాడు ఆవుపాలతో పొంగలి వండి పశుశాలల్లో నైవేద్యం పెట్టి పంట పొలాల సరిహద్దుల్లో చల్లుతారు.దానినే పొలిచల్లుట అంటారు. దానివల్ల పాడిపంటలు అభివృద్ధి చెందుతాయని నమ్మకం.



## విదేశీయుల అభిప్రాయాలు :

అమెరికా, జర్మనీ వైజ్ఞానికులు భారతీయ గోసంతతి ద్వారా కలిగే లాభాలను ముక్తకంఠంతో ఘోషిస్తున్నారు. మహాశివుడు, శ్రీకృష్ణుడు, దిలీప మహారాజు, వసిష్ఠుడు, జమదగ్ని మొదలగు ఋషుల చరిత్రలు గోమహిమతో కూడినవి.

థాయ్‌లాండ్‌లోని సెంట్రల్ సాకాయూ ప్రావిన్స్ పశువుల మార్కెట్‌లో సంప్రదాయబద్ధంగా ఒక ఆబోతుకి, ఆవుకి పెళ్లి జరిపించి ఊరేగింపుగా తీసుకెళ్ళినపుడు ఆ పెళ్లి చూడ్డానికి దాదాపు రెండువేల మంది హాజరయ్యారు. ఆవు యజమానికి, ఆబోతు యజమానికి దాదాపు లక్ష (రూపాయలు) థాయ్ కరెన్సీగా కట్నం సమర్పించారు. ఆవు సంచరించే ప్రాంతం వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తుంది. ఈ విషయాన్ని అమెరికా, జర్మనీ దేశాల్లో పరిశోధనలతో ఋజువు చేశారు. యావత్ ప్రపంచం గోబర్‌గ్యాస్ తయారు చేయాలంటూ అమెరికా ప్రెసిడెంట్ బుష్ విజ్ఞప్తి చేశారు.

## కొన్ని చట్టాలు

* Andhra Pradesh Prohibition of Cow Slaughter and Animal Preservation Act, 1977.
* Bihar Preservation Improvement of Animal Act, 1995.
* The Delhi Agricultural Cattle Preservation Act, 1994.
* The Goa, Damman & Din Prevention of Cow Slaughter Act, 1978 (13 of 1978)
* The Goa Animal Preservation Act, 1995.
* The Bombay Animal Preservation Act,1954.
* The Punjab Prohibition of Cow Slaughter Act, 1955.
* The Karnataka Prevention of Cow Slaughter and Cattle Preservation Act, 1964.

## గోవుకు ఆలయం :

శ్రీ సద్గురు సమర్ధ నారాయణ మహారాజ ఆశ్రమము సనాతన ధర్మ ప్రచారానికై సుదీర్ఘ కాలము నుండి అన్ని శాఖలద్వారా భావి భారత నవ నిర్మాణానికై, సన్మార్గ జీవితానికై జ్ఞానకేంద్రంగా ఉంది. ఈ హైదరాబాద్‌శాఖ బ్రిటిష్ మరియు నైజాం కాలపు రజాకార్, ఖల్సార్‌లాంటి అమానవీయ సంఘటనలన్నిటి విపరీత కాలమును కూడా ఎదుర్కొని వేదసేవ, అన్నదాన సేవ మొదలైనవి మరియు సన్మార్గ జీవితం, సార్థక పురుషార్థం బోధించే సేవాకేంద్రాలను కూడా నెలకొల్పారు. ఇచ్చట మాత కామధేనువుకు ఆలయం కూడా కట్టించారు. ఈ పుణ్యస్థలి శివబాగ్, జియాగూడ, పురానాపూల్, హైదరాబాద్‌లలో ఉంది.

## గోధూళికా లగ్నం :

పగటి కడపటి భాగం పశ్చిమ దిక్కులో సూర్యబింబం మూడవవంతు కనబడుచుండగా తదుపరి 48 నిముషాల ప్రొద్దు. గోధూళికాలగ్నం. ఆ సమయం అందరికీ, అన్నింటికీ శుభముహూర్తం అని చెప్పబడింది. గోసేవ చేస్తే రజస్తమోగుణాలు నశించి సాత్త్వికులవుతారు.

## బయోగ్యాస్ :

ఆవుపేడ, సేంద్రీయ వ్యర్థ పదార్థాల నుంచి గోబర్ గ్యాస్‌ను తయారు చేస్తారు. దీన్ని సున్నం నీళ్ల నుంచి పంపించడం ద్వారా బొగ్గుపులుసు వాయువు తొలగిపోయి స్వచ్ఛమైన మిథేన్‌గ్యాస్ లభిస్తుంది. ఈ ప్లాంట్లు 20వేల నుంచి లక్ష రూపాయల వెలలో లభిస్తాయి. కంప్రెసర్‌ని ఉపయోగించి మిథేన్ గ్యాస్‌ను సిలెండర్లలోకి పంపవచ్చు. వంటగ్యాస్‌ను వాహనాలను నడిపించుటకు ఉపయోగించవచ్చు. మిగిలిన పదార్థాలు దేశం మొత్తం పొలాలకు రెండు పంటలకు సేంద్రీయ ఎరువుగా సరిపోతాయి.

దేశం మొత్తం మీద 6.27 లక్షల గ్రామాల్లో ప్రతి గ్రామంలోనూ 50 రైతు కుటుంబాల్లో ఒక్కొక్క కుటుంబానికి 2 ఎద్దులు, 4 పాడి ఆవులు



ఉంటే వాటి ద్వారా లభించే పేడ దేశం మొత్తానికి కావలసిన పెట్రోల్, యల్.పి.జి., కిరోసిన్, యల్.యన్.జి. అవసరాల్ని తీరుస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది.

ఆవు పేడ ద్వారా ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్ 600 బి.టి.యు. ఉష్ణోగ్రత వద్ద పరిశీలిస్తే మిథేన్ 55-65శాతం, కార్బన్‌డయాక్సైడ్ 39శాతం, నైట్రొజన్ ఇతరములు 5శాతం ఉంటాయని నిరూపించారు. బయోగ్యాస్‌ను మిగిలిన ఇంధనాలతో పోలిస్తే ఉష్ణజ్వలనాశక్తి తక్కువ. అందుకే ప్రస్తుతం ఆహారపదార్థాల తయారీకి, ఇంజన్ల వినియోగానికీ వాడుతున్నారు. నాణ్యత పెంచితే విద్యుచ్ఛక్తి కూడా తయారు చేసుకోవచ్చు.

గోబర్‌గ్యాస్ బట్టీలను ఇటుకలతో నిర్మించుకొని పెద్ద మిషనరీ అక్కర లేకుండా చేసుకోవచ్చు. మిషనరీకి బ్యాంకులు కూడా ఋణాలిస్తాయి. రవాణా ఖర్చు లేకుండా, నిల్వ చేసే గోడౌన్ ఖర్చు లేకుండా, దళారీల బెడద లేకుండా, పన్నుల బాధ లేకుండా, లాభదాయకంగా బయోగ్యాస్ ఎంతో ఉపయోగం. చెడిపోయిన పదార్థాల వల్ల పర్యావరణానికి హాని చేయని విధంగా పరివర్తన చెందింది. నిత్యజీవితంలో ఉపయోగించే బయోగ్యాస్‌గా మార్చి భారతసంస్థ 'బయోటెక్' (కేరళ) వారు గ్రీన్ ఆస్కార్ అవార్డు పొందారు.

## గోమతివిద్య :

'గోమతి విద్య' అనే విశేషమైన మంత్రంతో కూడిన గోస్తుతి లభిస్తుంది- దానిని పఠించిన ఇళ్లల్లో, గ్రామాల్లో, దేశాల్లో గోసంతతి అభివృద్ధిచెందుతుంది- మానవుల దుఃఖం సులువుగా తొలగిపోతుంది. ఈ విద్యకి అనేక ఉపనిషత్తుల్లో, పురాణకథల్లో విశేష ప్రాధాన్యమిచ్చారు. ఆవులు బాగా వృద్ధి చెందడానికి ఉపయోగపడేదే గోమతి విద్య అన్నారు. గో సంతానం వృద్ధి కావడంవల్ల పాలు, పెరుగు, వెన్న, నెయ్యి మొదలగు స్వచ్ఛమైన, విలువైన వస్తువులు లభించి సుఖశాంతులు లభిస్తాయి. దీనిని పఠిస్తే ఐహిక సుఖాలు, దివ్యజ్ఞానం లభిస్తాయి- గోలోక ప్రాప్తికూడా లభిస్తుంది. విష్ణుధర్మోత్తర పురాణంలో చెప్పిన ఈ పద్యాన్ని ప్రతిపదార్థంతో నేర్చుకుంటే మంచిది.

**గోమతీం కీర్తయిష్యామి సర్వపాప ప్రణాశినీమ్**
**తాం తు మే వదతో విప్ర శృణుష్వ సుసమాహితః ॥**
**గావః సురభయో నిత్యం గావో గుగ్గులుగంధికాః ।**
**గావః ప్రతిష్ఠా భూతానాం గావః స్వస్త్యయనం పరమ్॥**
**అన్నమేక పదం గావో దేవానాం హవిరుత్తమమ్**
**పావనం సర్వభూతానాం రక్షంతి చ వహంతి చ ॥**
**హవిషా మంత్రపూతేన తర్పయంత్యమరా దివి ।**
**ఋషీణాం అగ్నిహోత్రేషు గావో హోమే ప్రయోజితాః॥**
**సర్వేషా మేవ భూతానాం గావః శరణ ముత్తమమ్ ।**
**గావః స్వర్గస్య సోపానం గావో ధన్యా స్సనాతనాః ॥**
**నమో గోభ్యః శ్రీమతీభ్యః సౌరభేయీభ్య ఏవ చ ।**
**నమో బ్రహ్మసుతాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః ॥**
**బ్రాహ్మణాశ్చైవ గావశ్చ కులమేకం ద్విధా స్థితమ్ ।**
**ఏకత్ర మంత్రాధిష్ఠం హవిరేకత్ర సంస్థితమ్॥**
**దేవ బ్రాహ్మణ గో సాధు సాధ్వీభిః సతతం జగత్ ।**
**ధార్యతే వై సదా తస్మాత్ సర్వే పూజ్యతమా సదా ।**
**యత్ర తీర్థే సదా గావః పిబంతి తృషితా జలమ్.**
**ఉత్తరంతి పథా యేన స్థితా తత్ర సరస్వతీ**

విష్ణుధర్మోత్తర పురాణం ద్వితీయ 42, 49, 58, వరుణుని పుత్రుడు జలాధిపతి. అతడు పుష్కర ద్వీపానికి అధిపతి, సర్వశాస్త్ర పండితుడు. పరశురాముడు అడిగితే పుష్కర భగవాన్ ఈ విద్య గురించి చెప్పాడు. దీన్ని ఏకాగ్రచిత్తులైవింటే, పాపాలను సమూలంగా ప్రక్షాళన చేస్తుంది. ఆవు నిత్యం సురభి రూపిణి. పుణ్యమైన సుగంధాలను వెదజల్లుతుంది. గుగ్గులు వంటి సువాసనలనిస్తుంది. ఆవుతో ప్రాణికోటి ముడిపడి ఉంది. ధర్మ, అర్థ, కామ, మోక్షదాయిని. సర్వోత్కృష్టమైన ఆహారాన్ని ఇస్తుంది. వాటితో అందరు దేవతలను సేవించడానికి హవిస్సు, పురోడాశాలు తయారు చేసుకోవచ్చు. ఆవులు దర్శనం, స్పర్శనం ద్వారా అన్ని ప్రాణులను పవిత్రం చేస్తాయి. పాలు, పెరుగు, నెయ్యి మొదలగు అమృత పదార్థాలనిస్తాయి. దాని దూడలు బలిష్ఠంగా పెరిగి వృషభాలుగా బరువులు మోయడానికి, భూమిని దున్నడానికి ఉపయోగపడతాయి. పవిత్రమైన హవిస్సు ద్వారా వేదమంత్రాలతో దేవతల్నికూడా పవిత్రుల్ని చేస్తాయి. ఋషుల యజ్ఞాలు, అగ్నిహోత్రాల్లో హవనద్రవ్యాల వినియోగం వీటివల్ల జరుగుతుందికాబట్టే, వీటిని విశేషభక్తితో పోషిస్తారు. ప్రపంచంలో అన్ని ప్రాణులకు గోమాతలే సర్వోత్తమ శరణ్యాలు. ఆవులు స్వర్గానికిచేర్చే సోపానాలు. మంగళకరమైన పదార్థాలకు, సంపదలకు ఆవులు మూలం. లక్ష్మీదేవికి తనశరీరంలో స్థానమిచ్చే గోవుకు నమస్కారం - సురభికులంలో సాధువుగా ఉత్పన్నమయిన ఆవుకు నమస్కారం - బ్రహ్మ పుత్రిక అయిన ఆవుకు నమస్కారం - వాతావరణాన్ని పవిత్రంచేసే ఆవుకు నమస్కారం. ఆవులు, బ్రాహ్మణులు ఒకే కులానికి చెందిన ప్రాణులు. ఇద్దరిలో పరిశుద్ధమైన, ప్రధానమైన 'సత్త్వ' గుణం ఉంది. బ్రాహ్మణులలో వేదమంత్రాలు ఉంటే, ఆవులలో యజ్ఞసాధనాలయిన హవిస్సులుంటాయి. రెండింటిద్వారానే యజ్ఞం సుసంపన్నమై విష్ణువు మొదలగు సమస్తదేవతలు, చరాచరములు ప్రీతి చెందుతాయి. ప్రపంచమంతా దేవతల, బ్రాహ్మణుల, సాధువుల, మహాత్ముల, పతివ్రతల పుణ్యాలపైనే ఆధారపడి ఉంది. ధార్మికమైన ఈ జీవులే విశ్వాన్ని నడిపిస్తూ ఉంటారు. అందుకే ఇవన్నీ పూజనీయమైనవి. ఆవులు ఎక్కడ నీరు త్రాగి దప్పిక తీర్చుకుంటాయో అక్కడ గంగ, యమున, సరస్వతి, సింధు నదులు ఉంటాయి. గోపాద ధూళిలో అన్నిరకములయిన ధర్మాలు , శక్తులు నివాసం చేస్తాయి.



**ఆవు జంతువు కాదు:**

ఆవు మన సంస్కృతి కిరీటానికి కలికితురాయి.
ఆవు సభ్యత అనే గోడకు వేసిన వెల్లలాంటిది.
ఆవు మన ధర్మంలోని సూక్ష్మరహస్యం.
ఆవు మన అర్థం, మోక్షకర్మల మార్గం.

ఆవు ప్రపంచానికి అఖండమైన గౌరవప్రదమైనది.

ఆవు పుట్టుకనుండి మానవుణ్ణి ముక్తివరకూ చేర్చే నావ.

ఆవు నిర్మలమైన ఆకాశంలో ధ్రువ నక్షత్రం.

ఆవు ఎడారిలో చల్లని నీడ.

ఆవు మమతతో కూడిన మాతృత్వం.

ఆవు వ్యవసాయం, ఆరోగ్యం, వాణిజ్యం, మొదలైనవాటికెల్ల ఆధారం.

ఆవు భక్తి, శక్తి, ప్రార్థన, సేవ, సమృద్ధి - వీటికి ఆలంబనం.

ఆవు అమృతం అనే తలకిపూసిన చందనం.

ఎవరు ఏవిధంగా గోసేవ చెయ్యాలి!

**1. మీరు భారతీయులా?**

అయితే తెలుసుకోండి - ఆవు మన తల్లి. ఆవుపాలు ఆరోగ్యాన్ని, సుఖాన్ని ఇస్తాయి.

**2.మీరు రైతులా?**

అయితే రసాయన ఎరువులుమాని సేంద్రీయ ఎరువులనే వాడండి.

**3.మీరు పారిశ్రామికవేత్తలా?**

ఆర్థికవ్యవస్థకు ఆధారమైన ఆవులను, ఎద్దులను రక్షించుటకు ధనసహాయం చెయ్యండి.

**4. మీరు ఉద్యోగస్థులా?**

తోటి సహచరులకు ఆవు, ఎద్దుల గొప్పతనాన్ని తెలియజేయండి.

**5. మీరు ఆలోచనాపరులా?**

బుద్ధిబలాన్ని పెంచుకోవడానికి ఆవు పాలు త్రాగండి.

**6. మీరు గోప్రేమికులా?**

గోవధ జరుగకుండా చూడండి- ఆవులను, ఎద్దులను సంరక్షించండి.

**7. మీరు పోలీసులా?**

ఆవులను, ఎద్దులను హింసించేవాళ్లను పట్టుకుని శిక్షించండి. చట్టాన్ని రక్షించండి.



**8. మీరు న్యాయవాదులా?**

పశువులను దొంగిలించే వారిని పట్టుకుని, కేసు పెట్టి, ఫీజులేకుండా వాదించండి.

**9. మీరు జడ్జీలా?**

చట్టం ద్వారా రక్షించబడే ఆవు, ఎద్దుల గురించి నేరంచేసేవాళ్లను శిక్షించండి.

**10. మీరు పశువ్యాపారులా?**

ఆవుల్ని కసాయి వాళ్లకు అమ్మకండి.

**11. మీరు రచయితలా?**

ఆవుల, ఎద్దుల ఆర్థిక, సాంస్కృతిక, శాస్త్రీయ దృక్పథాన్ని బాగా వెల్లడించే రచనలు చెయ్యండి.

**12. మీరు కసాయివాళ్లా?**

ఆవులు, ఎద్దుల మీద కత్తి పెట్టి దేశద్రోహం, ధర్మద్రోహం చెయ్యకండి.

**13. మీరు విలేఖరులా?**

ఆవుల, ఎద్దుల మీద విమర్శనాత్మక రచనలు చేసి ద్రోహం చేయకండి.

**14. మీరు సానుభూతిపరులా?**

మీ సానుభూతి బాధితులకు చేరడానికి గోసేవ చెయ్యండి.

**15. మీరు విశ్లేషకులా?**

ప్రజల మానసికవికాసం కోసం వాళ్లను ఉత్తేజపరచండి. స్వార్థంతో పశుహత్యలు చేయకుండా ఉండడానికి కృషి చెయ్యండి.

**16. మీరు స్వాములా?**

మీ ఉపన్యాసాలలో ఆవుల సద్గుణాలని గోవంశఖ్యాతిని గురించి చెప్పండి.

**17. మీరు గోపాలకులా?**

ఆవుపాల ప్రభావాన్ని జనానికి తెల్పండి.

**18. మీరు కవులా?**

గోమాత పిలుపుకు మీ గొంతు కల్పండి.

ఇంటింటికి ఆవు - గ్రామ గ్రామానికీ గోశాల

గోమాత రక్షణ - మానవుని కర్తవ్యం.

గోమాతను హింసిస్తే (i) భవ్యభారతాకాశంలో సూర్యాస్తమయం అయిందను కోవాలి-

(ii) ఇప్పుడున్న కొంచెం కొత్తదనం కూడా పోతుంది-

(iii) ఈ స్వర్ణభారత భూమి ఇక శ్మశానం అయ్యే ప్రమాదం ఉంది - నాశనమవుతుంది - అంతరిస్తుంది.

ఇదంతా ప్రజాహితం కోరి చెప్పడమే.

## ధర్మం-బలిపీఠం:

ఈ సంఘటన 1947 లో జరిగింది. భారత భూమినుండి విడిపోయి పాకిస్థాన్ వేరయినప్పుడు పంజాబ్ , సింధు, బెంగాల్‌లోని మహమ్మదీయులలోని గూండాలు హిందువులను అగ్నికి ఆహుతి చేయడం, నరకడం, హింసించడం జరిగేది. వారు హిందువులను తమ ఖడ్గాలకు బలిచేశారు. హిందూధర్మాన్ని వదలమని హింసించారు. పంజాబ్‌లోని టెహల్‌రాం గ్రామంలో గూండాలు హిందువుల ఇళ్ళను చుట్టుముట్టి "మీరంతా ముస్లిములు కండి లేకపోతే అందర్ని చంపేస్తాం" అన్నారు- హిందువులు ఆలోచించి 'కల్మా' చదువుతున్నట్లుగా నటించి లోపల 'రాం' 'రాం' అనుకున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన ముస్లిములు వారిచేత గోమాంసం తినిపించి వాళ్లను భ్రష్టుల్ని చెయ్యాలని ప్లాన్‌వేశారు. అది అర్థం చేసుకున్న హిందువుల నాయకుడు పండిట్ బీహార్‌లాల్‌తో వారు ఇలా అన్నారు. "మీరందరూ గోమాంసం తిని, మీ మనస్సులనుండి హిందూధర్మాన్ని వదలి ముస్లిములుగా మారినట్లు నిరూపించండి. తినని వాళ్లను పాపులుగా భావించి చంపేస్తాం". అది విన్న బీహారీలాల్ బాధపడి, ధర్మవీరులయిన హకీకత్‌రాయ్, గురుగోవింద్‌సింగ్ ప్రాణత్యాగం చేసిన సంఘటనలు గుర్తుకు తెచ్చుకుని, వారిలా ప్రాణాలను త్యాగం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ప్రాణం ఉండగా తమ సోదరీమణులను, పుత్రికలను ఎత్తుకుపోనివ్వకూడదని, వారి పవిత్ర శరీరాలను ఈ పాపాత్ములను తాకనివ్వకూడదని ఇలా అన్నారు. "మాకు నాలుగు గంటల వ్యవధి ఇవ్వండి; ఈలోపు అందరికీ నచ్చచెప్పి, మీరు చెప్పినట్లు చేస్తాం" అన్నారు. ముస్లిములు ఒప్పుకున్నారు. లాల్‌గారు అందర్నీ ఒక చోట చేర్చి ఆలోచించారు. అందరూ కూడా ధర్మబలిపీఠంమీద ప్రాణత్యాగం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. రుచికరమైన భోజనాలు వండుకుని తిని, వస్త్రాలు, ఆభరణాలు ధరించి ధర్మరక్షణ కోసం చావడానికి సిద్ధం అయ్యారు. ఒకే వరుసలో కూర్చున్నారు. సనాతన ధర్మరక్షణ, గోరక్షణ కోసం బలైపోదామనుకున్నారు. లాల్‌గారు వరుసగా అందర్నీ కాల్చేశారు. ఎవ్వరూ ఏడువలేదు. ఇల్లు శ్మశానమైంది. లాల్, అతని సోదరుడూ ఇద్దరే మిగిలారు. ఎవరు ముందనికాకుండా, ఇద్దరూ ఒకేసారి కాల్చుకుని చనిపోయారు. ముస్లిములు రాకముందే అందరూ కాల్చుకుని చనిపోయారు. తర్వాత ముస్లిములు వచ్చి ఆ సంఘటనను చూచి ఆశ్చర్యపోయారు.



## ఆవుపాలతో అద్భుత ఉపచారం (జరిగిన కథ) :

ఆవును 'మాత' అని పాలను 'అమృతం' అని భావిస్తాం ఈ సంఘటన 1945లో జరిగింది. కాశీలో ప్రముఖవైద్యుడు పండిత రాజేశ్వరదత్‌శాస్త్రి. బీహార్‌లో ధనవంతుడయిన జమీందార్, క్షీణించిన తన భార్యను చికిత్సకోసం తీసుకొచ్చారు. ఆమె వయస్సు 30 సం॥. నీరసించి కట్టెలా తయారైంది. ఎంత ప్రయత్నించినా ఆ భయంకర వ్యాధికి అంతు చిక్కలేదని శాస్త్రిగారితో చెప్పారు. శాస్త్రిగారు ఆమెనాడి చూసి క్యాన్సర్ అని చెప్పారు. ధైర్యంగా నమ్మకంతో మందు వాడితే 6 నెలల్లో తగ్గిపోతుందని చెప్పారు. నల్లనిరంగు 'ఆవు' యొక్క పాలు, కృష్ణతులసి ఆకులతో కలిపిన పెసరట్టు చేసి ఇవ్వండి. జొన్నరొట్టె పెట్టండి. వేరేమందులు వాడకండి అని చెప్పారు. ఆ మందుపై విశ్వాసంతో ఆయన చెప్పినట్లు చేశారు. జబ్బు తగ్గిపోయింది. వెంటనే శాస్త్రిగార్ని కలిసారు. చూశారా! ఆవుపాలు ఎంతగొప్పవో-అందుకే మీరు ఒక తులసి తోటపెంచి, 4,5 ఆవుల్ని పోషించి సేవచేస్తూ ఉండండి అన్నారు డాక్టర్‌గారు.

వైద్యుణ్ణి బహుమతి తీసుకోండని బలవంతం చేశారు. ఇదంతా గోమాత దయకాబట్టి గోశాలకు దానం ఇవ్వండి. పాలచికిత్సను అందరికీ తెలియ జేయండి. శాస్త్రపరిశోధకులు ఇంకా నిరూపించలేకపోయారుగాని, క్యాన్సరుకి ఇదే మందు - గోమహిమతోపాటు నమ్మకం, విశ్వాసం, పరోపకార భావన ఉండాలి.

## గో సంరక్షణ ఫలితం :

సేఠ్ సాధీరాంజీగారి దగ్గర ఒక నౌకరున్నాడు. అతని పేరు సావల్. అతని ముత్తాత బికనీర్ తాలూకా 'విడ్‌రావణా' అనే గ్రామంలో నివసిస్తున్నాడు. ఒక రోజున పొలానికి వెళ్లే దారిలో ఒక ఆవు కాళ్లకు గాయాలయి నడవలేక బాధపడుతోంది. అది చూచి తాత ఒంటెమీద గ్రామానికి వెళ్లి తౌడు, 4 బిందెలనీళ్లు తీసుకొచ్చాడు. ఆవు తౌడు తిని నీళ్లుతాగి, పచ్చగడ్డి తినింది. అతని సేవతో ఆవు కోలుకుని నడిచి వెళ్లేందుకు తయారైంది.

సావల్ ముత్తాత బావులు త్రవ్వడంలో నిపుణుడు. బికనీర్‌లోని బావుల్లో 60, 70 చేదల క్రింద నీరుపడుతుంది. చాలు భూమిలో బావి త్రవ్వడం పాము నోట్లో వేలు పెట్టడమే. త్రవ్వుతూండగా, పైనుండి మట్టిపెళ్లలు పడి మూసుకుంది. అందరూ అతడు చనిపోయాడనే అనుకున్నారు. గ్రామ సేవకుడని, 12వ రోజున పాయసం వండి అతని పేరున అందరికి పంచాలను కున్నారు. నీళ్లకోసం చాదవేస్తే వెళ్లలేదు- నల్లని ఆకారం చాదకు అడ్డు వచ్చింది. దాన్ని దెయ్యం అనుకున్నారు. భూతవైద్యుల్ని పిల్పించారు. మిర్చి, ఉప్పుతో పొగవేశారు, భూతాన్ని వదలించుకోవడానికి. సాహసించి కొందరు బాలురు కఱ్ఱలతో లోపలికి దిగారు." నేను దెయ్యాన్ని కాదు బతికే ఉన్న తాతని" అని చెప్పాడు. అతనికి ఒక దుప్పటికప్పి పైకి తీసుకొచ్చారు. అప్పుడు ఆ తాత జరిగిందంతా ఇలా చెప్పాడు. గోమాత దయతో బ్రతికాను- ఏ ఆవుకు చివరిదశలో నేను సహాయం చేశానో అది అక్కడ ఉండి నన్నుకాపాడి,



పాలిచ్చింది. పాలుబాగా త్రాగి బ్రతికేను. తన కొమ్ములతో నన్నుపైకి నెట్టింది. ఇదిగో ఇప్పుడిలా మీ ఇంటికి వచ్చాను. ఇది నాకు పునర్జన్మ. గోమాతదయ" అన్నాడు. గోవు చేసిన మేలుకు అందరూ ఆనందించారు.

## గోసేవాఫలం (జరిగినకథ) :

ఒక బ్రాహ్మణుని ఇంటికి ఒక స్వాములవారు అతిథిగా వచ్చారు. ఆ బ్రాహ్మణునికి సంపదకు లోటులేదు. కాని సంతానం లేదు. ఆ దిగులుతోనే ఉండేవారు వాళ్ళు. ఆ స్వామీజికి ఆ దంపతులిద్దరూ అతిథి సత్కారాలు చేసి సేవించారు. గ్రామంలోని అందరూ ఆయన దర్శనానికి వచ్చారు. స్వామీజీ మర్నాడు ఉదయాన్నే లేచి వేరేచోటికి వెళ్లాలని బయలుదేరాడు. భోజనంచేసి వెళ్లండని ఆ దంపతులు ఆయన్ని ఆపినారు. భోజనం చేసి వెళ్తూ, వారిని 'సుపుత్ర ప్రాప్తిరస్తు' అని దీవించాడు. స్వామీజీ ఇలా దీవించినందుకు వారు సంతోషించారు. గోసేవ చెయ్యుమని వారితో చెప్పి, స్వామిజీ వెళ్లిపోయారు. ఆరోజునుండి బ్రాహ్మణ దంపతులు గోసేవ చెయ్యడం ప్రారంభించారు. ఆవుకాళ్లు కడిగి ఆనీళ్లు తల మీద చల్లుకుని, త్రాగేవారు. గోశాలలో దీపంపెట్టి, ఆవుకి మెత్తనిపడక ఏర్పాటుచేసి, రోజూ గోశాలను శుభ్రపరచి, ఏలోటూ లేకుండా చేసేవారు. కొద్ది రోజుల్లో ఆవు, దూడ పుష్టిగా తయారయ్యాయి.

కొద్దిరోజుల్లో ఆ ఇల్లాలు గర్భవతి అయింది. పుత్రుడు జన్మించాడు. గ్రామంలోని అందరూ ఆనందించారు. స్వామిజీ ఆశీర్వాద ఫలితమని తలచి, అందరూ గోసేవ చేయడం ప్రారంభించారు. ఈ సంఘటన కాళిదాసు 'రఘువంశం' లో ఉంది.

సూర్యవంశానికి చెందిన దిలీపమహారాజు, పుత్రులు లేని కారణంగా, వసిష్ఠుని సలహాతో గో సేవ, గోసంరక్షణ చేస్తే సంతానం కలిగింది. దిలీప మహారాజు, భార్య సుదక్షిణతోకూడి భక్తిభావంతో వసిష్ఠుడు చెప్పిన వ్రతాన్ని ఆచరించి నందినీధేనువు సేవ చేసి, దాన్ని రక్షించడానికి అడవులు, పర్వతాలు,

సరస్సులు తిరిగేవాడు. ఒకనాడు ఒక మాయసింహం నందిని మీదికి దూకి దాడిచేసి, రాజును పరీక్షించి తర్వాత గోమాతగా కనిపించి ఆ దంపతుల నాశీర్వదించింది- దాని ఫలితంగా రాణి 'రఘు' మహారాజుకి జన్మ నిచ్చింది.

నాకు సంతానం కలిగిన తర్వాత, నేనుకూడా నా శిష్యుడికి గోసేవ చేయుమని సూచించాను. అతని భార్య కూడా గర్భవతి అయింది. గోసేవా మహిమ ఇకముందు, ఇప్పుడూ, ఎప్పుడూ ఉంటుంది - ఇది నా దృఢవిశ్వాసం. హృదయపూర్వకంగా గో సేవ చేస్తే ఫలితం శ్రీకృష్ణసాన్నిధ్యమే.

**గోసేవాఫలితం (జరిగినకథ) 2 :**

ఈస్టబెంగాల్‌లో ఒక జనపనార ఫ్యాక్టరీ ఉంది. దాని మీద ఒక దుష్ప్రచారం ఉంది-దాని యజమానికి లాభంరాదనీ, చెడుజరుగుతుందనీ- తక్కువ ధరకి వస్తుంది కదా అని ఒక వ్యక్తికొన్నాడు. దానివల్ల అతనికి శారీరక, ఆర్థిక బాధలు కలిగాయి. జగన్నాధరథయాత్ర ముగించుకొని వచ్చిన ఒక స్వామీజీకి దాన్ని చూపి సలహా అడిగాడు. గంగానదీ తీరాన ఉంది; భగవంతుని దయవల్ల నీకు దొరికింది; నువ్వు అమ్మవద్దు- ఈ అమంగళం పోగొట్టే ఒక ఉపాయం ఉంది- మంచి ఆవుకు మంచి గ్రాసం పెట్టి పెంచు. దానిపాలు నువ్వువాడుకోకుండా దూడకు ఇచ్చెయ్. ఆ ప్రాంతంలో శ్రీ గోపాలకృష్ణ మందిరం నిర్మించు. పీడవదలి లాభం పొందుతావని సలహాఇచ్చాడు. యజమాని ఆయన చెప్పినట్లు చేశాడు. గోసేవా ఫలితంగా భూతాలపేరున్న ఆ ఫ్యాక్టరీ అభివృద్ధి చెందింది- ఇదివరకు దానిలో పనిచేయడానికి ఇష్టపడనివారు తిరిగివచ్చారు. కొత్త యంత్రాలు వచ్చాయి. యజమానికి ఎంతో లాభించింది-ఇదంతా గోసేవా ఫలితమే అని తెలుసుకున్నాడు.

**గోరక్ష-ప్రతిజ్ఞ (జరిగినకథ) :**

1928లో ప్రయాగలో త్రివేణీ సంగమతీరంలో అఖిలభారత సనాతన ధర్మ మహాసభ జరుగుతోంది. వ్యాఖ్యానవాచస్పతి దీనదయాళ్‌జీ వచ్చారు.



భక్తుడైన హాసనంద్ వర్మగారు గోహత్యని వ్యతిరేకిస్తూ నల్లనివస్త్రం ధరించి ముఖంమీద మసిపూసుకుని సమావేశానికి వచ్చారు. మదన్‌మోహన్ మాలవ్య రాజుగార్ని సంబోధిస్తూ 'గోమాత భారతదేశం, హిందూత్వానికి ఆధారం- మీరు గోహత్యను నిషేధించాలి' అన్నారు. దానికి మాలవ్యా స్పందించి ' నీ ముఖానికి మసిపూసుకుని వచ్చేవ్! గోహత్యలవల్ల నీముఖం నల్లబడలేదు- భారతీయు లందరికీ మసి ఉంది. మహారాజు త్రివేణీ పవిత్రజలంతో అతని ముఖాన్ని కడిగేసి, గంగాజలాన్ని చేతిలోకి తీసుకుని ఇలా ప్రతిజ్ఞచేశాడు- ''జీవితాంతం గోరక్ష- గోసేవకోసం శ్రమిస్తాను''-అదే సమయంలో పండిత దీన్ దయాళ్‌జీ గారు గోసప్తాహం జరపడానికి సంకల్పించారు. అఖిల భారతీయ గోరక్షానిధి స్థాపనకు ప్రకటన చేశారు. మహారాజు, మాలవ్య 1928లో కలకత్తా లోని కాంగ్రెస్ సమావేశంలో స్పష్టంగా ఇలా అన్నారు. గోమాత భారతదేశం యొక్క ప్రాణం. దీని హత్యని ధర్మయుతమైన భారతదేశం సహించకూడదన్నారు.

**గోమాతదయ :**

అహమ్మద్‌నగర్‌లోని శ్రీరాంపూర్‌లో శ్రీ లక్ష్మీ ఇండస్ట్రీస్ అనే ఒక మిల్లులోజరిగిన సంఘటన. శ్రీ రఘునాథ్ దాస్ దాన్ని ప్రారంభించారు. రెండు సంవత్సరాలదాకా యంత్రాలు విరిగిపోవడం, ఏదో విధంగా నష్టం జరగడం, ప్రయత్నాలు ఫలించకపోవడం జరుగుతుండేవి. ఒక రోజున మిల్లు గేటు దగ్గర ఒక ఆవు పడి ఉంది. కసాయివాడు దాన్ని కట్టి తీసుకెళ్లడానికి ప్రయత్ని స్తున్నాడు. చూసేవాళ్లకి బాధ కలిగింది. ఆ మిల్లుకార్మికులు ఆ విషయం మేనేజర్‌కి చెప్పారు. అతను వచ్చి కసాయివానికి కొన్న వెలకంటే రూ 5 ఎక్కువిచ్చి ఆవుని విడిపించాడు. ఆనాటి నుంచి ఆ ఆవును మిల్లులోనే పెంచి పోషించారు. దినదిన ప్రవర్ధమానమై మిల్లు అభివృద్ధి చెందింది. ఇదంతా గోమాత దయవల్లే జరిగింది. మూడు మంచి రంగులు గల దూడలను ఆ గోమాత ఈనింది. రోజూ 5 లీటర్ల పాలు ఇస్తోంది. పిల్లలు దగ్గరకువెళ్లినా ఏమీచేయదు- జంతువులు వస్తే తరిమేసేది. భగవంతుడే ఆ గోవును మిల్లు దగ్గరకు పంపించేడని, అందుకే ఆ మిల్లుకి శుభం జరిగిందని అందరూ అనుకున్నారు.

## గోమాత సేవాఫలం:

ఒకగ్రామంలో ఒక వ్యవసాయదారుడుండేవాడు. అతని తండ్రి జీవితకాలం ఈశ్వర ఆరాధన, ధ్యానం చేసేవాడు. ఆయన హయాంలో వ్యవసాయం, భూమిసంపాదన బాగా సాగింది. గ్రామప్రజలు అందరూ ఆయన మీద అభిమానంగా ఉండేవారు. ఆయనపోయిన తర్వాత వ్యవసాయం సాగలేదు. ఆదాయం తగ్గి తిండికికూడ ఇబ్బంది కల్గి చాలాబాధపడ్డాడు. తన తమ్ముళ్ల కోరిక ప్రకారం వాళ్లకు ఆస్తి పంచి కాలక్షేపం చేయసాగాడు. నాల్గు సంవత్సరాల తర్వాత అతని పరిస్థితి బాగా క్షీణించింది- అప్పుల బాధ ఎక్కువైంది. ఊళ్లో వాళ్లందరూ అతడు సోమరి, పనికిరానివాడన్నారు. ఇంత జరిగినా అతడు భగవంతుణ్ణే నమ్మాడు. ఒక రోజు రాత్రి కల వచ్చింది- ఆవులు, ఎద్దులు అతన్ని వేధిస్తున్నట్లు, మానవభాషలో మాట్లాడి 'మా గురించి ఆలోచించు. మమ్మల్ని గోశాలలో ఉంచావ్-తిండిలేక ఛస్తున్నాం- మమ్మల్ని చూడకపోతే నీ గతి ఇంతే' అని అతడ్ని హెచ్చరించాయ్.

తెల్లవారుతుండగా లాంతరు తీసుకొని గోశాలకి వెళ్లి చూశాడు. నిలబడ్డ ఆ పశువులు బాధగా అతణ్ణి అలా చూడసాగాయి. వాటిని చూచి అతను బాధపడి వెంటనే స్వయంగా గోశాలను శుభ్రపరచి, వాటికి మేతవేసి ఉదయం, సాయంకాలం దూడలకు పాలు వదలి, గ్రాసం, మంచినీళ్లూ ఇస్తూ వచ్చాడు. ఆవులు, ఎద్దులు మేతకెళ్లినప్పుడు గోశాల శుభ్రం చేయడం, పేడను గోతిలో నిల్వచేయడం చేసేవాడు.

అతడి సంరక్షణలో పశువులు బలిష్ఠంగా తయారయి పాలు, పెరుగు బాగా ఇచ్చేవి. ఎద్దులు వ్యవసాయంలో సహకరిస్తే, ధాన్యం ఇదివరకటికంటే 5,6 రెట్లు దిగుబడి వచ్చింది. అప్పులన్నీ తీర్చేశాడు, నిరాశపోయి, గోసేవమీద శ్రద్ధపెరిగింది. అతన్ని తిట్టిన వాళ్లంతా అతడ్ని మెచ్చుకోసాగారు. ఈ సంఘటన నిజంగా జరిగిందే.

ఈ రోజున గోమాత దయవల్ల ఆమె ఆశీస్సులతో అతని స్వయంకృషి ఫలించి అతని పరిస్థితి బాగుపడింది. 'గోవుల్ని పెంచే వ్యవసాయదారులు



దరిద్రంతో ఉన్నారంటే నామార్గమే వారికి శ్రేయాదాయకం' అని బల్లగుద్ది మరీ చెప్పాడు. గోసేవవల్ల దరిద్రతపోయి శుభం జరుగుతుంది అని నిరూపించాడు.

## యమబాధల నుండి విముక్తి

-శ్రీ భిక్షుగౌరీశంకర్

ఒక వ్యక్తి జీవితమంతా పాపాలు చేస్తూ ధనార్జన చేసి జీవించసాగాడు. ఒకనాడు తాను వెళ్ళేదారిలో ఒక ఆవు గాయాలతో పడి ఉంది. పుండుతో బాధపడుతోంది. దానిలో పురుగులు, దుర్గంధం- అది చూచి అతడు దగ్గర కెళ్లి తన వేళ్లతో ఆ పురుగుల్ని తీసి, గాయానికి మందువేసి సేవ చేశాడు. కొన్నాళ్లకి గాయం మాని ఆవు ఆరోగ్యం చక్కబడింది.

అతడు కొన్నాళ్లకి చనిపోయాడు. నరకానికి వెళ్ళేడు. తనుచేసిన దుష్కర్మలను తలచుకొని ఆకలి దప్పులతో బాధ అనుభవించాడు. యముడు అతని పాప పుణ్యాల చిట్టా చూశాడు. ఆవు గాయం మాన్పి, గోసేవ చేశాడని ఉంది. యముడు సంతోషించాడు. తన చేతివ్రేలిని చీకమన్నాడు. అతడు అలాచేస్తే, దాంట్లోంచి అమృతం ధారగా వచ్చింది. దానిని అతడు త్రాగి ఆకలినుండేకాక పాపాలనుండి కూడా విముక్తుడయ్యాడు

## గోమాతను అవమానించడం నేరం

-రామ్‌చరణ్‌దాస్

కాశ్మీరు రాజు ప్రతాప్‌సింగ్‌గారు గో, బ్రాహ్మణుల పట్ల దయగలవాడు. గోవులను పోషించి ఆదరించేవాడు. అతడు వేదపండితుడు. సనాతన ధర్మాలపై విశ్వాసమున్నవాడు. వందలకొలది బ్రాహ్మణులు ఆయన దగ్గర వేదపఠనం, చండీ పారాయణం, జపాలు, అనుష్ఠానం చేసేవారు. తన రాజ్యంలో ఎవరూ గోహత్యచేయరాదని, గోవు గురించి చెడుగా మాట్లాడకూడదనీ శాసనం చేశాడు.

ఒకరోజున ఆయన అధికారులతో వాహనంలో బయటకు వెళ్తుండగా, ఒక వీధిలో ఆవు దారికి ప్రక్కన ఉంది. కొంతమంది పనివాళ్లు ఆవుని కొట్టి లేపి ప్రక్కకు పంపించారు, రాజుగారి వాహనానికి అడ్డుగా ఉందని వారలాచేశారు. ఆ విషయం తెలుసుకున్న రాజుగారు వాహనాన్ని ఆపి, చాలా బాధపడ్డాడు. ఆవుకు ఇబ్బంది కలిగించినందుకు వాళ్లతో ఇలా అన్నాడు. మనం భారతీయులం. 'గోబ్రాహ్మణ సేవే మానవత్వం'. నా గురించి పరమపూజ్యమైన గోవును అవమానించారు- భవిష్యత్తులో ఇలా చేయకండి! ఇలా చేస్తే మీ ఉద్యోగాల నుంచి మిమ్మల్ని తొలగిస్తాను'.

రాజుగారి గోభక్తికి, మానవత్వానికి అందరూ ఆశ్చర్యం చెందారు. వారందరూ హర్షాతిశయంతో జయజయ ధ్వానాలు చేశారు.

**గో భక్తిఫలితం (100 సం॥క్రితం జరిగింది) :**

బ్రిటిష్ రాజ్యానికి, కొల్హాపూర్ రాజ్యానికి మధ్య ఒకగ్రామం ఉండేది. ఆ గ్రామంలోని దేవాలయంలో ఒక ఆవు ఉండేది. కొందరు కసాయివాళ్లు ఆ ఆవును బంధించి ఆంగ్లేయుల రాజ్యంలోకి తీసుకెళ్తూ మధ్యనున్న ఒక అడవిలోకి చేరారు. ఆవుతో దూడ కూడా ఉంది. అవి తాళ్లను త్రెంచుకుని పారిపోవాలనుకున్నాయి. కసాయివాళ్లు వాటిని కొరడాతో కొట్టారు. అయినా అవి కట్లు త్రెంచుకునే ప్రయత్నంచేసేవి. వాటిలో ఆవు తప్పించుకుని, పరుగెత్తి ఆ ఊరి కరణం గారి ఇంటికి వెళ్లింది. కసాయివాడు దాన్ని వెంబడించి పట్టుకోలేక మిగిలిన దూడను తీసుకెళ్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వాళ్లమధ్య వాదోపవాదాలు జరిగాయి. చివరకు దూడకు రూ. 50 ఇస్తామని బేరం చేశారు కసాయివాళ్లు.

శరణన్నవారిని కాపాడాలని హిందువులు వదలిపెడతారు, గోమాతను గురించి మన పూర్వికులు ఎన్నోత్యాగాలు చేశారు. అటువంటి పరంపర మనది. అలాంటి గొల్లలు, గ్రామస్థులు కసాయివారిని ఎలా వదలుతారు?



కసాయివాళ్లకు ఆంగ్లేయుల అండ ఉంది. దూడవైపు వాళ్లకి ధర్మం అండ ఉంది. ఈ కేసు రాజుగారి దగ్గరకు వెళ్లింది. కరణంగార్ని పిలిపించారు. దూడను రాజుగారి దగ్గరకు తీసుకవెళ్లి జరిగిందంతా చెప్పేరు.

మీరు గోబ్రాహ్మణులను పోషిస్తారు. అధికారులు మీరు ఎలా చెబితే అలా చేస్తామన్నారు. రాజుగారు అంతావిని ఆవును గ్రామస్థులకు అప్పగించి, "కొల్హాపూర్‌లో కసాయి ఉద్యోగం చెయ్యకండి. హిందూధర్మం కాపాడండి." అని చెప్పారు. గోవును, దూడను గ్రామస్థులు శివునికి అర్పించారు. బ్రతికి ఉన్నంతవరకూ ఆవు శివాలయంలోనే ఉంటుంది" అని అన్నారు.

ఆ ఆవు ఆలయంలో రోజూ అరలీటరు పాలు శివుని అభిషేకంకోసం ఇచ్చేది- వట్టిపోవడం, గర్భందాల్చడం లేదు - నిత్యం పాలివ్వడం ఆశ్చర్యం కలిగించింది అందరికీ-

**గో చర భూమి :**

ఆవులుండే భూమిని ఆక్రమించుకుంటే కలిగే పాపంగురించి గోరక్షణ మార్గదర్శకులు జగన్నారాయణ మహారాజుగారు ప్రసంగించారు. అందులోని ఒక కథ: ఒక చండాలస్త్రీ మండే అగ్నిలో మనిషి పుర్రెను పెట్టి దానిలో కాకి మాంసం ఉంచి వండుతోంది. దానిని కుక్కచర్మంతో మూసి ఉంచింది. దారిని పోయే ఒక బ్రాహ్మణుడు దాని గురించి వివరణ అడిగాడు.

ఆవులు నివసించే భూమిని ఆక్రమించే పాపాత్ముడు ఎవరైనా దానిని చూస్తే అది పనికిరాకుండా పోతుంది. అందుకే అలా మూసి ఉంచాను అందామె.

ఆవులు నివసించే భూమిని వాటికే వదలివెయ్యాలి గాని, దాన్ని ఆక్రమించుకొని లబ్ధి పొందాలనుకుంటే మహాపాపం- భారతదేశంలో నేడు గోవులకు బీళ్లు చాలా అవసరం కాబట్టి అందరూ కలసి గోశాలలకు భూమిని కేటాయించాలి లేదా ఆక్రమించుకున్నవారి నుంచి ఆ భూములను కాపాడాలి.

**గోరక్ష ఆత్మరక్ష :**

క్రీ.శ. 1857వ సం॥ విప్లవజ్వాల భారతదేశంలో విస్తరించి ఉంది. దాని కేంద్రమైన ఢిల్లీ ప్రతి వీధి రక్తపు మడుగులతో యుద్ధభూమిగా మారింది. దొంగలు మంచిచెడు విచక్షణ కోల్పోయారు. ఆ సమయంలో ఒక దోపిడి దొంగ చెప్పిన కథ ఇది. నేను దోపిడి దొంగల నాయకుణ్ణి. రోజంతా దొంగ తనాలు, దోపిడీలు చేసి శరీరం అలసిపోయింది. ఎముకలు విరిగినట్లయింది. ఆకలితో ఉన్న మా జేబులు, సంచులు డబ్బుతో నిండుగా ఉన్నాయి. అయినా అన్నంకోసం ఆరాటం. మేము మహమ్మదీయులం. దొంగలకు భయపడి ప్రజలు ఇళ్లకు తాళాలు వేసుకుని పారిపోయారు. బజారు నిర్మానుష్యంగా ఉన్నది. ఆ సమయంలో మేమందరం ఒక కూడలిలో సమావేశమయ్యాం. ఆ అయిదుగురిలో నేనే పెద్ద. నేను వెళ్లలేక మిగిలిన వాళ్లని ఆహారంకోసం పంపించాను. కొంచెంసేపటికి వాళ్లు ఒక ఆవును తీసుకొచ్చారు. ఆకలితో ఉన్న నా ఎదుటే దాన్ని కట్టిపడేసి, ఆయుధాలకి పదనుపెట్టి చంపడానికి సిద్ధమవుతున్నారు. ఆవు చూలుతో ఉంది. కళ్లవెంట నీళ్లు వస్తున్నాయి. దాన్నిచూసి నాదేశంలో గర్భవతి అయిన నాభార్య గుర్తుకొచ్చింది. నా ఆలోచన మారింది- ''ఆకలితో నాప్రాణం పోతోంది ఏం చేస్తున్నారు? వెళ్లి ఉప్పు, కారం తీసుకురండి; కట్టెలు ఉన్నాయా? అంటూ అరచాను. వాళ్ళు భయంతో పరుగెత్తారు అన్నీ తీసుకరావడానికి. ఈలోగా ఆవుకట్లు విప్పేశాను. పాపం ఆవు నేనేం చేస్తానో అని భయంగా నాకేసి చూసింది. నేను పొమ్మని సైగ చేశాను. అది నన్ను ఆశీర్వదించినట్లు చూసి వెళ్లిపోయింది.

తర్వాత నా మిత్రులు వచ్చారు-ఆవు ఏదని అడిగారు-నేను నీరసంగా ఒళ్లు తెలియక పడి ఉన్న సమయంలో ఆవు పారిపోయిందని చెప్పాను. నా మాట నమ్మారు. పిండితో రొట్టె చేసుకుతిన్నాం. ఈ సంఘటన తర్వాత నన్ను పోలీసులు పట్టుకున్నారు. ఉరిశిక్షపడింది- నేను ఉరికంబం పై నున్నాను. మెడలో ఉరిత్రాడు నా పై సిద్ధంగా ఉంది. క్రింద బల్లతీస్తే చచ్చిపోతాను.



నాకు స్పృహ తప్పింది- కాస్సేపటికి స్పృహవచ్చింది. నేను బ్రతికే ఉన్నాను. కాళ్ల కింద రెండు కొమ్ములు ఉన్నాయి. కొంతసేపటికి నన్ను బైటకు తీశారు. ఆ ఆవు నన్ను కాపాడింది. అది తెలుసుకున్న నేను గోవుకు శిరస్సువంచి నమస్కరించాను. అప్పట్నుంటి గోసేవ, గోపూజా చేస్తున్నాను.

గోవును రక్షిస్తే అది మనను రక్షిస్తుందని తెలుసుకున్నాను.

**'ఆవు' వెల అనంతం :**

భృగుమహర్షి పుత్రుడు చ్యవనమహర్షి. మహాతపస్వి. గొప్పవ్రతం సంకల్పించి నీటిఅడుగున ఉండడానికి నిశ్చయించుకున్నాడు. అభిమానం, సంతోషం, దుఃఖం మొదలగు వాటిని త్యజించి 12 సంవత్సరాలు జల సమాధిలో ఉండిపోయాడు. మహాత్ముని స్వభావం, తపస్సు చూచి జలచరాలన్నీ ఆయనకు స్నేహితులయ్యాయి. ఆ మహర్షి శ్రద్ధాభక్తులతో, వినయంతో గంగా, యమునా సంగమంలో ఉన్నాడు. అప్పుడప్పుడు నిశ్చలంగా నీటి ఉపరి తలంలో కూర్చుండి ఉంటాడు. ఇలా కొంతకాలం జరిగింది.

ఒకరోజు బెస్తవారు చేపలను పట్టడానికి వలవేశారు. చేపలతో పాటు ఆ ఋషి కూడా వలలో పడ్డాడు. బెస్తవారు శ్రమతో బైటికి లాగారు. బురదతో నున్న ఋషిని చూచి భయపడ్డారు. క్షమించుమని అడిగారు. నీటిలోంచి బయటకు వచ్చిన చేపలు చనిపోయాయి. ఇంతకాలం ఈ నీటిలో నాతో పాటు చేపలు మెలిగాయి. ఈనాడు అవి చనిపోయాయి కాబట్టి నేను కూడా వాటికోసం ప్రాణత్యాగం చేస్తాను అని అన్నాడు. ఆ మాటలు విని బెస్తవారు భయంతో వణకిపోయారు. మహర్షి త్యాగానికి వారు తట్టుకోలేకపోయారు- 'నహుష' చక్రవర్తిగారి దగ్గరకువెళ్లి చెప్పుకున్నారు. ఇటువంటి మహర్షి ఈ రూపంలో ఇక్కడికి రావడం భగవంతుని కృపగా భావించి. మంత్రులు పురోహితులు అందరూ కలసి అక్కడికి వెళ్లారు. మహర్షిని యథావిధిగా పూజించి, చేతులు జోడించి నమస్కరించి మీరేది సెలవిస్తే అది చేస్తామని ప్రార్థించి అడిగారు. 'రాజా ! ఈ బెస్తలు నన్నువలలో పట్టుకొని, కష్టపడి తెచ్చేరు- నాతో వచ్చిన చేపలు చనిపోయాయి పాపం ! వీరి జీవితం ఎలా

గడుస్తుంది. ఈ చేపల ధరతోపాటు, నా ధరకూడా వీళ్లకివ్వండి. వాళ్లు జీవితం గడుపుకుంటారు అని అన్నాడు.

రాజుగారు వెంటనే మంత్రిని పిలిచి, బెస్తవారికి మహర్షి - ఆజ్ఞ ప్రకారం 1000 బంగారు నాణేలు ఇవ్వండి. అన్నాడు. "రాజా! నాధర వెయ్యి బంగారు నాణేలేనా! మీ బుద్ధి నుపయోగించి నా వెల నిర్ణయించండి" అని అన్నప్పుడా చక్రవర్తి 'మంత్రిగారూ' ఈ బెస్తవారికి లక్ష బంగారు నాణేలను ఇచ్చిపంపండి' అన్నారు. మహర్షి మాట్లాడలేదు. మహర్షికి తృప్తిగా లేదని తలచి "కోటి నాణేలు ఇవ్వండని మంత్రిగారి నాదేశించారు". మహర్షి 'ఇంతేనా' అన్నాడు.

రాజుగారు 'సగంరాజ్యం వారికివ్వండి' అన్నాడు.

మహర్షి నాకు సరితూగదు-మీకు అర్థంకాకపోతే మీ వారితో సంప్రదించి చెయ్యండి' అని అన్నాడు.

చక్రవర్తి ఆలోచించి ఏమీతోచక, పురోహితులతో, మంత్రులతో ఆలోచించి ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. ఒక ముని రాజు దగ్గరకు వచ్చి 'నేను చెబుతాను' అన్నాడు. రాజుగారు "చాల సంతోషం- నన్ను విపత్తునుండి కాపాడండి- నారాజ్యాన్ని కాపాడండి" అని ప్రాధేయపడ్డాడు- ఆ ముని 'ఓరాజా! బ్రాహ్మణులు, ఆవులు ఒకే కులానికి చెందినవారు. కాని రెండురూపాలుగా ఉన్నారు. బ్రాహ్మణుడు మంత్రం అయితే ఆవు హవిస్సు- వారిద్దరికీ వెల నిర్ణయించడానికి వీలుకాదు. వీరిద్దరికీ సమానమైనది గోవే కావున మీరు గోదానం చెయ్యండి". ఆ మాట విన్న చక్రవర్తి సంతోషించి "మహర్షీ ! నేను ఒక గోవు నిచ్చి మిమ్మల్ని కొనుక్కుంటాను. అదే మీకు సరైనధర."

మహర్షి సంతోషించి 'గోవుకు సమానమైనది ధనం కాదు- గోవుపేరు, గుణకీర్తనం, శ్రవణం, గోదానం, గోదర్శనం, ఇవన్నీకూడా మంగళకరమైనవే. గొప్పఫలితాల నిస్తాయి. సంపదల నిస్తాయి. అందులో సందేహం లేదు. మనుష్యులకు అన్నం, దేవతలకు హవిస్సు నిస్తాయి. గోవులే యజ్ఞాన్ని నడిపించేవి- దాని స్వరూపం దివ్యమైనది. అమృతం కలిగి ఉంటుంది.



ప్రపంచమంతా గోమాత ముందు శిరస్సు వంచుతుంది. ఎక్కడ గోవులు నిర్భయంగా ఉండగలుగుతాయో ఆ ప్రదేశాలు మంచి శోభను కలిగి ఉంటాయి. అవి పాపప్రక్షాళన చేస్తాయి- అవే స్వర్గానికి మెట్లు- ఆవులు స్వర్గంలో కూడా పూజింపబడతాయి. అన్ని కోరికల్ని తీరుస్తాయి. వాటి మాహాత్మ్యం వర్ణనా తీతం- రాజు గారిచ్చిన ఆ గోవును తీసుకొమ్మని మహర్షిని ప్రార్థించారు. మహర్షి "గోదానఫలితంతో, మీరందరూ, ఆ చేపలతో పాటు స్వర్గానికి వెళ్తారు" అని దీవించారు. అలాగే వారు స్వర్గానికి వెళ్తూ ఉంటే ఆ ముని, మహర్షి ఆనం దించారు. 'నీకేం కావాలో కోరుకొమ్మని రాజు నడిగారు. 'ధర్మబుద్ధి, భగవత్ భక్తి కలిగే వరం కోరాడు చక్రవర్తి. వారిద్దరూ 'తథాస్తు' అని ఆశీర్వదించారు.

**ఆవునేతితో అద్భుతం** :

నల్లని రంగుగల ఆవుయొక్క నెయ్యితో అనేక రోగాలు నయంకావడం నేను చూశాను. దీర్ఘరోగాలు, కుష్ఠవ్యాధులు సైతం తగ్గి లాభం పొందారు. అలాంటి ఒక సంఘటన: ఒకతనికి దీర్ఘకాలికరోగం ఉంది. అతను ధనవంతుడు. అదృష్టవశాత్తు అతనికి ఒక నల్లని ఆవు కూడా ఉంది. ఒకనెల పచ్చిగడ్డి, 250 గ్రా. చొప్పున బెల్లం, గోధుమలు, వేరుసెనగలు, పసుపు, సెనగలు, పచ్చి రొట్టలు, వాము, సైంధవలవణం, మెంతులు 50 గ్రాములు ప్రతీరోజూ తినిపించేవాడు. వేసవికాలం కాబట్టి ఆవును చల్లని నీడలో ఉంచడం, రెండు పూటలా స్నానం చేయించడం చేసేవాడు. ఆవు పాలతో, పెరుగు, వెన్న, నెయ్యి తయారుచేసేవాడు. ఆవు నెయ్యి మాలిష్ చేస్తే వారంరోజుల్లో రోగంతగ్గి పోయింది. ఈ సంఘటనతో ఆశ్చర్యం, సంతోషం కలిగాయి. నెయ్యితో చాల మందికి 100% ప్రతిఫలం లభించింది. స్నేహితునికి ఆపరేషన్ సమయంలో ముక్కులో రంధ్రం పడటంవల్ల మాట పడిపోయింది- ఎంతగానో ప్రయత్నించారు. కాగితంపై రాసి చూపేవారు. 3,4 రోజులు గొంతులో నెయ్యివేసి మాలిష్ చెయ్యగానే మాటలు రావడం మొదలైంది- 10 రోజుల్లో యథావిధిగా అతడు మాట్లాడ్డం ఆశ్చర్యం కల్గించింది.

**గో భక్తి ఫలితం :**

1896వ సంవత్సరములో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భయంకరమైన కరవు వచ్చింది. పశువులు, ఆవులు ఆకలిబాధతో మరణించాయి. బీజాపూర్ వైపునున్న "లమాణీ" జాతి ప్రజలు పొట్టకూటికోసం కొల్హాపూర్‌లోని చెంచలి గ్రామంలో ఉండేవారు- వారి దగ్గర ఆవులు, ఎద్దులు ఉండేవి. వాటిని వారు చౌకగా అమ్ముతూంటే కసాయివాళ్లు అది మంచి అవకాశం అనుకుని 4 అణాలనుంచి 12 అణాలవరకూ కొనేసేవారు. ఆకలితో, కసాయివాళ్ల దెబ్బలబాధతో అవి ముందుకువెళ్లలేక బాధపడేవి. దారిలోని హనుమాన్ దేవాలయం దగ్గర ఒక ఆవు మాత్రం స్వామిని నమ్ముకుని, తనని రక్షిస్తాడని అక్కడే కూర్చుండిపోయింది. కసాయివాడు దాన్ని కొడుతూంటే, అది లేవలేక, ఎవరైనా తనని కాపాడుతారేమో నని ఎదురుచూసింది. ఆ గ్రామంలోని బాలగౌడ్ పాటిల్ దాని బాధ చూడలేక కసాయివాడికి నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. కాని వాడు వినలేదు- మిగిలిన ఆవుల్ని గ్రామస్థులు ఎక్కువ డబ్బు ఇచ్చి విడిపించారు. కాని పడిపోయిన ఆవును ఎవరూ కొనలేదు. బాలగౌడ్ దాన్ని ఎక్కువ డబ్బు ఇచ్చికొన్నాడు. 'గోమాత! లే' అనగానే అది లేచి నిలబడింది. అందరూ ఆశ్చర్యంచెందారు. దానిని బాగా మేపేడు. గౌడ్ అదృష్టం పండింది. లక్ష్మి ఆయన ఇంట్లో తాండవించింది. అది చూసి అసూయపడి కొందరు అతనిపై ఆవు దొంగతనం కేసుపెట్టి అరెస్టు చేయించారు. ఆవు బాధతో అరచింది. దాన్ని జప్తుచేశారు కాని తీసుకెళ్లలేక పోయారు. వచ్చిన 20 మందిని కొమ్ములతో పొడిచి తరిమింది. ప్రభుత్వ సిబ్బంది దాన్ని పట్టి మహల్ రాయ్‌భాగ్‌లో కట్టేశారు. 8 రోజులు తిండి మానేసి అలాగే నిలబడింది- అది చూసిన మెజిస్ట్రేట్ దయతో దానిని పాటిల్‌కి స్వాధీనం చెయ్యమని చెప్పేరు. పాటిల్ దానిని ఒక గ్రామంలో కొన్నానని చెప్పేడు. పోలీసులు ఆవును ఆ గ్రామానికి తీసుకెళ్లారు. అది తిన్నగా పాటిల్ ఇంటికెళ్లింది. నిజమే గెలిచింది- ఆవు 4 కోడెదూడలను, పెయ్య దూడలను ఈనింది. మరణించేవరకూ 3 సేర్ల పాలను రెండు పూటలా ఇచ్చింది. అది మరణించాక పాటిల్ దాని జ్ఞాపకార్థం ఒక సమాధి మందిరం కట్టించాడు. వంశపారంపర్యంగా ఎవ్వరూ దాని సంతానాన్ని అమ్మకూడదని నిబంధన పాటించారు. దాని సంతానం బాగా విస్తరించింది. గోభక్తి ఫలం అందరికీ లభించింది-



**గోస్మారక మందిరం :**

సతార్ జిల్లాలోని సిరంబా గ్రామంలో గోవింద్‌దాస్ అనే గొప్పధేను భక్తుడుండేవాడు. అతని మఠంలో అతను కూర్చునే చోటు తప్ప మిగిలిన ప్రదేశం అంతా ఆవులతో, దూడలతో నిండి ఉండేది - వారు గోసేవ చేసేవారు. -అలా ఒక రోజు కొన్ని ఆవులు తప్పిపోతే, తహసీల్‌దారు కచ్చేరీలో ఫిర్యాదు చేశారు-పోలీసులు వాటిని వెదకి కసాయి వాళ్లదగ్గర పట్టుకున్నారు. వారు మావేనన్నారు. దాస్‌గారి నడిగితే ఆవులే నాకు సాక్ష్యం అన్నారు. వాటిని కొన్న రసీదు కాగితం చూపుమన్నారు. అతని దగ్గర ఏమీ లేవు. గోమాతను నేను పిలుస్తాను. అవి ప్రేమతో వస్తే మీరు అంగీకరించాలి అన్నారు. దాస్-ప్రతిపక్షంలోని వారు అందరూ అంగీకరించారు. గంగా, గోదావరి, యమున, కృష్ణ, సావిత్రి రండి! రండి! అని పిలిచారు దాస్. ఆవులు ఆయన దగ్గరకు వచ్చి ఆయన శరీరాన్ని నాకడం మొదలుపెట్టాయి. ఆ దృశ్యం చూచి అందరూ ఆశ్చర్యపోయారు. దాస్‌గారు వాటిని తీసుకుని మఠానికి వెళ్లిపోయారు.

ఆనాటినుంచి ఆయనకు బాధ ఎక్కువైంది. ఆవులను కసాయివారు చంపుతున్నారనీ, తానేమీ చేయలేకపోతున్నాననీ- భగవంతుడా ! నువ్వేకాపాడాలి - గో సేవకులారా, గోపాలకృష్ణా అంటూ నేలపై పడిపోయాడు. ఆవులు ఆయన దగ్గరకు వచ్చేశాయి. ప్రజలు భయాందోళనలతో పరుగెత్తుకొచ్చారు. ఆవులు ఆయన్ని నాకడం మొదలుపెట్టాయి. ఆయన దృష్టి వాటి మీదనే పెట్టుకొని ధ్యానంచేస్తూ ఈ లోకాన్నే విడిచిపెట్టాడు. సిరంబాగ్రామంలో ఆయన స్మారక మందిరం నిర్మించారు. దానితో గోవిందదాస్ గారి పేరు ప్రఖ్యాతులు దశదిశలా విస్తరించాయి.

## పాలిచ్చే ఆవుని గుర్తు పట్టడం ఎలా?

ఆవును ఎలా ఎంపిక చేసికోవాలి ? బాగా ఆలోచించి కొనాలి- గోపాలురు పరీక్షించి కొంటారు. బాగా పాలిచ్చే ఆవును గుర్తుపట్టాలి. పశువులకు పశుశాస్త్రవేత్తలు చాలా అవసరం. ఆవును కొనేటప్పుడు :

i) ఆవును ప్రక్కనుంచి చూడడం. ఆకారాన్ని గమనించడం. భుజాల నుండి తోకవరకూ బాగా పొడవుండాలి- వీపువంగి ఉండకూడదు. వెన్నెముక పైకి వచ్చినట్లుంటే, దాని వెన్నెముకలు విడివిడిగా కనిపించాలి-

ii) పొట్ట విశాలంగా ఉంటే బాగా తినగలదు. అంటే బాగా పాలిస్తుంది- తక్కువ తిని ఎక్కువగా పాలిచ్చే ఆవు ఇంతవరకూ సృష్టింపబడలేదు.

iii) ప్రక్కటెముకలు విశాలంగా ఉంటే గడ్డి, నీరు ఎక్కువగా తిని, తాగగలదు. పాలిచ్చే ఆవు శరీరం మీద మాంసం ఎక్కువగా ఉండదు. ఆ తిన్నది పాలుగా మారుతుంది కనుక. గర్భం ధరించినప్పుడు బాగా తింటే తప్పక బలిష్ఠంగా కనిపిస్తుంది. శరీరం మీద చేత్తో నిమిరి పరీక్షించాలి- నున్నగా ఉంటే మరీమంచిది-

IV) ముట్టుకుంటే, అది మొద్దుగా ఉన్నట్లయితే, దానికి రక్తప్రసరణ సరిగ్గాలేదని తెలుసుకోవాలి. శరీరంపై రోమాలు దిట్టంగా ఉంటే ఆరోగ్యం సరిగా లేదని తెలుసుకోవాలి. దాని వెనుక భాగం, జననాంగాలు చూస్తే, పిండం యొక్క పోషణ తెలుస్తుంది. స్తనాల వెనుకభాగం, చనుమొనలు వెనుక నుండి కన్పిస్తాయి- రెండుకాళ్ల మధ్య దూరం ఎక్కువుండాలి. ఆవు పొట్టమీద పాలిచ్చేనాడి ఉంటుంది. పొదుగుకు పంపే రక్తనాళం ఎంత పొడుగ్గా ఉంటే అంతమంచిది- పాలఉత్పత్తి బాగుంటుంది. దీనినే రక్తనాళాలకు సంబంధించిన సిరి అంటారు. పొట్టకింద ఎంతస్పష్టంగా కనిపిస్తుందో, స్తనాలమీద రక్తనాళాలు ఎంతస్పష్టంగా ఉంటాయో దాన్నిబట్టి తెలుస్తుంది ఆ ఆవుపాలు బాగా ఇస్తుందని. ముందువెనుక స్తనాలు పొట్టకు తగ్గట్టుగా ఉండాలి- నాలుగు



చనుమొనలు సమానమైన దూరంలో ఉండాలి- చనుమొనలు సన్నగా ఉంటే పాలు తక్కువగా ఇస్తాయి. చేతికి దొరికేలా ఉండాలి. ఇతర లక్షణాలతోపోలిస్తే, చనుమొనలు బాగుండాలి- ఆవు ముందువైపునుండి పరీక్షించాలి. నాసికలు, దవడలు వెడల్పుగా ఉండాలి. కళ్లు నీళ్లతో నిండినట్లుండాలి- దాని ముఖం చూస్తే సాధువా? కాదా? తెలుస్తుంది- దంతాలుచూస్తే దాని వయస్సు కనుక్కో గలం. ఆవు క్రిందిదవడలో 8పళ్లు, రెండు సంవత్సరాల తర్వాత మధ్యలోని రెండు పాలదంతాలుపోయి రెండు పెద్దదంతాలు స్థిరమైనవి వస్తాయి. 5 వ సంవత్సరంలో 8 శాశ్వతదంతాలు వస్తాయి. 6వ సం॥ తర్వాత ఆవు మేసేటప్పుడు దంతాలుకూడా అరుగుతూ ఉంటాయి. పైపళ్లు, దంతాలు ఉండవు. క్రింది పళ్లతోనే నమలుతుంది. వెనుక రెండు దవడల అంచుల్లో గట్టిచిగురుతో నమిలి మ్రింగుతుంది. చెవుల్లో పసుపురంగు ఉంటే పాలిచ్చే ఆవు అని, వెన్నశాతం ఎక్కువని తెలుస్తుంది. గంగడోలు పలుచగా ఉండాలి. దానితో గాలిపీల్చుకునేటట్లుంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. పొట్ట వైశాల్యం కనిపిస్తుంది. కాళ్లకు మధ్య దూరం ఉంటే బాగుంటుంది. వెనుకవైపు నుండి చూస్తే వీపుమీద నుండి క్రిందకు చూస్తే, పృష్ఠం కనిపిస్తుంది. ఇది ఒకేసారి వాలినట్లుండకూడదు. పాలిచ్చేఆవును కొనాలంటే, వరుసగా 3,4 సార్లు పితికి చూస్తే మంచిది. పాలు పితికేటప్పుడు పాత్రలో పాలధార శబ్దంవింటే దాని ద్వారా పాలు ఎన్ని ఇస్తుందో తెలుస్తుంది. ఫాలధారపడే సమయంలో పెద్దశబ్దం వస్తుంది. పాలు తక్కువయితే ధార సన్నగా ఉంటుంది. పాశ్చాత్యపద్ధతి వేరు. వీపుమీద నుండి చూస్తే శరీరం వెనుకవరకూ వెడల్పుగా ఉంటే అది మంచి లక్షణం. పొట్ట, జీర్ణాశయం చూచి అభివృద్ధి చెందిందని తెలుసుకోవాలి. బాగా తిని, అరిగించుకుని, పాలు బాగా ఇస్తుంది. ప్రక్కనుండి చూస్తే, మెడనుండి తోకదాకా పైకి లేచినట్లుంటుంది. గంగడోలు నుంచి పొదుగుదాకా ఉన్నభాగం కిందకు దిగుతున్నట్లుగా ఉండాలి. ఇలాంటి ఆవు పొదుగు పెద్దదిగా ఉంటుంది. ఇదే విధంగా గర్భాశయంలో పిండం పెరుగుదలకు స్థలం ఉంటుంది. దీనివల్ల పుట్టేదూడ బలంగా ఉంటుంది. ముందునుండి చూస్తే

రెండువైపులా ఆవుశరీరం పైనుండి క్రిందిదాకా వెడల్పుగా కనిపించాలి. దీని వల్ల ఆవు ఊపిరితిత్తులు, గుండె అభివృద్ధి చెందిందిగా, బలంగా ఉన్నట్లు గుర్తించాలి.

## ఆవు-పాలు ఎక్కువగా ఇవ్వాలంటే?

1 ప్రతీరోజూ పచ్చిగడ్డి బాగా తినిపించాలి. 2) పాలు పిండి దానిచే త్రాగించాలి. 3) బెల్లం ఒక భాగం జొన్నలు మూడుభాగాలు కలిపి వండించి పెట్టాలి. 4) గోబీ ఆకులు తినిపించాలి. 5) ప్రత్తిగింజలు, ఆకులు తినిపించాలి. 6) ప్రొద్దుతిరుగుడు పూలు, గడ్డి, బెల్లం ఉడికించి పెట్టాలి. 7) తౌడు, చిట్టు పెట్టాలి. 8) కేసరిపప్పు, గోధుమలు ఉడికించి పెట్టాలి. 9) నెయ్యి, మైదా, బెల్లం కలిపిపెట్టాలి.10) అరటిపండ్లు, బియ్యం పెట్టవచ్చు.

కాన్పుఅయిన 3 వ రోజున మినుపనూకలు పెట్టాలి. ఉప్పు 50 గ్రా, పసుపు 25 గ్రా, రాగులు 50గ్రా కలిపి ఉడికించి దానిలో 1/4 కె.జి. బెల్లంవేసి ఉడికించి తినిపించాలి. అప్పుడే పాలు బాగా ఇస్తుంది. జీలకర్ర 10 భాగాలు, ఉప్పు 10 భాగాలు, సోంపు, తెల్లచందనం, పొటాషియం నైట్రేట్ పౌడర్ రెండు పూటలా గ్రాసంతో కలిపిపెట్టాలి. వెదురుఆకులు 25గ్రా॥ ఉడికించి వాము, బెల్లం కలిపి తినిపిస్తే పాలు బాగా ఇస్తుంది. కాన్పు అయిన తర్వాత పొదుగు గట్టిగా ఉంటుంది. దాన్ని కొంచెం మెత్తగిలేటట్లు చెయ్యాలి.

## ఒంగోలు జాతి ఆవులు :

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లాలో 'జెబు' జాతికి చెందిన ఒంగోలు ఆవులు,గిత్తలు ఎక్కువగా ఉండేవి. జాతీయ, అంతర్జాతీయంగా వీటి సంతతి విస్తరించింది. రోగనిరోధకశక్తి, సంతానసాఫల్యత, ఎక్కువ పాలు ఇవ్వడం వీటి లక్షణం. ఆ ప్రాంతంలో సారవంతమైన నేలలో పి.హెచ్. గుణం ఎక్కువగా ఉండడం వల్ల ఇవి అక్కడ ప్రసిద్ధిచెందాయి. అక్కడ లెగ్యూ జాతి పంటలు పండిస్తారు. నత్రజని, బాక్టరీయా సమృద్ధిగా ఉండడం వల్ల కొన్ని వేల సంవత్సరాలక్రితమే ఈ బలమైన జాతి అక్కడ పుట్టిపెరిగిందని చెప్పొచ్చు.



సింధునాగరికత విలసిల్లిన ప్రాంతంలో ఎత్తయిన మూపురాన్ని కలిగిన పశుజాతి ఉన్నట్లు నిర్ధారించారు. నాటి జాతికీ, నేటి ఒంగోలు జాతికీ పోలికలున్నాయి. దీన్నిబట్టి ఈ జాతి చాల ప్రాచీనకాలం నుంచి ఉండేదని, దక్షిణ ఆసియాలో మచ్చికయి, ఆర్యులద్వారా సింధులోయలోకి, అక్కడి నుంచి ఒంగోలు పరిసరప్రాంతాలకు చేరి 'ఒంగోలు' జాతిగా పేరొందాయి-నెల్లూరుప్రాంతం కాబట్టి 'నెల్లూరు బుల్స్' అనే పేరుకూడా ఉండేది.

19, 20 శతాబ్దాలలో మనదేశం నుంచి బ్రిటన్ ఈ పశువుల్ని దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టింది. వీటిలోని వ్యాధినిరోధకశక్తి కారణంగా స్విట్జర్లాండ్ వీటిని ఇష్టపడేది. మనదేశం నుంచి ఆస్ట్రేలియా, అక్కడ నుంచి ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, మలేషియా, మారిషస్, కంబోడియా శ్రీలంక మొదలగు ఆసియాదేశాలకు వెళ్ళాయి.

ఒంగోలుజాతి దక్షిణ అమెరికాలో, ఇతర భారతీయ సంతతితో సంకరం చేసి 'బ్రహ్మీన్' అనే కొత్త జాతిని రూపొందించారు. 1973 నాటికి ఒక లక్ష పశువులను తయారుచేసింది. ఇలా ఉత్పత్తిని పెంచింది. అమెరికా, ఫ్రాన్స్‌తర్వాత జర్మనీ మూడవస్థానంలో ఉంది.

మిగిలిన దేశాలకన్నా బ్రెజిల్ ఎక్కువ ఉత్పత్తి చేస్తోంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దీనివల్లనే పెరిగింది. మొట్టమొదటగా 1868లో ఇంగ్లాండు నుంచి ఓడ ద్వారా రెండు ఎద్దులు బ్రెజిల్ వెళ్లాయి. తద్వారా సంతానోత్పత్తిని పెంచింది. ఆరడుగుల ఎత్తు, ఉన్నతమైన మూపురం, అందమైన చురుకైనకళ్లు, వాటికి మించినశక్తి, పట్టుదల ఇలాంటివెన్నో ఉత్తమ లక్షణాలు ఈ జాతికి ఉన్నాయి. వీటి చర్మంపైనున్న వెంట్రుకలు అతినీలలోహిత కిరణాలను లోపలికి ప్రసరించనీయకుండానూ, కీటకాలు రక్తాన్ని పీల్చకుండాను ఉంచుతాయి. ఒంగోలు పశువులు ఆహారాన్ని తక్కువగా, ఎక్కువసార్లు తింటాయి. వీటికి సంతానసాఫల్యం ఎక్కువ-మాతృప్రేమచే దూడల్ని ఎక్కువగా నాకడం, వాటిని శత్రువుల బారినుండి కాపాడటం చేస్తాయి. ఎత్తుగా బలంగా ఉండి ట్రాక్టర్లు అక్కర్లేకుండా పొలంలో కష్టించి పనిచేయగలవు. రోజుకి ఆరేడు ఎకరాల

పాలాన్ని సునాయాసంగా దున్నగలవు. ఒంగోలు ఎద్దులాగ ఉండే 'నందీశ్వరుడు' మనకు తెలిసిందే.

అలాంటి ఒంగోలు జాతి ఆవులు, ఎడ్లు నేడు తగ్గిపోయాయి. తిరిగీ వాటిని పెంపొందించాలని, ఆచార్య ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయం నెట్‌వర్క్ ప్రాజెక్టు ద్వారా కృషిచేస్తోంది. భారతీయ వ్యవసాయ పరిశోధనాసంస్థ, పశుసంవర్ధకశాఖల సహకారాన్ని తీసుకుంటోంది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. శాస్త్రజ్ఞులు, పశుపోషకులు, ప్రభుత్వాధికారులు సహకరిస్తే తిరిగి ఒంగోలుజాతి పశువులు మళ్లీ మనకు పూర్వవైభవాన్ని తెస్తాయి.

"కల్పవృక్షం అన్నా, కామధేనువన్నా, చింతామణి అన్నా నాశరహితుడు, అనంతుడు అయినవాడు శ్రీకృష్ణుడే " అందుకే ఆవును స్మరిస్తే, శ్రీహరిని స్మరించినట్లే.

**గోవ్రతకథ :**

పాండురాజు భార్య, పాండవుల తల్లి అయిన కుంతీదేవి, తన మేనల్లుడు శ్రీకృష్ణునితో 'శ్రీకృష్ణా! స్త్రీలు ఋతుకాలమున ఇంటిలోని వారిని, వస్తువులను తాకుట, వస్త్రములను సూదితో కుట్టుట, పెద్దలను నిందించుట, పరులద్రవ్యాన్ని అపహరించుట మొదలగు పనులను తెలిసిగాని తెలియకగాని చేస్తూంటారు. అట్టి దోషముల వల్ల కలిగిన పాపములు పోయి, పుణ్యములు కలుగుటకు ఏదైనా ఉపాయం ఉన్నచో తెలియ జేయుమని అడిగింది. అప్పుడు శ్రీకృష్ణుడు 'అమ్మా!' గోవ్రతము, గోమయము, గోమూత్రము, గోపద్మములను 4 భాగములు గల వ్రత మొకటిగలదు- దానికి కామధేనువు, యమరుద్రులు, విష్ణువు వరుసగా అధిదేవతలు. మానవు లీ వ్రతమును చేసినచో పాపవిముక్తులై, పుణ్యఫలం పొందుదురు. జపతపములు, ఉపవాసములు మొదలగువాటిని చేయుటవల్ల పుణ్యప్రాప్తి కలుగును, అని చెప్పెను. ఆ వ్రతవిధానమును దానిని ఆచరించుటకు పాటించవలసిన నియమములను గురించి అడుగగా శ్రీకృష్ణుడు ఇట్లన్నాడు.



సూర్యుడు మకరములో ప్రవేశించునప్పుడు గాని, రథసప్తమి రోజున గాని, తన నక్షత్రమునగాని, అనుకూలమైనప్పుడు ఈ వ్రతమును చేయవలెను. రజోదోషము వీడిన స్త్రీలు, 18 నెలల తర్వాత ఈ వ్రతమును ఆచరింపవలెను. మంచి పురోహితుని సహాయంతో ఈ వ్రతం చేయుటమంచిది. ఈ వ్రతమునకు ముందురోజున నది, చెరువు, ఏరు లేక ఏదైనా బావినీటితో స్నానం చేయవలెను. తమ నిత్యపూజ పూర్తి చేసుకోవలెను. ఇంటికి తూర్పు భాగమున మండపము నిర్మించవలెను. ఐదు రంగులతో స్వస్తిక,పద్మక, నాగబంధాది మండపములు చేసి లక్ష్మీనారాయణుల ప్రతిమలను, ఆవు, దూడ ప్రతిమలను బంగారు/వెండి/రాగితో యథాశక్తి చేయించి వాటిని పంచామృతములతో అభిషేకించవలెను. ఆ ప్రతిమను బియ్యపురాశిపై నుంచవలెను.

పంచపల్లవములతో, పంచ వల్కలములతో కలశములను ఐదింటిని అలంకరించి వాటిని నూతన వస్త్రములతో (చాపు) చుట్టి పూజింపవలెను. తర్వాత దూడతో కూడిన పాలిచ్చు ఆవును పూజచేయవలెను. పుణ్యశ్రవణముతో రాత్రిజాగరణ చేయవలెను. తర్వాత తమ సంప్రదాయము ననుసరించి అగ్నిప్రతిష్ఠ చేయవలెను. సమిధలు, పాయసమును హవిస్సుగా చేసి 'ఆగావో' మంత్రముతో హోమం చేయవలెను. పూర్ణాహుతి నిచ్చిన తర్వాత ఆచార్యునికి ఆ ప్రతిమను వస్త్రములతో దానమిచ్చి, దక్షిణ, తాంబూలమును సమర్పించవలెను.

గోదానము, శక్తి యున్నచో మిగిలిన దశ, షోడశదానములను చేసి పన్నెండుమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టవలెను. ఈ వ్రతం చేసినవారికి అన్ని వేదములు చదివిన ఫలితము, అన్ని తీర్థములందు స్నానముచేసిన ఫలితము కలుగును. అన్నియజ్ఞములు ఆచరించిన కలుగుసద్గతిని పొందుదురు.' అని శ్రీకృష్ణుడు కుంతీదేవికి చెప్పెను.

స్త్రీలకు పతిభక్తి , పతిసేవ కల్గించినంత పుణ్యము మరి ఏ ఇతర వ్రతములవల్ల కలుగదు- పతిభక్తి, పతిసేవయుకలిగిన స్త్రీ తనతోపాటు

భర్తకును ఇహపరములందు సద్గతి కలిగించును. అట్లుచేయని స్త్రీ దుర్గతి పొందును- భర్తృహీనయగు స్త్రీ గంగాస్నానము, శ్రీహరిపూజ, ఏకాదశినాడు ఉపవాసము, పెద్దలసేవ మున్నగువానిని ఆచరించి తరించును. దోషపరిహారమునకై గోవ్రతము నాచరించినవారికి, ఈ జన్మలోనూ, మరుజన్మలోనూ మాంగల్యవృద్ధి కలుగును. భర్త లేనివారు ఈ వ్రతము నాచరించిన ఇహలోకమున సుఖశాంతులు, సద్గతి, మరుజన్మలో సువాసినీత్వము పొందుదురు- ఈ వ్రతమహిమ అంతులేనిది- అని శ్రీకృష్ణుడు చెప్పెను-

ఈ వ్రతమునకు ఉద్యాపనమును వ్రతము మొదటగాని, వ్రతము మధ్యలోగాని, వ్రతానంతరమునగాని చేయవలెను.

మకరసంక్రాంతి, రథసప్తమి లేక మంగళవారంతో కూడిన కృష్ణ చతుర్దశి, కార్తీకము, మార్గశిరము ఈ మాసములందు వ్రతమాచరించువారు తమ కనుకూలమయిన దినమున ఉద్యాపనము నుద్దేశించి చేయవలెను.

**గోమయవ్రత కథ :**

లోకకళ్యాణం కోసం, ముల్లోకాలూ సందర్శిస్తూ నారదమహర్షి బ్రహ్మలోకమునకు వెళ్లాడు. అతడు బ్రహ్మకు నమస్కరించి 'తండ్రీ! కలియుగమున పాపములు పెరిగిపోతున్నాయి. స్త్రీలు తెలిసీ తెలియక చాలా పాపములు చేస్తున్నారు. అందుచేతనే చాలాబాధలు పడుచున్నారు. వారు అట్టి కష్టములు పడకుండా, పుణ్యకార్యములు చేసే మార్గం ఏదయినా చెప్పమని అడిగాడు. బ్రహ్మ దానికొక మార్గం చెప్పాడు. 'నాయనా! పూర్వం ఒకప్పుడు పార్వతీ పరమేశ్వరులు కొలువులో ఉండగా పార్వతి 'నాథా! కలియుగమున పాపములతో బాధపడే ప్రజలకు ఒక ఉపయోగకరమైన వ్రతము చెప్పమని శివుణ్ణి అడిగింది - "పార్వతీ! స్త్రీలు జ్ఞాతాజ్ఞాత దోషముల వల్ల పాపములు ఎక్కువ చేయుచున్నందున వారికి తరణోపాయంగా ఒకవ్రతం చెబుతాను- దాని పేరు గోమయవ్రతం. రజోదోషమువల్లనూ, తెలిసీ తెలియక చేసిన సర్వపాపములను పరిహరించుటకు పవిత్రమైన గోవుకు సంబంధించిన గోమయవ్రతము,



గోమూత్రవ్రతము కలవు. దీనికి లక్ష్మీనారాయణుడు ప్రధాన పాత్రధారి- కామధేనువు క్షీరసాగరమథనంలో ఉత్పన్నమైంది. కామధేనువు సంతానమైన గోవు మనకు పనికిరాని గడ్డితిని, మనకు పనికివచ్చే అమృత సమానమైన పాలు ఇస్తుంది. పంచగవ్యాలు దానివల్ల లభ్యమౌతాయి. పాలు, పెరుగు, నెయ్యి కాకుండా గోమయము, గోమూత్రము కూడా పవిత్రమైనవి. నా వాహనమగు నందియు వృషభమేకదా! గోమాతలో సర్వతీర్థములు, సమస్త దేవతలు ఉన్నారు. ఉసిరికాయంత గోమయము ఒక్కసారితింటే ఈ జన్మలో చేసిన పాపములు పటాపంచలవుతాయి - రెండవమారు భుజిస్తే పుత్ర పౌత్రులను, సౌభాగ్యమును కలిగిస్తాయి. మూడవసారి భుజిస్తే వైకుంఠములోని విష్ణువును చేరడం నిశ్చయం.

రథసప్తమినాడు, పశుశాలయందుగాని, దేవాలయమునందుగాని గోపూజను, శ్రీవిష్ణుపూజను చేసి గోమయభక్షణ చేస్తే ఈ వ్రతం యొక్క ఫలితం పూర్తిగా లభిస్తుంది. ఈ వ్రతం ఒక సంవత్సరంలో చేసి ఉద్యాపనం చెయ్యాలి. అది ఎలాగంటే: గోమయంతో ఇల్లు అలికి, ముగ్గులు పెట్టాలి. ఇంటికి ఈశాన్య భాగంలో బంగారంతోగాని, వెండితోగాని, యథాశక్తిమండపము నేర్పరచి పాలవెల్లిని అమర్చి 32 లేదా 16 కలశములను నూతన వస్త్రములతో నలంకరించవలెను. బంగారుతోగాని, వెండితోగాని చేసిన గోవును, దూడను, విష్ణుమూర్తి ప్రతిమను ఉంచి పూజించాలి. బంగారుకొమ్ములు, వెండిగిట్టలు గల గోవును, విష్ణువుయొక్క ప్రతిమలను మండపంతో సహా బ్రాహ్మణునికి దానం ఇవ్వాలి. దంపతి పూజ చేసి వారిని సత్కరించాలి. సమారాధన తర్వాత బంధువులతో కూడి భుజించాలి. ఈ వ్రతమును అనసూయ మొదలగువారు ఆచరించి తరించారు" అని బ్రహ్మ నారదునకు చెప్పాడు. భవిష్యత్పురాణంలో బ్రహ్మ నారద సంవాదమున గోమయవ్రతకథ ఉంది.

**గోమాహాత్మ్యం :**

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. ఆవు కల్పవృక్షంలాగా మనలను ఆదుకుని పాలు, పెరుగు, వెన్నలతో మనలను పోషించి, మన

కోర్కెలను తీర్చి మనలను కాపాడుతుంది. కనుక అది మనకు ప్రత్యక్షదైవం. 'మాతా రుద్రాణాం దుహితా వసూనాం స్వసాదిత్యానాం అమృతస్యనాభిః' అని ప్రశంసించారు.

**కీర్తనం శ్రవణం దానం దర్శనం చాపి పార్థివ!**
**గవార్థే ప్రశస్యతే వీర సర్వపాప హరం శివమ్ ॥**

గోవును చూడటం, తాకటం, గోవును గురించి వినటం, గోవును పొగడటం, గోప్రదక్షిణం చేయటం, దానంచేయటం వలన సర్వపాపాలు నశిస్తాయి. కావున గోవును ప్రార్థించాలి.

విరాటరాజు కొలువులో సహదేవుడు పశువుల సంరక్షకుడై పశువైద్య శాస్త్రాన్ని రచించాడు.

క్షీరసాగరమథనంలో శ్రీమహాలక్ష్మితో పాటు, గోమహాలక్ష్మి మనకు లభించిన పుత్రిక - మేరుపర్వతము గోపాలుడై, భూమిని గోవుగను, హిమాలయ మును దూడగను చేసి - రత్నములను, మూలికలుగల పాలుగా పిండెనని పురాణాల్లో చెప్పబడింది. దశరథుడు, అంబరీషుడు మొదలగువారు లెక్కలేనన్ని గోవులను దానమిచ్చినట్లు పురాణేతిహాసాలు చెబుతున్నాయి.

గోవులు, బ్రాహ్మణులు, వేదములు, పతివ్రతలు, నిజము చెప్పువారు, లోభములేనివారు, దానము చేయువారు - ఈ ఏడుగురు భూమిని భరిస్తున్నారు; ధరిస్తున్నారు.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః।**
**పార్థో వత్సః సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥** అన్నది గీతావాక్యం.
**"గో బ్రాహ్మణేభ్యః శుభం భవతు -**
**లోకా స్సమస్తా స్సుఖినో భవంతు".**

గోపాష్టమి - కార్తిక శుద్ధఅష్టమి
గోత్రిరాత్రము - కార్తిక బహుళ త్రయోదశి, చతుర్దశి, అమావాస్య
గోద్వాదశి - ప్రతి శుక్లపక్ష ద్వాదశి (వ్రతం చేయదగినది)



**గోద్వాదశీ వ్రతం :**

ఈ వ్రతం శుక్లపక్ష ద్వాదశి నాడు చెయ్యాలి- గోమతి అనే ఇల్లాలు, భర్తయైన కౌండిన్యుని అనుమతితో ద్వాదశీవ్రతాన్ని సంకల్పించింది. ప్రాతః కాలముననే లేచి, కాలకృత్యాలను తీర్చుకుని స్నానం చేసి, సంకల్పం చెప్పుకుని, గోమయంతో అలికి రంగురంగుల ముగ్గులు పెట్టి, పువ్వులతో బియ్యంపై మండపాన్ని ఏర్పరచి కలశం పెట్టి, బంగారు/ వెండి/రాగి కేశవ పార్వతీ ప్రతిమల నుంచి, 12 విష్ణు ప్రతిమలను, గరుత్మంతుని ప్రతిమను అలంకరించింది. ఆ విగ్రహాలకు షోడశోపచారపూజ చేసింది. ఆవునేతిదీపం పెట్టి శ్రీకృష్ణుని ఆరాధించి, కపిల గోవును దూడతో కూడ అన్ని మంగళ ద్రవ్యములతో పూజించి, ఆ రాత్రి బంధువులతో దీపం దగ్గర జాగరణ చేసింది - ఆ రాత్రిసమయంలో వెలిగేదీపం ప్రమిదలోని ఆవు నెయ్యి సువాసనకు ఒక ఎలుక అక్కడకువచ్చి ఆకలి తీర్చుకోవాలని ప్రమిదను సమీపించగా, అక్కడివారు దాన్ని తరిమి కొట్టారు. అందువల్ల అది దూరంగా వెళ్లి మళ్లీ మళ్లీ ఆ దీపంవైపే చూస్తూ రాత్రంతా జాగరణ చేసింది. అటు భక్తులు ఇటు ఎలుక జాగరణం చేయడం జరిగింది. అంతలో తెల్లవారడం, సూర్యరశ్మి తమ శరీరం మీద పడగానే ఎలుక ఒక అందమైన స్త్రీగా మారిపోయింది. ఆమె గోమతికి నమస్కరించి 'కృతజ్ఞురాలినమ్మా గోమతీ! పూర్వ జన్మలో నేను వేశ్యను. నా భర్త కళ్ళుకప్పి నేను వ్యభిచరించాను. ఆ పాప ఫలితంగా నేను నరకానికివెళ్లి, నానాబాధలు పడి యమపాశాలనుండి విముక్తి చెందలేక కుక్క, పిల్లి, పంది, కోతి, క్రిమి కీటకాలుగా అనేక జన్మలనెత్తి ఈ జన్మలో మీ ఇంటి ఎలుకనైపుట్టి, ఈనాటి ద్వాదశీవ్రత ప్రభావంతో ఉపవాసంతో ఉన్న నేను, జాగరణ కూడా చెయ్యడంవల్ల పాపవిముక్తిని పొంది స్వర్గానికి వెళ్లడానికి నోచుకున్నాను. అదిగో విమానం వచ్చింది. నేను వెళ్లొస్తాను" అని చెప్పి వెళ్ళిపోయింది.

మాధవి చెప్పిన మాటలు విని, స్వర్గానికి వెళుతూన్న ఆమెను చూచిన గోమతి, ఆమె బంధువులు ఆశ్చర్యపోయారు. పునఃపూజ చేసి ముత్తయిదు వులను, బ్రాహ్మణులను సత్కరించారు. వారందరూ ఆ వ్రతాన్ని పూర్తిచేసుకుని ఇహలోకసుఖాలను, పరలోకంలో విష్ణుసాన్నిధ్యాన్ని పొందారు. ఈ వ్రతం

చేసినవారికి ఫలితం తప్పక లభిస్తుంది. వ్రతం చేయలేకపోయినా శుద్ధ ద్వాదశినాడు ఆవును (దూడతో) పూజించి, గోమతి కథను చెప్పుకుని అక్షతలు వేసుకుంటే చాలు-అంతవరకూ చేసిన పాపాలుపోయి, స్త్రీలు ఈ వ్రత ఫలితాన్ని పొందుతారు.

**నందీశ్వర వ్రత కథ :**

**తీక్ష్ణశృంగాయ విద్మహే వేదపాదాయ ధీమహి తన్నో నందీ ప్రచోదయాత్।**
**ఓం తత్పురుషాయ విద్మహే చక్రతుండాయ ధీమహి తన్నో నందీ ప్రచోదయాత్॥**

కైలాసములో ఒకనాడు శివుడు పవళించి ఉన్న సమయంలో పార్వతి కాళ్లుఒత్తుచుండగా పార్వతి చేతులు కఠినంగా అనిపించి శివుడు కాళ్ల పట్టవద్దని చెప్పగా ఆమె కారణమడిగింది. పరోపకారము చేయకపోవుటచే నీ చేతులు కఠినంగా ఉన్నవని, అందుచేత నాకు నొప్పి పుట్టిందని చెప్పాడు. మృదు హస్తాలతో మిమ్మల్ని సేవించాలంటే తరణోపాయం తెలుపుమని వేడగా శివుడు ఇలా సెలవిచ్చాడు. నీళ్లాటి రేవునకు వచ్చి పోవు స్త్రీలకు వేడినీళ్లతో తలంటినీళ్లు పోయించుమని చెప్పాడు. భర్త ఆజ్ఞను శిరసావహించి ఆమె అదేవిధంగా చేసింది. ఒక రోజున ఒక పేదరాలు తలంటి నీళ్లు పోయించుకుని వెళుతూండగా ఆమెపై దయదలచి పార్వతి ఆమెకు సంపదనిచ్చింది. ఆ పేదరాలు ధనవంతు రాలై గర్వముతో తన గుమ్మము లోనికి వచ్చిన వారందరికీ పనులు జెప్పుతూ, కష్టం కలిగిస్తూ ఉండేది.

ఆ సంగతి పార్వతి కనిపెట్టి, ఆమె గర్వాన్ని అణచి, ఆమె భాగ్యమును తీసివేయుటకు గణపతిని పంపింది. అతనికి ఆమె ఉండ్రాళ్లు నైవేద్యం పెట్టి తృప్తిపరచగా అతడానందముతో మరికొంత సంపద నిచ్చాడు. నందిని పంపగా అతనికి సెనగలు వాయన మిచ్చి అతని మెప్పు పొందింది. భైరవుని పంపగా గారెలు వండిపెట్టి అతణ్ణి తృప్తిపరచింది. చంద్రుని పంపగా అతడు ఆమె పెట్టిన చలిమిడి తిని మరికొంత ఐశ్వర్యాన్ని ఇచ్చాడు. సూర్యుని పంపగా అతడు క్షీరాన్నాన్ని ఆరగించి ఆమె భాగ్యమును హరించలేకపోయాడు.



అర్జునుని పంపగా అప్పాలు నైవేద్యం పెట్టి సంతోషపరచి పంపింది - శివుని పంపగా అతడు చిమ్మిరి తిని భాగ్యమును హరించలేక వచ్చేశాడు. చివరిగా పార్వతి వెళ్లగా పులగం నైవేద్యం పెట్టగా ఆమె భక్తికి మెచ్చి "నీవు మాకందరకూ పెట్టిన తొమ్మిది పదార్థములను ఉద్యాపనము చేసుకున్న యెడల మానవులకు సకల సంపదలు కలుగునని చెప్పి వెడలిపోయింది. ఈ కథ చెప్పుకుని అక్షతలు వేసుకొనవలెను.

**ఉద్యాపనము :** బిందెతో ఐదు మానికలు అత్తెసరు చేసి, దానికి ఐదుమూరల అంగవస్త్రమును జుట్టి బంగారు నందికి నైవేద్యంగా పెట్టి బంధువులకు వడ్డించ వలెను.

ఈ వ్రత కథలు చదివిన పతివ్రతలు అత్యధిక పుణ్యవతులగుదురు; శాశ్వతంగా సద్గతులు పొందుదురు.

**"నమో బ్రహ్మణ్యదేవాయ గో బ్రాహ్మణ హితాయ చ ।**
**జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః ॥"**

బ్రహ్మజ్ఞానం కలవాడు, గో బ్రాహ్మణులకు హితము చేయువాడు అలాగే జగత్కళ్యాణకారకుడు అయిన గోవిందునికి (కృష్ణునికి) నమస్కారము.

నృగమహారాజు పర్వతుడనే బ్రాహ్మణునికి గోదానం చేశాడు. ఆ గోవునే మరల 'అనారతుడనే బ్రాహ్మణునకు దానం చేశాడు. ఆ గోవు గురించి అనారతునకు, పర్వతుడికీ మధ్య వివాదం జరిగింది. ఇద్దరూ కలసి రాజు దగ్గరకువెళ్లారు. రాజు వారి ఎదుటకు రావడానికి భయపడిరాలేదు- ఆ ఇద్దరు బ్రాహ్మణులు "రాజును ఊసరవెల్లివి' కమ్మని శపిస్తారు. ఆ రాజు ఊసరవిల్లి అవుతాడు. (శివ పురాణం)

**వందే గోమాతరం :**

గోమాతా! మా కులమాతా!
అమ్మవంటి అమ్మవు నువ్వు-కాపాడమ్మా మమ్ము

సకల సంపదలనిచ్చు కామధేనువు నువ్వే నమ్మా
సకల రోగనివారిణి - నువ్వే నమ్మా
అన్ని ధర్మములకు మూలము నువ్వే
ఈశ్వరుడు ప్రసాదించిన వరం నువ్వే.

॥గోమాతా॥

దేవతలకు ప్రియం పంచగవ్యాలు.
దేవతలకు క్షీరం సమర్పయామి
దేవతలకు ఘృతం సమర్పయామి
యజ్ఞంలేదు నీవులేకుంటే
నీ సంతతిలేకుంటే పాడిపంటలే లేవు.
ఇహం పరం ఉంది నీదానంలో

॥గోమాతా॥

## 'గో' విలాపం :

వినండి ... వినండి... చిన్నారులారా!
తెలుసుకొనండి ... ఈ దీనురాలి కథ.

గోమాతను నేను - కమ్మని పాలిస్తాను
నోరులేని జంతువును - కల్లా కపటం ఎరుగను
నాకు ఎండుగడ్డి వేసినా - కమ్మని పాలతో మీ కడుపు నింపుతాను
నా దూడల్ని కాదని - మీ కోసం త్యాగం చేస్తున్నాను.

॥వినరా॥

నా బిడ్డలు భూమి దుక్కిదున్ని పెడతారు
నా ఎరువుతో పైరు పంటలు పండిస్తున్నారు
నా చర్మమే మీకాలికి చెప్పులుగా మారాయి
నా శరీరమే ఢంకాలుగా నాదం చేస్తున్నాయి

॥వినరా॥



నా వయస్సు ముదిరితే-కసాయి వాడికి అమ్మేస్తారు
ఇదేమిన్యాయం చెప్పండి-గోహత్యకు ప్రాయశ్చిత్తం లేదండి!
మీరే భావిభారతపౌరులు - మా మొరవిని మీరే కాపాడాలి
కామధేనువును కాపాడండి - ధనధాన్యాలతో తులతూగండి

॥వినరా॥

## విశ్వగోసమ్మేళనం - గోసంస్కృతి :

కర్ణాటక రాష్ట్రం షియోగాజిల్లా హోస్‌నగర్‌లోని హనియాగ్రామానికి చెందిన జగద్గురు శంకరాచార్యులు శ్రీశ్రీశ్రీ రాఘవేశ్వర భారతీస్వాములవారి శ్రీరామచంద్రపుర మఠం ఆశ్రమంలో ఎందరో మహానుభావుల సమక్షంలో వారంరోజులపాటు విశ్వగోసమ్మేళనం జరిగింది.

అందులో దేశంనలుమూలలనుండి, విదేశాలనుండి లక్షలాది గోభక్తులు పాల్గొన్నారు. బారులు తీరి గోకర్ణపీఠాన్ని దర్శించిన భక్తులు హుండీలో కానుకలను సమర్పించారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన లక్షలాది జనానికి ఉచిత భోజనం, ఫలాహారాలు, కషాయాలు, తేనీరు అందజేశారు. సమ్మేళనంలో గోవుకు సంబంధించిన చారిత్రక, ఆర్థిక, వ్యావసాయక, ఔషధీయ మరియు ఆధునిక పరిశోధనాంశములు ఎన్నింటినో చర్చించారు. పంచగవ్య చికిత్స, సేంద్రీయ ఎరువులు, కీటక నివారిణి, గోశాలలు: వాటి సమస్యలు, గోహత్య నిషేధం మొదలగు అనేక విషయములపై అనుభవజ్ఞుల ప్రసంగాలు, సంగోష్ఠులు ఏర్పాటు చేశారు. భారతీయ గోజాతులు వాటి రక్షణ, పశు గో చికిత్స, గోరక్షక చట్టాలు మొదలగు విషయాలపై చర్చజరిపారు.

గో సమ్మేళనంలో అంతర్భాగంగా 'భారతీయ గో వంశ రక్షణ సంవర్ధన పరిషత్' ప్రతి సంవత్సరము నిర్వహించే బృహత్ కార్యక్రమం 'గోసంస్కృతి -2007'లో నిర్వహించారు.

ప్రపంచంలోని ఎందరో గో భక్తులు, గోపాలకులు, గోశాల ప్రబంధకులు, నిర్వాహకులు, రైతు సోదరులు సమ్మేళనంలో పాల్గొని దివ్యానుభూతిని

పొంది ఇతోధిక గోసేవాస్ఫూర్తిని అందుకున్నారు. గో తులాభారం ఒకప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

స్వదేశీ గోవులు మాత్రమే వైద్యానికి ఉపయోగపడతాయని, జెర్సీ ఆవుల వల్ల ఎక్కువ పాల ఉత్పత్తి తప్ప మరే ఉపయోగం లేదన్నారు-గో ముఖంలో అక్కడ శివుని ఆలయ నిర్మాణం జరుగుతోంది.

గోమాతపై గీతాలు, పద్యాలు, జానపద గేయాలు మొదలగునవి పాడి, అందులో గోవుల ఘనతను చాటి చెప్పారు.

**గోశాల ద్వారకా తిరుమల** :

ఇచ్చటి గోశాల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం. ద్వారకాతిరుమల వారిచే నిర్వహింపబడుతుంది. ప్రస్తుతం 175 గోసంతతి శ్రీవారి గోశాల యందు పోషింపబడుచున్నది. ధనరూప విరాళాలతో, ఫిక్సెడ్ డిపాజిట్ చేసి, వడ్డీసొమ్ము గోరక్షణ కోసం ఉపయోగిస్తున్నారు. గోవుకు ఆహారం (గడ్డి, తౌడు, పచ్చిగడ్డి వగైరా) ఏ రూపంలోనైనా ఇవ్వవచ్చు.''**Cow is wonderful Laboratory**'' గోసంపదే గ్రామోదయమ్, 'జై పంచగవ్య' అనే పుస్తకాలున్నాయి.

జర్మనీ శాస్త్రవేత్త డా॥ జోసిస్ వేల్పు భారతదేశంలో మూడుమాసాలు గ్రామాల్లో తిరిగి పరిశోధించి ఎన్నో విషయాలు తెలియజేస్తూ 'పల్లెల్లో గోసంతతి ఎప్పుడైతే తగ్గుతుందో అప్పుడు పల్లెప్రజలు పల్లెలు విడిచి పట్నాలకు చేరతారని-వక్కాణించాడు' అదే ఇపుడు జరుగుతోంది- 'గోసంపదయే గ్రామోదయం'.

**లేపాక్షి బసవన్న** : పురాతత్త్వశాఖవారి లెక్కప్రకారం 8.1 మీ॥ పొడవుగల ఈ మహాలింగానికి ఎదురుగా ఉంది నంది శిల్పం. అది భారతదేశంలోనే పెద్దనంది శిల్పం అనవచ్చు తంజావూరులోని బృహదీశ్వరాలయం, చాముండి హిల్స్ (మైసూర్) బసవగుడు (బెంగుళూరు) లలో ఉన్న నంది విగ్రహాల కన్నా ఇదే పెద్దది - ఆరోగ్యంతో వున్న చక్కటి కోడెగిత్త అది - నందిమెడలో రెండు గరుడ



పక్షులు వాటి ముక్కుల్లో వ్రేలాడే ఏనుగులు. గంటలు లోహపు బిళ్లలతో కూడిన పట్టీలు ప్రత్యేకతను సూచిస్తాయి. అది ఆ పక్షులశక్తి, పరిణామాన్ని సూచిస్తుంది. నందికి కుడి, ఎడమ ప్రక్కల నృసింహస్వామిని చెక్కి ఉంది. విగ్రహం కుడిప్రక్క నిలబడిన నంది దృష్టిలోను చూస్తే వీరభద్ర ఆలయంలోని నాగరాజు ఏడుపడగల విగ్రహం కొంత విస్పష్టంగా కనిపించింది.

**సురభి గోశాల** :

గోవులను రక్షించుకోవడానికి సహృదయులయిన కొందరువ్యక్తులు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు గోశాలలను ఏర్పాటు చేశారు. వధ్యశాలలకు తరలిస్తున్న గోమాతలకు రక్షణ కల్పించి, వాటి పోషణ బాధ్యతలను స్వీకరించిన గోశాల 'సురభి' కరీంనగర్‌లోని జగిత్యాల సమీపంలోని 'తాటిపెల్లి'లో ఉంది. దీనిని ఒక స్వచ్ఛంద సంస్థ, దాతల విరాళాలతో నడుపుతోంది. రెండెకరాల స్థలంలో నిర్మించిన షెడ్లల్లో 150 ఆవులకు వసతి కల్పించింది.

జగిత్యాల వాసులు, వారి ప్రవాస బంధువుల సహకారంతో అంచెలంచెలుగా షెడ్ల నిర్మాణం జరుగుతోంది. చెన్నైలోని పశుసంవర్ధకశాఖవారు కొంతవరకు గోవుల వైద్యం విషయంలో ఔషధములను పంపిస్తున్నారు.

ఆవుపేడతో కొంత ఆదాయం లభిస్తుంది. గోమూత్రంతో అర్కయంత్రం ద్వారా ఔషధాలు ఇక్కడ తయారవుతున్నాయి. గోశాల సమీపంలోని 40 ఎకరాల స్థలంలో గోగ్రాసం పండించబడుతోంది. ఓ ప్రవాస భారతీయుని దయతో పైపులైన్లు వేసి నీటి కొరత తీర్చారు. ప్రభుత్వం వారు కూడా ఒక బోరింగ్ పంపుసెట్టును, నీటితొట్టిని ఏర్పాటు చేశారు. గోమయంతో సోపులు, షాంపులు తయారీ, బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడానికి దయామయులైన దాతల నుంచి విరాళాలను అర్థిస్తున్నారు.

డాలర్లకు కక్కుర్తిపడి కొందరు గోవులను ముక్కలు చేసి అమ్ముకొని పరాయి దేశాలకు పంపి, విలాస జీవితాలు గడుపుతున్నారు. మన రాష్ట్రంలోని

మెదక్‌జిల్లాలోని రుద్రారం గ్రామంలో 'అల్‌క బీర్' సంస్థ ఉంది. అరబ్బుల ఆకలి తీర్చడానికి ప్రతి సంవత్సరం లక్షల ఆవులను, పశువులను అక్కడ వధి స్తున్నారు. ఆవుల చర్మం ఒలిచివేయడానికి భరించలేని వేడినీళ్లను సజీవంగా ఉన్న ఆవులపై పోసి చిత్రహింసలుపెట్టి, వాటిని వధించి డబ్బు సంపాది స్తున్నారు. అలా కాకుండ మూగజీవాలను రక్షించడానికి గోశాలలు ముఖ్యపాత్ర వహిస్తున్నాయి.

## శ్రీకృష్ణ గోశాల బెరహంపూర్ :

ఇది 1958లో నెలకొల్పబడింది. వీధుల్లో తిరిగే ఆవులను, వట్టిపోయిన గోవులను, జబ్బుపడిన ధేనువులను ఆదుకుంటూ ఈ సంస్థ పనిచేస్తోంది. అంతకు ముందు వాటి మాంసాన్ని, రక్తాన్ని, ఎముకల్ని అమ్మే ఏజంట్లు వాటిని గోవధ శాలలకు తరలించేవారు. గోవధను అడ్డుకోవాలని ఈ సంస్థ స్థాపించ బడింది. వ్యాపారస్థులు, గోభక్తుల, మార్వాడీల చందాలతో ఈ సంస్థ నడుస్తోంది. సొసైటీ యాక్టు క్రింద ఈ సంస్థను నడపడం ఆశ్చర్యకరం. 2003-2004 సంవత్సరంలో **AWB & State Government** రూ.40,000 గ్రాంట్ లభించింది.

కంపోస్టు ఎరువుల అమ్మకం, పాల అమ్మకం, చందాల వసూళ్ల ద్వారా దీన్ని నడుపుతున్నారు. గోవులకు మొక్కజొన్న, గోధుమ, **Husk** మొదలగు వాటితో తయారుచేసే **' Cattle Feed'**ని ఉపయోగిస్తున్నారు.

ఉచిత క్వార్టర్స్, కరెంట్, వాటర్, గ్యాస్ సప్లై చేస్తున్నారు. పనిచేసే ఉద్యోగస్థులకు, నెలవారీ చందాలు, వసూళ్లు ఒక ప్రత్యేకత. దీనిలో పనికిరాని ఆవులు 273, పాలిచ్చే ఆవులు 36, పెయ్యదూడలు 72, కోడెదూడలు 51, ఎద్దులు 4 ఉన్నాయి. ఈ ఇన్‌స్టిట్యూటును ఒక విద్యాపీఠం నడుపుతోంది. ఒరియా మీడియం చదువును, డ్రాయింగ్, పెయింటింగ్, యోగా, ప్రాణా యామం శిక్షణ నిస్తోంది. ఒరిస్సా ప్రభుత్వ విద్యాసంస్థ **LKG to 5th Std.** క్లాసుల్లో విద్యను బోధిస్తోంది. ఒక గోభక్తుడు దీనికి 8 ఎకరాల నేలను పర్మనెంట్ లీజుగా ఇచ్చాడు. దీనిలో గోశాలలు, పనిచేసేవారికి ఇళ్ళు, హెర్బల్ పెస్టిసైడ్స్ తయారీ యూనిట్, గోమయం, గోమూత్రంతో మందుల తయారీ, **Bio-fertiliser** తయారీ, బీద విద్యార్థులకు బడి, మందులకు పనికి వచ్చే మొక్కల పెంపకం మొదలయిన వాటికి ప్రాముఖ్యతనిస్తూ గొప్ప ప్రాజెక్టును రూపొందిస్తున్నారు.



## పురాణాల్లో గోమాత:

**క్షీరోదన్వత్ సంభూతా యా పురామృతమంథనే ।**
**పంచగావః శుభాః పార్థ పంచ లోకస్య మాతరః ॥**
**నందా సుభద్రా సురభిః సుశీలా బహుళా ఇతి ।**
**ఏతా లోకోపకారాయ దేవానాం తర్పణాయ చ ॥**

(భవిష్యపురాణం)

**తాత్పర్యం:** పార్థా ! పాలసముద్రమథనంలో వెలువడిన ఐదు గోవులు మాతృ స్వరూపిణులై కళ్యాణ కారిణులయ్యాయి. అవి నందా, సుభద్ర, సురభి, సుశీల, బహుళ. ఇవి సమస్తలోకాలకు మంగళదాయకములై దేవతలను హవిస్సుల ద్వారా తృప్తిపరచడానికి పుట్టాయి. కృష్ణుడు యుధిష్ఠిరునితో ఈ విధంగా అన్నారు.

**అష్టైశ్వర్యమయీ లక్ష్మీ వసతే గోమయే సదా !**

(మహాభారతం)

**లక్ష్మీశ్చ గోమయే నిత్యం పవిత్రా సర్వమంగళా ।**
**గోమయాలేపనం తస్మాత్ కర్తవ్యం పాండునందన ॥**

(స్కందపురాణం)

**తాత్పర్యం** : సర్వమంగళకరమైన శ్రీలక్ష్మీదేవి గోమయంలో నివసిస్తుంది. గోమయం వల్ల ధర్మ, అర్థ, కామ, మోక్షాలు సిద్ధిస్తాయి.

**శ్లో ॥ నమో గోభ్యః శ్రీమతీభ్యః సౌరభేయీభ్య ఏవ చ।**
**నమో బ్రహ్మపుత్రాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః ॥**

(అగ్నిపురాణం)

తాత్పర్యం : గోవులకు నమస్కారం. కామధేనువు (సురభి) యొక్క సంతానానికి నమస్కారం. బ్రహ్మ పుత్రికలకు నమస్కారం. పవిత్ర మొనరించునట్టి గోవులకు నమస్కారం.

**శ్లో॥ గావః ప్రతిష్ఠా భూతానాం గావః స్వస్త్యయనం మహత్ ॥**
**గావో భూతం చ భవ్యం చ గావః పుష్టిః సనాతనీ ॥**

(మహాభారతం, అనుశాసనిక పర్వము)

రాజా! గోవులే మనుష్యులు మొదలుగా సమస్త ప్రాణికోటికి జీవనాధారాలు. గోవులు కళ్యాణ కారకములు, శుభములు సమకూరుస్తాయి. పూర్వం జీవించిన వారి ఐశ్వర్యమునకు గోవులే ఆధారము లైనవి. ముందు ముందు కూడ గోవులవల్లనే అభివృద్ధి జరుగుతుంది. గోవులు అన్ని కాలాల్లోనూ పుష్టిని అందిస్తాయి. (వసిష్ఠుడు సౌదాస మహారాజుతో అన్నాడు)

**శ్లో॥ గావో మమాగ్రతః సన్తు గావో మే సన్తు పృష్ఠతః॥**
**గావో మే సర్వతః సన్తు గవాం మధ్యే వసామ్యహమ్॥**

(పద్మపురాణం)

తాత్పర్యం : నా ముందు, వెనుక, నా చుట్టూ గోవులుండాలి. గోవుల మధ్యలో నేను నివసించాలి''. ఇది శ్రీకృష్ణుడు వ్యక్తం చేసిన తన కోరిక-

**గోషు భక్తశ్చ లభతే యద్యదిచ్ఛతి మానవః ।**
**స్త్రియోఽపి భక్తా యా గోషు తాశ్చ కామా నవాప్ను యుః॥**
**పుత్రార్థీ లభతే పుత్రం కన్యార్థీ తామవాప్నుయాత్ ।**
**ధనార్థీ లభతే విత్తం ధర్మార్థీ ప్రాప్నుయాత్సుఖమ్ ।**
**న కించి ద్దుర్లభం చైవ గవాం భక్తస్య భారత ॥**

(మహాభారతం: ఆనుశాసనిక పర్వం)

గోభక్తులకు కోరినవి లభిస్తాయి. స్త్రీలకు కూడా కోరుకున్న కోరికలు నెర వేరుతాయి. పుత్రుడు కావాలన్నా, పుత్రిక కావాలన్నా పుడతారు. విద్యార్థికి విద్య, సుఖార్థికి సుఖం లభిస్తాయి. గోభక్తునికి దుర్లభమైనది లేదు.



**శ్లో॥ శ్వేతవృషసమారూఢా శ్వేతాంబరధరా శుచీ ।**
**మహాగౌరీ శుభం దద్యాత్ మహాదేవప్రమోదదా ॥**

(దేవీ పురాణం)

నవదుర్గలలో ఎనిమిదవ రూపం గల మహాగౌరి తెల్లని ఛాయతో త్రిశూలం, డమరుకం, అభయ వరద ముద్రలతో తెల్లని వస్త్రం, ఆభరణాలు ధరించి చతుర్భుజ అయిన అమ్మవారు వృషభవాహనారూఢ అయి దర్శనమిస్తుంది.

**శ్లో॥ త్వం మాతా సర్వదేవానాం త్వం చ యజ్ఞస్య కారణమ్ ।**
**త్వం తీర్థం సర్వతీర్థానాం నమస్తేఽస్తు సదా నహో।**
**శశి సూర్యారుణా యస్యాః లలాటే వృషభధ్వజః ।**
**సరస్వతీ చ హుంకారే సర్వే నాగాశ్చ కంబలే ।**
**ఖుర పృష్ఠే చ గంధర్వాః వేదాశ్చత్వార ఏవ చ ।**
**ముఖాగ్రే సర్వతీర్థాని చరాణి అచరాణి చ ॥**

తాత్పర్యం : ఓ గోమాతా! నీవు దేవతలకు తల్లివి. యజ్ఞానికి కారణరూపిణివి. సమస్త తీర్థాలకు తీర్థ రూపిణివి. నీకు నమస్కారం. నీ నుదుటిపై చంద్రుడు, సూర్యుడు, అరుణుడు, శంకరుడు, నీ హుంకారంలో సరస్వతి, మెడలో నాగగణాలు, గిట్టలలో గంధర్వులు, నాలుగు వేదాలు, ముఖాగ్రంలో చరములు, అచరములైన తీర్థాలన్నీ నివాసమున్నాయి అని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కామధేనువును స్తుతించారు.

**యద్గృహే దుఃఖితా గావః స యాతి నరకం నరః ।**

(అగ్ని పురాణం)

ఎవరి ఇంట్లో గోమాత దుఃఖిస్తుంటుందో ఆ వ్యక్తి నరకానికివెళ్తాడు.

**శ్లో॥ నమస్తే జాయమానాయై జాతాయా ఉత తే నమః ।**
**రోమభ్యశ్చ శఫేభ్యోశ్చ రూపాయాభ్యశ్చ తే నమః ॥**

**తాత్పర్యం** : గోమాతా! ఉత్పన్నమవుతున్నప్పుడు, ఉత్పన్నమైన పిదప నీకు నమస్కారం. నీ శరీరానికి, రోమాలకు, గిట్టలకూ నమస్కారం.

పంచ గావః సముత్పన్నా మథ్యమానే మహోదధౌ ।
తాసాం మధ్యే తు యా నందా తస్యై దేవ్యై నమో నమః ॥
సర్వకామదుఘే దేవి సర్వతీర్థాభిషేచని ।
పావని సురభి శ్రేష్ఠే దేవి తుభ్యం నమో నమః ॥

తాత్పర్యం : క్షీరసాగర మథనంలో పుట్టిన 'నంద' అను పేరు గల గోవునకు నమస్కారం. ఓ సురభిదేవీ! నీవు మా సమస్త కోరికలను తీర్చావు. సమస్త నదులలో స్నానం చేశావు. మమ్ములను పవిత్ర మొనరించు దేవీ! నీకు నమస్కారం.

శ్లో ॥ యయా సర్వమిదం వ్యాప్తం జగత్ స్థావర జంగమమ్ ।
తాం ధేనుం శిరసా వందే భూతభవ్యస్య మాతరమ్॥

తాత్పర్యం : ఈ స్థావర జంగమాలన్నీ ఎవరి కారణంగా విశ్వవ్యాప్తమై ఉన్నాయో, అట్టి భూత, భవిష్యత్కాలాలకు తల్లియైన గోమాతకు నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

నమో దేవ్యై మహాదేవ్యై సురభ్యై చ నమో నమః ।
గవాం బీజస్వరూపాయై నమస్తే జగదంబికే ॥
నమో రాధాప్రియాయై చ పద్మాంశాయై నమో నమః ।
నమః కృష్ణప్రియాయై చ గవాం మాత్రే నమో నమః ॥
కల్పవృక్షస్వరూపాయై ప్రదాత్ర్యై సర్వసంపదామ్ ।
శ్రీదాయై ధనదాయై చ బుద్ధిదాయై నమో నమః ॥
శుభదాయై ప్రసన్నాయై గోప్రదాయై నమో నమః ।
యశోదాయై సౌఖ్యదాయై ధర్మజ్ఞాయై నమో నమః ॥

**గోప్రదక్షిణం :**

గవాం దృష్ట్వా నమస్కృత్య కుర్యాచ్చైవ ప్రదక్షిణమ్ ।
ప్రదక్షిణీకృతా తేన సప్తద్వీపా వసుంధరా ॥



మాతరః సర్వభూతానాం గావః సర్వసుఖప్రదాః ।
వృద్ధిమాకాంక్షతా నిత్యం గావః కార్యాః ప్రదక్షిణాః ॥

తాత్పర్యం : గోమాతను దర్శించి, నమస్కరిస్తూ ప్రదక్షిణం చెయ్యాలి. చేస్తే సప్తద్వీపాలతో కూడిన భూమండలాన్ని ప్రదక్షిణం చేసినట్లు అవుతుంది. గోవులు సమస్త ప్రాణికోటియొక్క తల్లులు, సర్వ సుఖాలను ప్రసాదించేవి. అభివృద్ధిని కోరుకునే ప్రతివ్యక్తి ప్రతిరోజు గోవులకు ప్రదక్షిణం చెయ్యాలి.

పర్వతరాజైన హిమవంతుని కూతురు, దుర్గాదేవి. తొలి అవతారం, దక్ష ప్రజాపతి కూతురయిన సతీదేవి ఈమే. ఈమెను పార్వతి, హైమవతి అని కూడా అంటారు. ఈమె వాహనం వృషభం. ఈమెను దేవీనవరాత్రులలో మొదటిరోజున పూజిస్తారు.

(నవదుర్గల గురించి)

**గోపూజా విధానం :**

ఓం సత్యం శాంతం దయ
ఓం శ్రీమహాగణాధిపతయే నమః
ఓం శ్రీగురుభ్యో నమః
హరిః ఓమ్

అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాంగతో ऽపి వా ।
యస్స్మరే త్పుణ్డరీకాక్షం స బాహ్యాభ్యంతర శ్శుచిః
(ఈ మంత్రం చదువుతూ మూడుసార్లు శిరముపై తనచుట్టూ జలము చల్లుకోవలెను)

భగవంతుని స్మరిస్తూ

ఓం దేవీం వాచమజనయంత దేవా
స్తాం విశ్వరూపాః పశవో వదన్తి ।

సా నో మంద్రేష మూర్జం దుహానా
ధేను ర్వాగ స్మా నుప సుష్టు తైతు ॥

అయం ముహూర్త స్సుముహూర్తో ఽస్తు.

ఓం ధ్రువం తే రాజా వరుణో ధ్రువం దేవో బృహస్పతిః ।
ధ్రువం త ఇంద్ర శ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువమ్॥

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వ విఘ్నోపశాంతయే ॥

తదేవ లగ్నం సుదినం తదేవ తారాబలం చంద్రబలం తదేవ ।
విద్యాబలం దైవబలం తదేవ లక్ష్మీపతే తేఽంఘ్రి యుగం స్మరామి ॥

లాభస్తేషాం జయస్తేషాం కుతస్తేషాం పరాభవః ।
యేషా మిందీవరశ్యామో హృదయస్థో జనార్దనః ॥

ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్॥

సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే ।
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోఽస్తు తే ॥

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ ॥

ఓం శ్రీ లక్ష్మీనారాయణాభ్యాం నమః

ఓం శ్రీ ఉమామహేశ్వరాభ్యాం నమః

ఓం శ్రీవాణీహిరణ్యగర్భాభ్యాం నమః

ఓం శ్రీ శచీపురందరాభ్యాం నమః

ఓం శ్రీ ఇంద్రాద్యష్ట దిక్పాలక దేవతాభ్యో నమః



ఓం శ్రీ ఆదిత్యాది నవగ్రహ దేవతాభ్యో నమః

ఓం శ్రీ గ్రామదేవతాభ్యో నమః

ఓం శ్రీ క్షేత్రాధిష్ఠాన దేవతాభ్యో నమః

ఓం శ్రీ కులదేవతాభ్యో నమః

ఓం శ్రీ అరుంధతీవసిష్ఠాభ్యాం నమః

ఓం శ్రీ మాతాపితృభ్యాం నమః

ఓం శ్రీ సర్వేభ్యో మహాజనేభ్యో నమః

ఓం శ్రీ సద్గురుభ్యో నమః

ఓం ఆగమార్థం తు దేవానాం గమనార్థం తు రక్షసామ్।
కురు ఘంటారవం తత్ర దేవతాహ్వాన లాంఛనమ్ ॥

(అంటూ ఘంట వాయించవలెను)

భో దీప ! బ్రహ్మరూపేణ సర్వేషాం హృది సంస్థితః।
అతస్త్వాం స్థాపయామ్యద్య మదజ్ఞాన మపాకురు ॥

(దీపం వెలిగించి పుష్పాక్షతలచే అలంకరించాలి)

పృథ్వి ! త్వయా ధృతా లోకాః దేవి ! త్వం విష్ణునా ధృతా ।
త్వం చ ధారయ మాం దేవి । పవిత్రం కురు చాసనమ్ ॥

(యుక్తాసనమున కూర్చుండవలెను)

**ఆచమనము**

ఈ క్రింది నామములు చెప్పి మూడుసార్లు జలము తీసుకోవలెను.

ఓం కేశవాయ స్వాహా

ఓం నారాయణాయ స్వాహా

ఓం మాధవాయ స్వాహా

ఓం గోవిందాయ నమః

(అని చెప్పి చేతులు కడుగవలెను)

ఓం వామనాయ నమః

ఓం శ్రీధరాయ నమః

ఓం హృషీకేశాయ నమః

ఓం పద్మనాభాయ నమః

ఓం దామోదరాయ నమః

ఓం సంకర్షణాయ నమః

ఓం ప్రద్యుమ్నాయ నమః

ఓం వాసుదేవాయ నమః

ఓం అనిరుద్ధాయ నమః

ఓం పురుషోత్తమాయ నమః

ఓం అథోక్షజాయ నమః

ఓం నారసింహాయ నమః

ఓం అచ్యుతాయ నమః

ఓం జనార్దనాయ నమః

ఓం ఉపేంద్రాయ నమః

ఓం హరయే నమః

ఓం శ్రీకృష్ణాయ నమః

శ్లో ॥ **ఉత్తిష్ఠంతు భూత పిశాచాః ఏతే భూమిభారకాః ॥**
**ఏతేషా మవిరోధేన బ్రహ్మకర్మ సమారభే ॥**

(అక్షతలు వాసన చూసి ఎడమ ప్రక్క వెనుక వేసుకోవాలి)

## ప్రాణాయామము :

**ఓం భూః, ఓం భువః, ఓం సువః, ఓం మహః ఓం జనః, ఓం తపః, ఓగ్ం సత్యం ఓం తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి! ధియో యో నః ప్రచోదయాత్ । ఓం ఆపో జ్యోతీ రసోఽ మృతం బ్రహ్మ భూర్భువ స్సువరోమ్ ॥**



(ఈ మంత్రం చెబుతూ అంగుష్టం, మధ్యమ, అనామిక వ్రేళ్ళతో ముక్కు పట్టుకుని శ్వాస పీల్చి కొంచెంసేపు నిలిపి వదలవలెను. తరువాత నీటితో చేయి కడుగవలెను.)

## సంకల్పము :

చేతితో పుష్పాక్షతలు తీసుకొని తొడమీద ఎడమ చేతిక్రింద, కుడిచేతి పైకి వచ్చేటట్లు మూసి పెట్టుకోవలెను.

మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శుభే శోభనే ముహూర్తే శ్రీ మహా విష్ణో రాజ్ఞయా ప్రవర్తమానస్య అద్యబ్రహ్మణః ద్వితీయ పరార్ధే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమ పాదే జంబూద్వీపే భరతవర్షే భరత ఖండే మేరోః దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య --- ప్రదేశే కృష్ణా కావేర్యోః మధ్యదేశే స్వగృహే (శోభనగృహే) సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర గురుచరణ సన్నిధౌ అస్మిన్ వర్తమాన వ్యవహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే ---- సంవత్సరే ఆయనే ---- ఋతౌ ---- మాసే ---- పక్షే --- తిథౌ--- వాసరే శుభ నక్షత్రే శుభయోగే శుభకరణే ఏవం గుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ శ్రీమాన్ --- గోత్రః --- నామ ధేయః (పురుషులైనచో గోత్రస్య, నామధేయస్య, స్త్రీ లయినచో గోత్రవతీ నామధేయవతీ అని చెప్పవలెను) ధర్మపత్నీ సమేతస్య అస్మాకం వంశానాం దైవ ప్రీత్యర్థం అస్మాకం సహకుటుంబానాం క్షేమ, స్థైర్య, ధైర్య, విజయ, అభయ, ఆయురారోగ్య ఐశ్వర్య అభి వృద్ధ్యర్థం, ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభివృద్ధ్యర్థం, నానావిధ సౌభాగ్య సిద్ధ్యర్థం, మనోవాంఛా ఫలసిద్ధ్యర్థం, భక్తి జ్ఞాన వైరాగ్య యోగ ప్రాప్త్యర్థం, చరాచర ప్రాణి కోటీనాం క్షేమ సిద్ధ్యర్థం, శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం, మమ ఇష్టదేవతా ముద్దిశ్య ఇష్టదేవతా ప్రీత్యర్థం (వారి వారి ఇష్టదేవతల పేర్లను చెప్పుకోవలెను) ఆవాహతేభ్య స్సభ్యో దేవేభ్యః-సంభవద్భిః ద్రవ్యైః - సంభవద్భిః పదార్థైః సంభవద్భిః ఉపచారైః - సంభావిత నియమేన పురుష సూక్త విధానేన యావచ్ఛక్తి

ధ్యానావాహనాది షోడశోపచార పూజా మహం కరిష్యే -

(అని చెప్పి చేతిలోని పుష్పాలు, అక్షతలు దేవునిపై వేయవలెను)

**కలశారాధన :**

తదంగ కలశారాధనం కరిష్యే. కలశం గంధ పుష్పాక్షతైః అభ్యర్చ్య (కలశమును గంధం, అక్షతలు, పుష్పములు కుంకుమతో అలంకరించి కలశములో తులసీదళము గాని, పుష్పముగాని ఉంచవలెను. ఈ దిగువ నున్న మంత్రం చెబుతూ, కలశముపై ముందు కుడిచేయి పై ఎడమచేయి పెట్టి యుంచవలెను.)

శ్లో ॥ కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్ర స్సమాశ్రితః ।
మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృగణా స్మృతాః॥
శ్లో ॥ కుక్షౌ తు సాగరా స్సర్వే సప్తద్వీపా వసుంధరా
ఋగ్వేదో ఽథ యజుర్వేద స్సామవేదో హ్యథర్వణః ॥
శ్లో ॥ అంగైశ్చ సహితా స్సర్వే కలశాంబుసమాశ్రితాః।
ఆయాంతు దేవపూజార్థం దురితక్షయకారకాః ॥

మం॥ ఆ కలశేషు ధావతి పవిత్రే పరి షిచ్యతే।
ఉక్థైర్యజ్ఞేషు వర్ధతే ఆపో వా ఇదగ్ం
సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణావాపః
పశవ ఆపోఽన్నమాపో ఽమృతమాప
స్సమ్రాడాపో విరాడాప స్స్వరాడాప ఛ్చం
దాగ్ంస్యాపో జ్యోతీగ్ం ష్యాపో యజూగ్ంష్యాప
స్సత్య మాప స్సర్వా దేవతా ఆపో భూర్భువ స్సువ రాప ఓమ్.

శ్లో ॥ గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి ।
నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥
ఓం భూ ర్భువస్సువః, భూర్భు వస్సువః, భూర్భువస్సువః
కలశోదకేన పూజాద్రవ్యాణి సంప్రోక్ష్య, దేవం ఆత్మానం చ సంప్రోక్ష్య.



(అని చెప్పి పుష్పంతో కలశములోని జలమును తీసికొని అచ్చటనున్న పూజాద్రవ్యములపై, దేవునిపై, తనపై చల్లుకొనవలెను.)

**ఆదౌ నిర్విఘ్న పరిసమాప్త్యర్థం శ్రీగణపతి పూజాం చ కరిష్యే.**

(గణపతి విగ్రహాన్ని పెట్టి దానికి పూజ చెయ్యాలి. పసుపు గణపతికి చెయ్యాలి.)

**ధ్యానమ్ :**

మం॥ ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే ।
కవిం కవీనా ముపమశ్రవస్తమమ్
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనశ్శృణ్వ న్నూతిభి స్సీదసాదనమ్ ॥
ఓం శ్రీ గణాధిపతయే నమః. ధ్యాయామి.ధ్యానం సమర్పయామి.

(అని అక్షతలు విఘ్నేశ్వరునిపై వేయవలెను)

శ్రీమహాగణాధిపతయే నమః. ఆవాహయామి
సువర్ణ ఖచిత రత్న సింహాసనం సమర్పయామి
పాదయోః పాద్యం సమర్పయామి
హస్తయోః అర్ఘ్యం సమర్పయామి
ఆచమనీయం సమర్పయామి
శ్రీమహాగణాధిపతయే నమః. స్నానం సమర్పయామి

**మంత్రం :**

ఓం ఆపో హి ష్ఠా మయో భువః । తా న ఊర్జే దధాతన మహే రణాయ చక్షసే।
యో వశ్శివతమో రసః । తస్య భాజయతేహ నః । ఉశతీరివ మాతరః।
తస్మా అరం గమామ వః । యస్య క్షయాయ జిన్వథ। ఆపో జనయథా చ నః
శ్రీమహాగణాధిపతయే నమః. శుద్ధోదకస్నానం సమర్పయామి ।

(ఈ మంత్రం చెబుతూ స్నానం చేయించవలెను)

ఓం శ్రీమహాగణపతయే నమః వస్త్రయుగ్మం సమర్పయామి ।

(దూదికి పసుపు కుంకుమ పెట్టిన వస్త్రం)

శ్రీ గణపతయే నమః యజ్ఞోపవీతార్థం అక్షతాన్ సమర్పయామి।

దివ్యశ్రీచందనం సమర్పయామి

గంధస్యోపరి కుంకుమం సమర్పయామి

పుష్పమాలాం సమర్పయామి. పుష్పైః పూజయామి

(పుష్పములతోగాని అక్షతలతోగాని పూజచేయవలెను)

ఓం సుముఖాయ నమః. ఓం ఏకదంతాయ నమః

ఓం కపిలాయ నమః. ఓం గజకర్ణకాయ నమః

ఓం లంబోదరాయ నమః. ఓం వికటాయ నమః

ఓం విఘ్నరాజాయ నమః. ఓం గణాధిపాయ నమః

ఓం ధూమకేతవే నమః. ఓం గణాధ్యక్షాయ నమః

ఓం ఫాలచంద్రాయ నమః. ఓం గజాననాయ నమః

ఓం వక్రతుండాయ నమః. ఓం శూర్పకర్ణాయ నమః

ఓం హేరంబాయ నమః. ఓం స్కందపూర్వజాయ నమః

శ్రీమహాగణాధిపతయే నమః

షోడశనామ పూజాం సమర్పయామి.

ఓం మహాగణాధిపతయే నమః ధూపమాఘ్రాపయామి.

ఓం మహాగణాధిపతయే నమః దీపం దర్శయామి.

(దీపం దగ్గర పుష్పం వేసి నమస్కరించవలెను)

దీప ధూపానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి.

(కొద్దిగా జలము ఆకులో విడిచిపెట్టవలెను)

నైవేద్యం : బెల్లం, పండ్లు, నారికేళం

(ఈ మంత్రం చెప్పుచు నైవేద్యంపై నీరు చల్లవలెను)

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం। భర్గో దేవస్య ధీమహి। ధియో యో నః ప్రచోదయాత్। మహాగణాధిపతయే నమః అమృతనైవేద్యం నివేదయామి।



హస్తౌ ప్రక్షాళయామి, పాదౌ ప్రక్షాళయామి, శుద్ధ ఆచమనీయం సమర్పయామి (అని ప్రక్కన నీరు విడిచిపెట్టాలి).

ఓం మహాగణాధిపతయే నమః. దక్షిణ సహిత తాంబూలం సమర్పయామి.

కర్పూర హారతి :

వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ।

అవిఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా॥

కర్పూర నీరాజనం సమర్పయామి.

మంత్రపుష్పం : (పుష్పములు పట్టుకొని ఈ మంత్రం చెప్పవలెను)

తత్పురుషాయ విద్మహే వక్రతుండాయ ధీమహి।

తన్నో దంతిః ప్రచోదయాత్॥ సువర్ణ దివ్య మంత్రపుష్పం సమర్పయామి.

(అని చెప్పి గణపతిపై పుష్పములు వేయవలెను)

ఓం గణాధిపతయే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారం సమర్పయామి.

(తన చుట్టూ తాను మూడుసార్లు తిరగవలెను)

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం గణాధిప।

యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తు తే॥

అనయా ధ్యానావాహనాది షోడశోపచార పూజయా భగవాన్

సర్వాత్మకః శ్రీ మహాగణపతిః సుప్రీత స్సుప్రసన్నో

వరదో భవతు. మహాగణాధిపతే రనుగ్రహ సిద్ధిరస్తు.

(చేతిలో అక్షతలు, నీరు వేసుకుని ప్రక్కన విడిచిపెట్టవలెను)

శ్రీమహాగణాధిపతేః ప్రసాదం శిరసా గృహ్ణామి

అనుచు పూజించిన పుష్పములు అక్షతలు శిరస్సుపై వేసుకొనాలి.

ఉద్వాసనం :

యజ్ఞేన యజ్ఞమయజంత దేవాః తాని ధర్మాణి ప్రథమా న్యాసన్ ।
తే హ నాకం మహిమాన స్సచంతే యత్ర పూర్వే సాధ్యా స్సంతి దేవాః॥
శ్రీమహాగణాధిపతిం యథాస్థానం ప్రవేశయామి,పునరాగమనాయ చ.

(అని మంత్రం చెప్పి ప్రతిమను కొంచెము కదపవలెను.)

**గోపూజ :**

శ్లో॥ నమో గోభ్యః శ్రీమతీభ్యః సౌరభేయీభ్య ఏవ చ।
నమో బ్రహ్మసుతాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః॥
గవా మంగేషు తిష్ఠన్తి, భువనాని చతుర్దశ ।
యస్మా త్తస్మాచ్ఛివం మే స్యా దిహలోకే పరత్ర చ ।
శ్రీగోమాత్రే నమః. ధ్యానం సమర్పయామి.

శ్లో ॥ ఆగచ్ఛ దేవి కల్యాణి శుభాం పూజాం గృహాణ చ ॥
వత్సేన సహితాం త్వాంతు దేవీ మావాహయామ్యహమ్ ॥
శ్రీగోమాత్రే నమః ఆవాహనం సమర్పయామి

(పుష్పములు వేయాలి)

శ్లో ॥ నానారత్న సమాయుక్తం కార్తస్వరవిభూషితమ్ ॥
ఆసనం తే మయా దత్తం గృహాణ జగదంబికే ॥
శ్రీ గోమాత్రే నమః. ఆసనం సమర్పయామి

(అక్షతలు వేయవలెను)

శ్లో ॥ సౌరభేయి సర్వహితే పవిత్రే పాపనాశిని ॥
గృహ్ణీష్వైత న్మయా దత్తం పాద్యం త్రైలోక్యవన్దితే ॥
శ్రీగోమాత్రే నమః. పాద్యం సమర్పయామి.

(జలము ప్రోక్షించవలెను)



శ్లో ॥ దేహస్థితాసి రుద్రాణి శంకరస్య సదా ప్రియా।
ధేనురూపేణ సా దేవి మమ పాపం వ్యపోహతు ॥
శ్రీగోమాత్రే నమః ఆచమనీయం సమర్పయామి

(జలము చల్లవలెను)

శ్లో ॥ యా లక్ష్మీః సర్వలోకేషు యా చ దేవేష్వవస్థితా ।
ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ॥
శ్రీ గోమాత్రే నమః. స్నానం సమర్పయామి.

(జలము చల్లవలెను)

శ్లో ॥ ఆచ్ఛాదనం గవే దద్యాం సమ్యక్ శుద్ధం సుశోభనమ్
సురభి ర్వస్త్రదానేన ప్రీయతాం పరమేశ్వరీ ॥
శ్రీ గోమాత్రే నమః. వస్త్రం సమర్పయామి.

(టవల్‌లో బియ్యంవేసి మెడకు చుట్టవలెను)

శ్లో ॥ సర్వదేవమయే దేవి చందనం చంద్ర సన్నిభమ్।
కస్తూరీ కుంకుమాఢ్యం చ సుగంధం ప్రతి గృహ్యతామ్॥
శ్రీ గోమాత్రే నమః. చందనం సమర్పయామి

(పసుపు, గంధం కుంకుమతో బొట్టుపెట్టవలెను)

శ్లో॥ శాలీయాం శ్చంద్రవర్ణాంశ్చ హరిద్రామిశ్రితాన్ శుభాన్ ।
అక్షతాం శ్చార్పయే తుభ్యం గృహాణ జగదంబికే ॥
శ్రీ గోమాత్రే నమః. అలంకరణార్థం అక్షతాన్ సమర్పయామి.

శ్లో॥ తులసీ కుందమందార పారిజాతాంబుజై ర్యుతామ్।
వనమాలాం ప్రదాస్యామి గృహాణ జగదీశ్వరి ॥
శ్రీ గోమాత్రే నమః. పుష్పమాలాం సమర్పయామి.

(పుష్పములతో అలంకరించవలెను)

అథ గో రంగేషు సర్వాన్ దేవా నావాహయామి

శృఙ్గమూలయో ర్బ్రహ్మ విష్ణూ ఆవాహయామి (కొమ్ముల మొదట)

శృంగాగ్రయో స్సర్వ తీర్థా న్యావాహయామి (కొమ్ముల చివర)

లలాటే మహాదేవ మావాహయామి (నుదుట)

లలాటాగ్రే మహాదేవ మావాహయామి (నుదుటిపై భాగమున)

నాసాదండే షణ్ముఖ మావాహయామి (నాసికాదండము)

కర్ణయో రశ్వినా వావాహయామి (చెవులు)

చక్షుషో శ్శశి భాస్కరావాహయామి ( నేత్రములు)

జిహ్వాయాం వరుణ మావాహయామి (నాలుక)

హుంకారే సరస్వతీ మావాహయామి (హుంకారం)

గండయో ర్మధ్యే ధర్మమావాహయామి (దవడ)

ఓష్ఠయో స్సంధ్యాద్వయ మావాహయామి (పెదవులు)

గ్రీవాయా మింద్ర మావాహయామి (మెడ)

కుక్షిదేశే రక్షాం స్యావాహయామి (కడుపు)

ఉరసి సాధ్యా నావాహయామి (వక్షస్థలం)

చతుష్పాదేషు ధర్మమావాహయామి (నాలుగు పాదములు)

ఖురమధ్యే గంధర్వా నావాహయామి (డెక్కల మధ్య)

ఖురాగ్రే పన్నగా నావాహయామి (డెక్కల చివర)

ఖురపార్శ్వే హ్యప్సరోஉవాహయామి (డెక్కల ప్రక్కన)



పృష్ఠే ఏకాదశ రుద్రా నావాహయామి (పృష్ఠము)

సర్వసంధిషు వసూ నావాహయామి (అవయవ సంధులు)

శ్రోణీతటే - పితౄ నావాహయామి (పిఱుదులు)

లాంగూలే సోమ మావాహయామి (తోక)

వాలేషు ఆదిత్యరశ్మీ నావాహయామి (తోక యందలి రోమములు)

మూత్రే గంగా మావాహయామి (మూత్రం)

క్షీరే సరస్వతీ మావాహయామి (పొదుగు)

సర్పిషి హుతాశన మావాహయామి (నేయి)

రోమసు త్రయస్త్రింశత్కోటి దేవా నావాహయామి (వెంట్రుకలు)

ఉదరే పృథివీ మావాహయామి (ఉదరము)

పయోధరేషు సాగరా నావాహయామి (పొదుగు)

శ్లో ॥ తులసీ కుంద మందార జాతీ పున్నాగ చంపకైః ।

కదంబ కరవీరైశ్చ కల్హారై శ్చూతపత్రకైః।

నీలాంబుజై ర్బిల్వపత్రైః చంపకైః రుద్రరూపిణీమ్॥

పూజయిష్యా మ్యహం భక్త్యా సంగృహాణాచ్యుతార్చితే॥

గోమాత్రే నమః. పుష్పైః పూజయామి.

**గోమాతాష్టోత్తర శతనామావళి :**

ప్రతి నామమునకు ముందు 'ఓం' అని, చివర 'నమః' అని చెప్పుకోవలెను.

ఓం శ్రీకృష్ణవల్లభాయై నమః
శ్రీకృష్ణాయై
కృష్ణప్రియాయై
కృష్ణరూపాయై
కృష్ణప్రేమవివర్ధిన్యై
కమనీయాయై
కామధేనవే
కల్యాణ్యై
కల్య నందితాయై 10
కల్పవృక్ష స్వరూపాయై
దివ్యకల్పసమలంకృతాయై
క్షీరరూపిణ్యై
నందాదిగోపవినుతాయై
నందిన్యై
నందన ప్రదాయై
బ్రహ్మాది దేవవనితాయై
బ్రహ్మానంద విధాయిన్యై
సర్వదేవగణస్తుతాయై
సర్వధర్మస్వరూపిణ్యై 20
సర్వభూతావనరతాయై
సర్వదాయై
సర్వామోదదాయై
శిష్టేష్టాయై
శిష్టవరదాయై
సృష్టిస్థితిలయాత్మికాయై
సురభ్యై
సౌరభేయ్యై
సురాసుర నమస్కృతాయై
సిద్ధిప్రదాయై 30
సిద్ధవిద్యాయై
అభీష్ట సిద్ధి ప్రవర్షిణ్యై
జగద్ధితాయై
బ్రహ్మపుత్ర్యై
గాయత్ర్యై
ఏకహాయన్యై
గంధర్వాది సమారాధ్యాయై
రాధా హస్తోపలాలితాయై
యజ్ఞాంగాయై
యజ్ఞఫలదాయై 40
యజ్ఞేశ్యై
హవ్యకవ్య ప్రదాయై
శ్రీదాయై
స్తవ్య భవ్యసమోజ్జ్వలాయై
బుద్ధిదాయై
బుద్ధ్యై
ధనధాన్య వివర్ధిన్యై
యశోదాయై
సుయశః పూర్ణాయై
యశోదానంద వర్ధిన్యై 50
ధర్మజ్ఞాయై



ధర్మరూప తనూరుహాయై
విష్ణుపాదోద్భవీతి ప్రఖ్యాతాయై
వైష్ణవ్యై
విష్ణురూపిణ్యై
విశిష్ట పూజితాయై నమః
శిష్టాయై
శిష్టేష్టాయై
శిష్టకామదుఘే 60
దిలీపపాలితాయై
దివ్యాయై
ఖురపావిత విష్టపాయై
రత్నాకర సముద్భూతాయై
రత్నదాయై
శక్రపూజితాయై
పీయూషవర్షిణ్యై
పుణ్యాయై
పుణ్యాపుణ్య ఫలప్రదాయై
పయః ప్రదాయై 70
పరమోదారాయై
ఘృతదాయై
ఘృతసంభవాయై
కార్తవీర్యార్జున మృతిహేతవే
సహేతుక సన్నుతాయై
జమదగ్నికృతాజస్రసేవాయై
సంతుష్టమానసాయై
రేణుకా వినుతాయై
పాదరేణు పాలిత
భూతలాయై
సవత్సాయై 80
వత్సకారాతిపాలితాయై
భక్తవత్సలాయై
వృషదాయై
కృషిదాయై
హేమశృఙ్గాగ్రతల
శోభనాయై
త్రైలోక్య నందితాయై
భవ్యాయై
భావితాయై
భవనాశిన్యై 90
భుక్తిముక్తి ప్రదాయై
కాంతాయై
కాంతాజనశుభంకర్యై
సురూపాయై
బహురూపాయై
అచ్ఛాయై
కర్బురాయై
కపిలాయై
సాధుశీలాయై

సాధురూపాయై 100
సాధుబృంద నిషేవితాయై
సర్వవేద రూపాయై
ప్రభావత్యై
వసూనాం దుహిత్రే
రుద్రమాత్రే
ఆదిత్య సహోదర్యై
శ్రీ గోమాత్రే నమః 108

**ధూపం :**

**పావనం సురభి శ్రేష్ఠే శుభ గంధ సమన్వితే।**
**ఘృత గుగ్గులు సంయుక్తం ధూపోఽయం ప్రతిగృహ్యతామ్॥**
**గో పరదేవతాయై నమః. ధూప మాఘ్రాపయామి.**

**దీపం :**

**ఆనందం కృత్సదా లోకే దేవానాం చ సదా ప్రియే!**
**గౌ స్త్వం పాహి జగన్నాథే దీపోఽయం ప్రతిగృహ్యతామ్**
**గో పరదేవతాయై నమః దీపం దర్శయామి.**

**నైవేద్యం :**

**నైవేద్యం షడ్రసోపేతం దధి మధ్వాజ్య సంయుతమ్।**
**నానాభక్ష్య ఫలోపేతం సురభి త్వం గృహాణ భోః!**
**గో పరదేవతాయై నమః నైవేద్యం సమర్పయామి.**

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్. సత్యం త్వర్తేన పరిషించామి (పగలు) (రాత్రి) ఋతం



త్వర్తేన పరిషించామి. అమృతమస్తు. అమృతోపస్తరణమసి. పువ్వుతో నీటిని చల్లుతూ (నైవేద్యంపై) ఓం ప్రాణాయ స్వాహా. ఓం అపానాయ స్వాహా. ఓం వ్యానాయ స్వాహా. ఓం ఉదానాయ స్వాహా. ఓం సమానాయ స్వాహా. మహా నైవేద్యం సమర్పయామి. ఉత్తరాపోశనం సమర్పయామి. హస్తౌ ప్రక్షాళయామి. పాదౌ ప్రక్షాళయామి. శుద్ధాచమనీయం సమర్పయామి.
గో దేవతాయైనమః.

**తాంబూలం :**

**పూగీఫలై స్సకర్పూరై ర్నాగవల్లీ దళైర్యుతమ్।**
**కర్పూర చూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥**
**గో పరదేవతాయై నమః. తాంబూలం సమర్పయామి.**

నీరాజనం :

**నమో గోభ్యః శ్రీమతీభ్యః సౌరభేయీభ్య ఏవ చ।**
**నమో బ్రహ్మసుతాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః॥**
**గో పరదేవతాయై నమః అఖండానంద నీరాజనం దర్శయామి.**

సంతత శ్రీరస్తు. సమస్త మంగళాని భవంతు. నిత్య శ్రీరస్తు. నిత్యమంగళాని భవన్తు.

**శుద్ధాచమనీయం :**

**మంగళం తే మహాదేవి మంగళం విశ్వమాతృకే।**
**మంగళం సర్వలోకేశి మంగళం సర్వపోషిణి॥**

గో పరదేవతాయై నమః నీరాజనానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి. అనయా ధ్యానావాహనాది షోడశోపచార పూజయా భగవతీ సర్వాత్మికా గో దేవతా సుప్రీతా వరదా భవతు. ఏతత్ఫలం గో దేవతార్పణమస్తు.

## మంత్రపుష్పమ్ :

జాతవేదసే సునవామ సోమ మరాతీయతో ని దహాతి వేదః।
స నః పర్షదతి దుర్గాణి విశ్వా నావేవ సింధుం దురితాఽత్యగ్నిః ॥
తామగ్నివర్ణాం తపసా జ్వలంతీం వైరోచనీం కర్మఫలేషు జుష్టామ్।
దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే సుతరసి తరసే నమః।
అగ్నే త్వం పారయా నవ్యో అస్మాన్ స్వస్తిభిరతి దుర్గాణి విశ్వా
పూశ్చ పృథ్వీ బహులా న ఉర్వీ భవా తోకాయ తనయాయ శంయోః
విశ్వాని నో దుర్గహా జాతవేద స్సింధుం న నావా దురితాఽతి పర్షి
అగ్నే అత్రివన్మనసా గృణాఽనోఽస్మాకం బోధ్యవితా తనూనామ్
పృతనా జితగ్ం సహమాన ముగ్ర మగ్నిగ్ం హువేమ పరమా థ్సధస్థాత్
స నః పర్షదతి దుర్గాణి విశ్వా క్షామద్దేవో అతిదురితాఽత్యగ్నిః।
ప్రత్నోషిక మీడ్యో అధ్వరేషు సనాచ్చ హోతా నవ్యశ్చసత్సి।
స్వాంచాగ్నే తనువం పిప్రయస్వాస్మభ్యం చ సౌభగ మాయజస్వ
గోభిర్జుష్టమయుజో నిషిక్తం తవేంద్ర విష్ణోరనుసంచరేమ।
నాకస్య పృష్ఠమభి సంవసానో వైష్ణవీం లోక ఇహ మాదయన్తామ్॥
కాత్యాయనాయ విద్మహే కన్యకుమారి ధీమహి తన్నో దుర్గిః ప్రచోదయాత్
ఓం తద్బ్రహ్మ। ఓం తద్వాయుః ఓం తదాత్మా ఓం తత్సత్యం ఓం తత్సర్వం।
ఓం తత్పురోర్నమః అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు త్వం యజ్ఞస్త్వం।

వషట్కారస్త్వ మింద్రస్త్వగ్ం రుద్రస్త్వం । విష్ణుస్త్వం । బ్రహ్మ త్వం
ప్రజాపతిః త్వం తదాప ఆపో జ్యోతీ రసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోమ్
ఓం ఆ గావో అగ్మన్నుత భద్రమక్రన్ । సీదన్తు గోష్ఠే రణయంత్వస్మే॥
ప్రజావతీః పురురూపా ఇహ స్యుః ఇంద్రాయ పూర్వీరుషసో దుహానాః ।
ఇంద్రో యజ్వనే పృణతే చ శిక్షత్యుపేద్దదాతి న స్వం ముషాయతి।
భూయోభూయో రయిమిదస్య । వర్ధయన్।
అభిన్నే ఖిల్యే ని దధాతి దేవయుమ్ । న తా నశంతి న తా అర్వా।



గావో భగో గావ ఇంద్రో మే అచ్ఛాన్ గావ స్సోమస్య
ప్రథమస్య భక్షః। ఇమా యా గావ స్స జనాస ఇంద్ర
ఇచ్ఛామీద్ధృదా మనసా చిదింద్రమ్॥ యూయం గావో మేదయథా కృశం చిత్ ।
అశ్రీరం చిత్కృణుథా సుప్రతీకమ్ । భద్రం గృహం కృణుథ భద్రవాచో
బృహద్వో వయ చ్యతే సభాసుఉ ప్రజావతీః సూయవసం రిశన్తీః
శుద్ధా అప స్సుప్రపాణే పిబన్తీః మా వః స్తేన ఈశత మాఘశంః।
పరి వో హేతీ రుద్రస్య వృజ్యాః । ఉపేదముపపర్చనం
ఆసు గోషూప పృచ్యతామ్ ఉప ఋషభస్య రేతసి ఉపేంద్ర తవ వీర్యే ॥
గావో మమాగ్రత స్సంతు గావో మే సంతు పృష్ఠతః
గావో మే హృదయే సంతు గవాం మధ్యే వసామ్యహమ్ ॥
పంచగావ స్సముత్పన్నా మథ్యమానే మహోదధే ।
తాసాం మధ్యే తు యా నందా తస్మై దేవ్యై నమో నమః ॥
యా లక్ష్మీ స్సర్వ దేవానాం యా చ దేహే వ్యవస్థితా ।
ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ॥
ఆయాతు గౌ ర్మయా దత్తా సర్వాసాం గతి రుత్తమమ్ ।
తుభ్యం చైకా మయా దత్తా ఏషా సర్వ మనోరమా ॥
గో దేవతాయై నమః. సువర్ణ మంత్రపుష్పం సమర్పయామి.

## సాష్టాంగ నమస్కారం :

ఉరసా శిరసా దృష్ట్యా మనసా వచసా తథా ।
పద్భ్యాం కరాభ్యాం బుద్ధ్యా చ ప్రణామోఽష్టాంగ ఉచ్యతే॥
గో పరదేవతాయై నమః. సాష్టాంగనమస్కారం సమర్పయామి.

## ప్రదక్షిణ నమస్కారం :

యాని కాని చ పాపాని జన్మాంతర కృతాని చ ।
తాని తాని ప్రణశ్యంతు ప్రదక్షిణ పదే పదే ॥
పాపోఽహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః ।
త్రాహి మాం నరకాత్ ఘోరాత్ శరణాగత వత్సలే ॥

అన్యథా శరణం నాస్తి । త్వమేవ శరణం మమ ।
తస్మాత్ కారుణ్య భావేన । రక్ష రక్ష ఘృణాపరే ॥

**గో ప్రార్థన :**

ధ్యాయామి సురభిం దేవీం శ్రితకామ్య ఫలప్రదామ్ ।
వస్త్రయుగ్మేన సంయుక్తాం స్వర్ణశృంగ విభూషితామ్ ॥
రౌప్యేన కారిత ఖురాం కాంస్య దోహన సంయుతామ్ ।
తామ్ర పృష్ఠాం సవత్సాం చ కపిలాం చ పయస్వినీమ్ ॥
గో పరదేవతాయై నమః. ప్రార్థనా నమస్కారాన్ సమర్పయామి.
యద్యత్ ద్రవ్య మపూర్వం చ పృథివ్యా మతి దుర్లభమ్।
దేవ భూపార్హ భోగ్యం చ తత్తత్ ద్రవ్య మిదం తవ ॥

ఛత్రం ధారయామి - చామరం వీజయామి, గీతం శ్రావయామి, నృత్యం దర్శయామి, ఆందోళికా మారోహయామి, అశ్వా నారోహయామి, గజా నారోహయామి, సమస్త దేవోపచార రాజోపచార, శక్త్యోపచార భక్త్యోపచార విశేషైః పూజయామి.

**క్షమాపణ :**

అపరాధ సహస్రాణి క్రియంతేఽహర్నిశం మయా ।
దాసోఽయ మితి మాం మత్వా క్షమస్వ పరమేశ్వరి ॥
ఆవాహనం న జానామి న జానామి విసర్జనమ్।
పూజావిధిం న జానామి క్షమస్వ పరమేశ్వరి।
మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం పరాత్పరే !
యత్పూజితం మయా దేవి! పరిపూర్ణం తదస్తు తే ॥

అనయా మయా కృత పూజయా భగవతీ సర్వాత్మికా గో దేవతా సుప్రీతా సుప్రసన్నా వరదా భవతు.



**ఉద్వాసనం :**

ఓం సహస్ర పరమా దేవీ శతమూలా శతాంకురా।
సర్వగ్ం హరతు మే పాపం దూర్వా దుస్స్వప్ననాశినీ॥
ఓం యజ్ఞేన యజ్ఞ మయజంత దేవా స్తాని ధర్మాణి ప్రథమా న్యాసన్।
తే హ నాకం మహిమా న స్సచంతే యత్ర పూర్వే సాధ్యా స్సంతి దేవాః।
గో పరదేవతాయై,రవతాయై నమః.

ఈ క్రింది శ్లోకము చదువుచు గోమాత తీర్థం తీసుకోవలెను.

అకాలమృత్యుహరణం సర్వవ్యాధినివారణమ్।
సర్వపాపక్షయకరం మాతృపాదోదకం శుభమ్ ॥

**గో ప్రార్థన :**

నమో బ్రహ్మణ్యదేవాయ గో బ్రాహ్మణ హితాయ చ ।
జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః ॥

కీర్తనం శ్రవణం దానం దర్శనం చాపి పార్థివ ।
గవాం ప్రశస్యతే వీర, సర్వపాప హరం శివమ్ ॥

ఘృతక్షీరప్రదా గావో ఘృతయోన్యో ఘృతోద్భవాః।
ఘృతనద్యో ఘృతావర్తా స్తా మే సంతు సదా గృహే ॥

ఘృతం మే హృదయే నిత్యం ఘృతం నాభ్యాం ప్రతిష్ఠితమ్ ॥
ఘృతం సర్వేషు గాత్రేషు ఘృతం మే మనసి స్థితమ్॥

గావో మమాగ్రతో నిత్యం గావః పృష్ఠత ఏవ చ ।
గావో మే సర్వత శ్చైవ గవాం మధ్యే వసామ్యహమ్ ॥

ఇత్యాచమ్య జపే త్సాయం ప్రాతశ్చ పురుష స్సదా ।
య దహ్నా త్కురుతే పాపం తస్మాత్ స పరిముచ్యతే ॥

**గోసూక్తులు** :

* గోవు సర్వదేవతా స్వరూపిణి. పరమ పవిత్రమైనది.
* గోవు తల్లిలా మనల్ని లౌకికంగా, పారమార్థికంగా కాపాడుతుంది.
* గో మాత లలితా సహస్రనామావళిలోనిది.
* గో శబ్దానికి కాంతి, సంపద, లక్ష్మి, కిరణము, వాక్కు అనే అర్థాలు కూడా స్ఫురిస్తాయి.
* గోవు, బ్రాహ్మణుడు, అగ్ని, బంగారం, నెయ్యి, సూర్యుడు, నీరు, రాజు - అష్టమంగళములు.
* గోరూపములో భూమి శ్రీమహావిష్ణువును ప్రార్థించి తరించింది.
* గోమాతకు చేసిన ప్రదక్షిణం భూప్రదక్షిణంతో సమానము.
* గోమాత ఏకాదశ రుద్రులకు తల్లివంటిది. అష్ట వసువులకు కుమార్తె వంటిది.
* గోప్రదక్షిణ నమస్కారాలు చేస్తే - శ్రీకృష్ణునికి ప్రదక్షిణ నమస్కారం చేసినట్లే.
* గోశాల దేవాలయం వంటిది. అన్ని పుణ్య లోకములలో గోలోకం ఉత్తమం.
* గోవును స్మరించడం, పూజించడం, దానం చెయ్యడం సర్వపాపహరము.
* గోవు, తులసి ఉన్న గృహం సర్వ సంపదలకు నెలవు.
* గోరక్షణ - పర్యావరణ పరిరక్షణ.
* గోరక్షణ - మన సంస్కృతి పరిరక్షణ.
* గోవు ఈశ్వరుడు లోకానికి ప్రసాదించిన వరం.
* గోహత్యా పాతకమునకు ప్రాయశ్చిత్తం లేదు.



* గో సంతతి వ్యవసాయానికి ప్రాణసమానమైది.
* గోవు, గీత, గంగ, గురువు, గోవిందుడు, గాయత్రి- వీటినే గ కార షట్కం అని అంటారు. ఇవి ఇహంలో సుఖం, పరంలో మోక్షం ఇస్తాయి.
* గోమూత్రం, గోమయం, గోక్షీరం, గోఘృతం, గోదధి- ఇవి పంచగవ్యాలు.
* గోవు ఉన్నచోట సర్వశుభములు కలుగును.
* గోవు పాడిపంటల అభివృద్ధికి అవసరం.
* గోశాలను దేవాలయంలా పవిత్రంగా ఉంచి, గోమాతను దైవంగా భావించాలి.
* గోక్షేమమే మానవక్షేమం.
* గోవులను, గోపాలురను, గోపికలను రక్షించి తరింప చేసినవాడు శ్రీకృష్ణుడు.
* గోవును రక్షిస్తే - అది మనల్ని రక్షిస్తుంది.

**గో మహితోక్తులు:**

1. ఆనుశాసనిక పర్వంలో గోవు గురించి భీష్ముడు 'గోభి స్తుల్యం న పశ్యామి ధనం కించి దిహాచ్యుత' గోవుతో సమానమైన సంపద లేదు.

**(మహాభారతం)**

2. గోమాత 'సురభిదేవి' అంశ. పరాశక్తి సురభిదేవిగా గోస్వరూపిణిగా ఆవిర్భవించింది.

**(దేవీభాగవతం)**

3. సమస్త గోవులు విష్ణు స్వరూపములని వ్యాసుడు చెప్పాడు.

**(బ్రహ్మపురాణం)**

**4.** మనకు, ఆవుకు గల సంబంధం జీవాత్మ పరమాత్మకు గల సంబంధం.

**(పొట్టిశ్రీరాములు)**

**5.** ఖురాన్‌లో గోవధ ఎక్కడా సమర్థింపబడలేదు.

**(హకీల హజ్‌మల్‌ఖాన్)**

**6.** గోవధ ఇస్లాం మత విరుద్ధము.

**(తాహప్-ని-హింద్ బిజహరు)**

**7.** గోవు భౌతిక, ఆధ్యాత్మిక సంపదను బోధించును. సర్వతీర్థ ఫలదాయిని.

**(పద్మపురాణము)**

**8.** గోవు పేడ యమున, గో మూత్రము నర్మద, గోక్షీరం గంగ అని చెప్ప బడింది. గోవును క్షోభపెడితే లోకమే నశిస్తుంది. గోమయములో లక్ష్మి నివసించును.

**(స్కందపురాణము)**

**9.** సర్వప్రాణులందు దయగల వాడే దేవుని కృపకు పాత్రుడు.

**(దయానందసరస్వతి)**

**10.** గోవు సగటున 25,000 మంది మనుష్యుల ఆకలిని తీరుస్తుంది. గోవును వధిస్తే ఆ దేశపురాజులు, ప్రజలు నశిస్తారు.

**(గోస్వామి)**

**11.** బ్రహ్మ "గోవు త్రిమూర్తులకు అత్యంత ప్రీతికరమైనదని" దేవతలకు, ఋషులకు చెప్పాడు.

**(కాశీఖండం)**

**12.** గోవు బ్రాహ్మణులు ఒక్కటే-కాలక్రమంలో అవి రెండుగా మారాయి. విప్రులలో మంత్రాలు, గోవులో యజ్ఞానికి ఉపయోగపడే హవిస్సులు ఉంటాయి.



**13.** ధర్మార్థ కామమోక్షాలు ఆవుయొక్క నాలుగు పొదుగులలో ఉన్నాయి.

**(తులసీదాస్)**

**14.** గోరక్షణ స్వరాజ్య సముపార్జన కంటె తక్కువ కాదు-దాని కోసం తన ప్రాణాలైనా అర్పించిన వాడే హిందువు.

**(గాంధీజీ)**

**15.** ఆవుపాలు రసాయనం. ముసలితనాన్ని, అన్ని వ్యాధులను అరికడుతుంది.

**(చరకసంహిత)**

**16.** గోమాంసం తింటే రోగిష్ఠులవుతారు.

**(మహమ్మద్ ప్రవక్త)**

**17.** అధర్వవేదం 4 వ కాండలో 12 వ సూక్తం 'గోసూక్తం' గోవు రుద్రులకు, తల్లి. వసువులకు పుత్రిక. ఆదిత్యులకు సోదరి.

**(గోసూక్తం)**

**18.** భారతదేశంలో గోపాలన సనాతనధర్మం.

**(డా॥ రాజేంద్రప్రసాద్, రాష్ట్రపతి)**

**19.** గోమాత్రా సమా న విద్యతే = ఆవుతో పోల్చదగినది ఏమీ లేదు.

**(యజుర్వేదము)**

**20. అథర్వవేదం** : యది నో గాం హంసి యద్యశ్వం యది పూరుషమ్।
తం త్వా సీసేన విధ్యామో యథాఽసో అవీరహా॥

**తాత్పర్యం** : ఒక వేళ నీవు మా గోవులను, గుఱ్ఱాలను, పురుషులను హత్య చేసినట్టయితే, నిన్ను సీసపు గుండుతో కుదించివేస్తాం - అప్పుడు నీవు మా వీరులను వధింపజాలవు -

**21.** స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఒక్క కలము పోటుతో గోహత్య సంపూర్ణంగా నిషేధించబడుతుంది. కావాలంటే నన్ను చంపండి - కాని గోవు పైకి మీ చేయి పోనీయకండి -

**(లోకమాన్య బాలగంగాధర తిలక్)**

22. ఒక ఎద్దును (గోవంశాన్ని) చంపడం ఒక మనిషిని చంపడంతో సమానము.

**(జీసస్ క్రీస్తు)**

23. 'గావో నో పరమా మిత్రా'- గోవు మానవుని పరమ మిత్రప్రాణి.

**(గౌతమ బుద్ధుడు)**

24. భాగవత ధర్మములో గోసేవకు విశిష్టస్థానమున్నది.

**(సంత్ ఏకనాథ్)**

25. గోరక్షణ లేకుండా మానవరక్షణ అసంభవం.

**(భగవాన్ మహావీరుడు)**

26. ధర్మ, అర్థ, కామ, మోక్షములు అనబడు ఈ నాలుగు గోవుయొక్క నాలుగు చన్నులు.

**(గోస్వామి తులసీదాసు)**

27. గోహత్యా నిషేధము మనకు అనివార్యం.

**(స్వర్గీయ జయప్రకాష్ నారాయణ్)**

28. గోక్షీరం ఔషధం, గోవు నెయ్యి అమృతం, గోవు మాంసం నిషిద్ధం.

**(హజరత్ మహమ్మద్ సాహెబ్)**

29. యహీ దేహు ఆజ్ఞా తుర్క్ గాహై ఖపా ఊ ।
గఊ ఘాతకా దోష్ జగసె ఉ మిటా ఊ ।
యహీ ఆస పూరన్ కరో తూ ఊ హమారా ।
మిటే కష్ట గౌ అన్, ఛటై ఖేద భారీ ।

**(గురు గోవింద్ సింగ్)**



30. భారత భూమిపై గోవురక్తము చిందుతున్నంత వరకూ దేశంలో సుఖ శాంతులుగాని, ధన ధాన్యములుగాని ఉండవు.

**(ఖాలూ హనుమాన్ ప్రసాద్ పోద్దార్)**

**గోరక్షణ :**

ధర్మోరక్షతి రక్షితః. వృక్షో రక్షతి రక్షితః. గావో రక్షంతి రక్షితాః అన్నది అక్షరాల నిజం - 'అహింసా పరమో ధర్మః' అనేది సిద్ధాంతం.

'ఆత్మవత్సర్వభూతానాం యః పశ్యతి స పండితః'. - ఎవరు అన్ని ప్రాణుల్లో ఆత్మభావం కలిగి ఉంటారో వారే పండితులనీ, తే ప్రాప్నువన్తి మా మేవ సర్వభూతహితే రతాః (భగవద్గీత) సకల ప్రాణుల హితములో సంలగ్నులు పరబ్రహ్మనే పొందుతారు.

జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం, శ్రీసంస్థాన కర్ణ, శ్రీరామచంద్రాపుర మఠం.

**గోసేవలు :**

| | |
|---|---|
| 1. గోగ్రాసం(ఒక్కొక్కసారి రూ.25/- రోజుకి 4 సార్లు) | రూ.100/- |
| 2. దశగోగ్రాసం(10 సార్లు) | రూ.250/- |
| 3. శతగోగ్రాసం(100 సార్లు) | రూ.2500/- |
| 4. సహస్రగోగ్రాసం(1000 సార్లు) | రూ.25,000/- |
| 5. ఆయుత గోగ్రాసం(10వేల సార్లు) | రూ.2,50,000/- |
| 6. లక్షగోగ్రాసం (లక్షసార్లు) | రూ.25,00,000/- |

**కామధేను మహాయాగం :**

కామధేనువు యాగపూర్ణాహుతి సేవ రూ. 501/-
కామధేనువు యాగ సంకల్పం రూ. 5000/-
కామధేనువు యాగసేవ రూ. 20,000/-
(ఒకరోజుఖర్చు)

**గోదానం :**

సవత్సగోదానం (గోవు, దూడ) రూ.15,000/-
నంది సమర్పణ (ఎద్దుదానం) రూ.25,000/-
జోడినంది దానం (2 ఎడ్లదానం) రూ.50,000/-
స్వర్ణాలంకృతగోదానం రూ. 1,00,000/-
(అలంకరించిన ఆవు)

**కామధేను సేవ :**

కామధేనువు నీరాజనం రూ.100/-
కామధేనువు పూజ రూ.1,000/-
కామధేనువు మహాపూజ రూ.10,000/-
కామధేనుతులాభార సేవ రూ.10,000/-
కామధేనువు కనకాభిషేకం రూ.1,25,000/-

కామధేనువును గురించిన ఈ వివరాలు తెలుసుకుంటే దాని గొప్పతనం వేరే చెప్పనక్కరలేదు.

**గో రక్షణ మన కర్తవ్యం :**

1. గోవు ఎరువులను పంటలకు వాడటం, కీటక సంహారిణిగా గోమూత్రం వాడటం వల్ల లాభం పొందవచ్చు.



2. ప్రతి పల్లెలోనూ, గ్రామాల్లోనూ, దేవాలయ భూముల్లోనూ గోశాలలు నిర్మించాలి.
3. గోవధశాలలను మూసివెయ్యాలి అని ప్రచారం చెయ్యండి.
4. గోవధను నివారించాలి-రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నరు ఇందుకు తగిన శ్రద్ధ వహించాలి. వారు శ్రద్ధ వహించేలా ప్రజలు శ్రద్ధ వహించాలి- గోభక్తులను శాసనసభకు ఎన్నుకోవాలి. గోవధ చేసి వాటి క్రొవ్వుతో, ఎముకల పొడితో చేసే సబ్బులను, పళ్ల పేష్టులను, పళ్లపొడిని వాడకండి.
5. గోవు పాలు, పెరుగు, వెన్న, నెయ్యి మొదలగు విలువయిన పదార్థములను సేవించండి. ధర ఎక్కువయిననూ వాటినే కొనండి. డిమాండు ఉంటే వాటినే వ్యాపారస్థులు అభివృద్ధి చేస్తారు.
6. అపార్ట్‌మెంట్స్‌లో గోవులను పెంచలేకపోతే, యథాశక్తి గోరక్షణకు దానాలు చేసి గోశాలలను పోషించండి. పండుగలకు, పుట్టినరోజు, వివాహాలకు, ప్రతి శుభకార్యానికి గోదానం చేసే అలవాటు చేసుకోండి.
7. ప్రతి ఇంటా గోవును పెంచిన మంచిది. ప్రతి గ్రామంలోనూ గోవుల పోషణ జరిపి ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ఆరోగ్యలక్ష్మిని పొందండి. రాష్ట్రాన్ని, దేశాన్ని సౌభాగ్యవంతంగా ఉంచండి.
8. గోహత్యాపాతకానికి ప్రాయశ్చిత్తం లేదని ప్రచారం చెయ్యండి. మత భేదము లేకుండా అందరికీ సుఖములను పంచే గోమాతను, శివభక్తులు, కృష్ణ భక్తులు, ముస్లిములు, ఏ మతస్థులయినా సేవించండి - తరించండి.

**ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని గో శాలలు :**

1. శ్రీ గోశాల-నిజామాబాద్ - 503001. ఫోన్:20571.
2. శ్రీ వేంకటేశ్వర క్రిష్ట, గో రక్షణట్రస్ట్, డెబిల్‌పురం, మేడ్చల్, ఆర్.ఆర్.జిల్లా.

3. శ్రీకృష్ణ గోసేవా మండల్, నార్సింగ్, కోకాపేట రోడ్, హైదరాబాద్-500171.

4. శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాల, వేములవాడ, కరీంనగర్ జిల్లా.

5. భైన్స గోశాల, భైన్స, ఆదిలాబాద్ జిల్లా - 504 103.

6. శ్రీ భ్రమరాంబా మల్లిఖార్జునస్వామి దేవస్థానం గోశాల, శ్రీశైలం, కర్నూలు జిల్లా.

7. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గోశాల, యాదగిరిగుట్ట - 508 115.

8. మంత్రాలయ గోశాల, మంత్రాలయం - 518 345, కర్నూలుజిల్లా.

9. ఋషివ్యాలీ డైరీ సొసైటీ, మదనపల్లి- చిత్తూరు జిల్లా.

10. శ్రీ వేంకటేశ్వర డైరీఫారమ్, తితిదే, తిరుపతి, చిత్తూరు జిల్లా - 517 502.

11. గుంటూరు గో సంరక్షణ సంఘం, 7వ లైన్, నెహ్రూనగర్, గుంటూరు.

12. శ్రీ విజయవాడ గోసంరక్షణ సంఘం, 10-2-12, అర్జున్‌వీథి, మల్లికార్జున పేట, విజయవాడ - 520 001.

13. ఏలూరు గోసంరక్షణ సమితి, రామచంద్రరావ్ పేట, ఏలూరు-534 002, ప॥ గో॥ జిల్లా.

14. గోసదన్ - కొప్పాక - ప॥ గో॥ జిల్లా.

15. గోసంరక్షణ సమితి, కంటోన్‌మెంట్, విజయనగరం - 531 203.

16. ఆదోని పింజరపోల్, ఆదోని-518 301. కర్నూలు జిల్లా.

17. శ్రీ సత్యసాయి గోకులం, ప్రశాంతి నిలయం-515 134, పుట్టపర్తి, అనంతపూర్ జిల్లా.



18. కర్నూలు జిల్లా గోసంరక్షణ సంఘం, కర్నూలు.

19. శ్రీ వ్యాసాశ్రమం (గోసదన్) ఏర్పేడు-517 619. చిత్తూరుజిల్లా.

20. శ్రీ బాపూజీ గోసంరక్షణ సంఘం, ఒంగోలు

21. తెనాలి గోసంరక్షణ సంఘం, తెనాలి - 522 202, గుంటూరు జిల్లా.

22. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి గోసదన్, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా.

23. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి గోరక్షణ సంఘం - నర్సరావుపేట.

24. శ్రీ గోపాల గోసంరక్షణ సంఘం, ఇంద్రపురం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా.

25. గౌతమి గో రక్షణ సంఘం, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.

26. శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి ధర్మసంఘం గోశాల, చిలకలూరి పేట, గుంటూరు జిల్లా.

27. బ్రహ్మానంద ఆశ్రమం గోశాల, భలిఘట్టం, నర్సిపట్నం, వైజాగ్ జిల్లా - 531 116.

28. శ్రీ బృందావన గోసంరక్షణ సంఘం, గోశాల, మచిలీపట్నం -521 001, కృష్ణాజిల్లా.

29. పుణ్యాశ్రమం గోశాల, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా.

30. శ్రీ వాసవికన్యకాపరమేశ్వరిసత్రం గోశాల, శ్రీశైలం, కర్నూలు జిల్లా.

31. గోపశు సంరక్షణశాల, ప్లాట్ నెం.183/ఎ, గుమ్మడి దలె జిన్ రాం మండల్, నర్సాపూర్, మెదక్ జిల్లా.

32. మహావీర్ గోసదన్, చౌదరి మేన్షన్, 39, బజార్ వీథి, తిరుపతి-517501.

33. స్వామి నారాయణ గురుకుల్ గోశాల, యంకపల్లి పోస్ట్, మెయినాబాద్ మండల్, రంగారెడ్డి జిల్లా.

34. భాగ్యనగర్ గోసేవాసదన్, లావర్ ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్.

35. ఇంబ్లిబన్ గోశాల సంచాలన్, మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, గౌలిగూడ, హైదరాబాద్.

36. శ్రీ వేణుగోపాలస్వామిమందిర్ గోశాల, జనవాడ, రంగారెడ్డి జిల్లా.

37. సచ్చిదానందగోశాల, బొంతపల్లి, జిన్నారం మండల్, మెదక్‌జిల్లా.

38. శ్రీ రాధాగోవింద గోరక్షణ సమితి, 19-9-22/సి, కెన్నెడినగర్, పరశు రామపురం, తిరుపతి- 517 501.

39. హరేకృష్ణ దేవాలయ గోశాల, అలిపిరి రోడ్, తిరుపతి.

40. శ్రీకృష్ణమురారి గోరక్షణ సమితి, ఎల్.బి.పురం, చిత్తూరు.

41. శ్రీకృష్ణ గోసేవ ట్రస్ట్, 1-125, శ్రీనివాసనగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ జిల్లా.

42. శ్రీరాంజీ గోసేవాసదన్, కాంచనపల్లి, తొట్టంబేడు మండల్, శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా.

## విశ్వ గో సమ్మేళనం: గో సంస్కృతి 2007

కర్ణాటక రాష్ట్రం షియోగాజిల్లా హోస్‌నగర్ లోని హనియ గ్రామానికి చెందిన జగద్గురు శంకరాచార్యులు శ్రీశ్రీశ్రీ రాఘవేశ్వర భారతీ స్వాములవారి శ్రీరామచంద్రపురమఠ ఆశ్రమంలో ఎందరో మహానుభావుల సమక్షంలో వారం రోజులపాటు విశ్వగోసమ్మేళనం జరిగింది. దేశము నలుమూలలనుండి, విదేశాలనుండి లక్షలాది గో భక్తులు పాల్గొన్నారు. బారులు తీరి గో కర్ణపీఠాన్ని



దర్శించిన భక్తులు, గోవుల ప్రదర్శనను తిలకించారు. గో భక్తులందరికీ ఉచిత భోజన, ఫలాహారాలు, తేనీరు వగైరాలు అందించారు.

గోవుకు సంబంధించిన చారిత్రక, ధార్మిక, ఆర్థిక, వ్యావసాయిక, ఔషధీయ మరియు ఆధునిక పరిశోధనాంశాలను ఎన్నింటినో చర్చించారు. పంచగవ్యచికిత్స, సేంద్రీయ ఎరువులు, కీటకనివారిణి, గోశాలలు - వాటి సమస్యలు, గోహత్యానిషేధం మొదలగు అనేక అంశాలపై అనుభవజ్ఞుల ప్రసంగాలు, సంగోష్ఠులు ఏర్పాటు చేశారు. భారతీయ గోజాతులు, వాటి రక్షణ, పశుచికిత్స గో రక్షణ చట్టాలు చర్చలోకి వచ్చాయి.

గో తులాభారం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎందరో భక్తులు పాల్గొని తరించారు. ఈ సమ్మేళనంలో ఒక భాగంగా భారతీయ గో వంశ రక్షణ సంవర్ధన పరిషత్ ప్రతి సంవత్సరము నిర్వహించే బృహత్ కార్యక్రమం 'గో సంస్కృతి-2007' నిర్వహించారు. ప్రపంచంలోని ఎందరో భక్తులు, గోపాలకులు, గోశాల ప్రబంధకులు, నిర్వాహకులు, రైతు సోదరులు సమ్మేళనంలో పాల్గొని దివ్యానుభూతిని పొంది ఇతోధిక గోసేవాస్ఫూర్తిని అందుకున్నారు. జైగోమాత, వందేగోమాతరం అనే నినాదాలు మిన్నంటి ప్రజల్ని పరవశింపజేశాయి. ఈ సమ్మేళనం ఎందరినో నాలాంటి వారిని చైతన్యపరచింది.

స్వదేశీ గోవుల ప్రదర్శన జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గోవులను, వాటి సమాచారాన్ని తెలియజేశారు. స్వదేశీ గోవులు మాత్రమే వైద్యానికి ఉపయోగపడతాయని, జెర్సి ఆవులవల్ల పాల దిగుబడి అధికం కాని నిష్ప్రయోజన మని" చాటి చెప్పారు. గోమాతపై గీతాలు, పాటలు, పద్యాలు, జానపదగీతాలు ఆలపించి దాని ఘనతను చాటి చెప్పారు.

**ఆబోతు** :

'గోవు' పదం కేవలం ఆవులకే గాక ఆబోతులకు, ఎద్దులకు, దూడలకు గూడా వర్తిస్తుంది - గోవుతో పాటు ఆబోతుల్ని కూడ పవిత్రంగా చూస్తారు -

అహింస, దయ, మాతృప్రేమ, ఓర్పు, కృతజ్ఞత, ఔదార్యం వంటి గుణాలు ఆవులో ఉన్నాయి. అందుకే చాలా గ్రామాల్లో ఇప్పటికీ, ఒక కుటుంబ పెద్ద మరణిస్తే, ఆ కుటుంబ సభ్యులు మేలైన ఆబోతును ఎంపిక చేసి గుర్తుగా అచ్చుపోసి గ్రామంలో వదులుతారు. అందుకే దాన్ని అచ్చుపోసిన ఆబోతు అంటారు. ఆబోతు గ్రామంలోని ఆవులను దాటి మేలుజాతి దూడల్ని పుట్టిస్తుంది - దానికి దాణా పెట్టిమేపే పనిని ఆ గ్రామంలోని పూజారికి అప్పగిస్తారు. అదే కారణంగా దానిని 'బ్రాహ్మణి' ఆబోతు అని కూడా అంటారు. గోశాలల్లో దేశీయములైన పెయ్యల్ని, ఆబోతుల్ని పెంచి గోసంతతిని అభివృద్ధి చేస్తున్నారు.

భారతదేశంలో గోవధ ఆంగ్లేయుల కాలంలోనే ప్రారంభమయింది. స్వామి దయానంద సరస్వతి 1880-1894 మధ్య గోవర్ధన సభలను ఏర్పాటు చేసి గోవధ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు - మానవుడు ఒక ముల్లు గ్రుచ్చుకుంటే ఎంత బాధపడతాడో, ఇంజక్షన్ సూది గ్రుచ్చితే ఎలా బాధపడతాడో మనకు తెలుసు. అలాంటిది ఒక పశువును దాని మాంస భక్షణకోసం చిత్రవధ చేస్తుంటే దానికి ఎంత బాధ కలుగుతుందో మనం ఊహించలేకపోతున్నాం - అది మన దౌర్భాగ్యం. ప్రాణిని హింసించకూడదని మనకు వేరే చెప్పాలా? జీవహింస పనికిరాదని మహాత్మాగాంధీ చెబుతూ 'గోవధ నిషేధం మన ప్రథమ కర్తవ్య మన్నారు' - గోవధనిషేధం రాజ్యాంగంలోని డైరెక్టివ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ స్టేట్ పాలసీలో పొందుపరచబడింది.

వాతావరణకాలుష్యంవల్ల వచ్చే ఇరవై సంవత్సరాల్లో హిమాలయాల్లోని మంచు కరగిపోయి, గంగా, బ్రహ్మపుత్ర నదులతోపాటు చైనాలోని మూడు నదులూ ఎండిపోయి, ఎడారిగా మారుతుందని, ఈ ప్రమాదం నుంచి కాపాడగలిగేవి గోవులు, వృక్షాలు మాత్రమేనని చెబుతారు - ఎందుకంటే గోవులు - వృక్షాలు ఆక్సిజన్‌ను ఇచ్చేశక్తిగలవి, కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చి జీవించగలవి కాబట్టి అందుకే మాంసాహారం మానాలనీ, వృక్షాల్ని పెంచాలని ఆదేశించారు.



## గోరక్షణ: గోసేవ ఎందుకు చెయ్యాలి?

1. గోశాలలో, గోవు సమీపంలో దేవతా స్తోత్రాలు, పఠిస్తే అధికఫలం ఉంటుంది.
2. గోవునుంచి ప్రసరించే శక్తి తరంగాలు మహాశక్తి కలిగి ఉంటాయి. వాటి కాంతి పరిధి చాలా దూరం విస్తరిస్తుంది. గోవులున్న చోట కుండలినీశక్తి ఉంటుంది.
3. గోవులున్న చోటికి భూత ప్రేత పిశాచాలు రావు-
4. పితృతిథులలో సక్రమంగా, విధి విధాన ప్రకారం చేసే అవకాశం లేకపోతే, ఆకుకూరలు, పండ్లు ఆవుకి పెడితే, ఆ పితృదేవతలు ఉత్తమలోకాలను పొందుతారు.
5. ఒక్కొక్క గ్రహానికి ఒక్కొక్క ధాన్యం ఆయా రోజుల్లో బెల్లం, ఆకుకూరలు, పండ్లు మొదలైన వాటితో గోవుకు పెడితే గ్రహబాధలు తొలగిపోతాయి. ఏలినాటి శని బాధితులు నువ్వులు బెల్లం కలిపి ఆవుచేత తినిపిస్తే శనిదోషం తొలగిపోతుంది.
6. ఆవునేతితో దీపం వెలిగిస్తే ఆ ఇంట్లో మహాలక్ష్మి కాపురముంటుంది.
7. గోవులో చతుర్దశభువనాలున్నాయి.
8. భారతీయ గోజాతి సౌరశక్తిని ఎక్కువగా స్వీకరిస్తుంది. అందుకే గోవులో దేవతాశక్తి ఉంటుంది.
9. శివుని వరం వల్ల పుట్టినదే కపిల గోవు.
10. గోరక్తం భూమి మీద పడితే, ఆ ప్రదేశం నశించిపోతుంది. గోవులు క్షేమంగా ఉంటేనే మనం క్షేమంగా ఉంటాం.
11. గోవధ చేస్తే మనం ఊరకుండరాదు - దానివల్ల మనకు వినాశనం జరుగుతుంది.

12. యజ్ఞంలో దేవతల కిచ్చే ఆహుతులు, అగ్ని దేవతలకు అందజేస్తాడు. అప్పుడాదేవతలు తృప్తిపడతారు - అలాగే మన ఇష్టదైవాన్ని తలచుకొని గోవుకు ఆహారం పెడితే మనకు దైవానుగ్రహం లభిస్తుంది.

13. సంతానం లేనివారు గోసేవ చేస్తే గోమూత్రం, గోక్షీరం త్రాగితే సంతానం కలుగుతుంది.

14. అష్టాదశ పురాణాల్లో 2000 శ్లోకాలు 'గో గరిమ, మహిమల గురించి చెప్పబడ్డాయి.

15. గోత్రము అనగా గోవులను సంరక్షించు స్థానము- గోశాల శాశ్వత వ్యవస్థ వారి సంచాలకులయిన ఋషులే 'గోత్ర' కర్తలుగా ప్రసిద్ధి చెందారు.

16. మన వేదాల్లో గో మహిమ గురించి తెలుపుతూ గోవు 'చంపకూడనిది' అని 140 సార్లు చెప్పబడినది.

17. గోవులవల్ల ఐహిక, ఆముష్మిక, ఆధ్యాత్మిక పరమార్థములు కలుగుతాయి.

18. గోరక్షణను భారతీయులు ఉపేక్షించడమే భారత వర్షపతన కారణమని - గాంధీజీ అన్నారు.

19. అనేక లాభాలను ఇచ్చే గో ఆధారిత వ్యవసాయం మాని ఆధునిక యంత్రాలతో పొలాన్ని దున్ని, రసాయన ఎరువులను వాడడమే మనరైతుల ఆత్మహత్యలకు కారణం.

20. గోవులు పాలివ్వకపోయినా, వాటి పేడ, మూత్రం, ఔషధాలు, మనకు లాభదాయకాలు.

21. ఆరోగ్యకరమైన స్వదేశీ గో మూత్రం ఒక ఔన్సు త్రాగితే ఆరోగ్యం చేకూరుతుంది.

22. గోక్షీరం నుంచి కేసిన్ తయారుచేసి - కాన్సర్‌కు మందును తయారు చేస్తున్నారు.



23. గోమూత్రం అర్క కీటకనాశని. భూసార రక్షణకు మంచిది - ఇది యాంటీబయాటిక్స్ ప్రభావాన్ని 2 నుంచి 80 రెట్లు పెంచుతుంది.

24. దేశీయ గోవులున్న చోట మలేరియా, ప్లేగు, గున్యా, ఫైలేరియా, పిట్టి ఫ్లూ మొదలగు వ్యాధులు వ్యాపించవు.

25. ఒక చెంచాడు ఆవు నెయ్యితో, ఆవు పిడకలతో హోమం చేస్తే 1000ccల ప్రాణవాయువు పుడుతుంది. వాతావరణ కాలుష్యాన్ని హరిస్తుంది.

26. ప్రతి ఇంట గోవు, ప్రతి రైతు దగ్గర జతఎద్దులు, దేవాలయాల్లో, గ్రామాల్లో గోశాలలు ఉంటే గ్రామ స్వరాజ్యం, రాష్ట్రసౌభాగ్యం, దేశసౌభాగ్యం తథ్యం.

27. గోవుంటే గృహానికి వైద్యుడక్కర్లేదు - పంచగవ్యములతో సౌందర్య పోషణ జరుగుతుంది.

28. ఒక కిలో ఆవుపేడతో 40 కిలోల కంపోస్టు ఎరువు తయారవుతుంది. రసాయన ఎరువుతో పోలిస్తే 3వ వంతు ఖర్చుతగ్గుతుంది. ఒక సంవత్సరం ఈ ఎరువు వేస్తే 3 సంవత్సరాల వరకూ ఎరువు వెయ్యనక్కర్లేదు.

29. ఎద్దులతో నాగళ్లతో దున్నితే (9 అంగులముల లోతున) భూమిలో వానపాములు అంతకంటే క్రింద ఉండి భూమిని గుల్లపరుస్తాయి.

30. గృహప్రవేశం:- నూతన గృహంలో మొదట గోవును ప్రవేశపెడతారు. ఆవుకాలుపెడితే సమస్త దోషాలు తొలగిపోయి శుభం జరుగుతుంది.

**ఆవు శక్తినిచ్చేదేవత :**

గౌతమబుద్ధుడు బోధివృక్షం క్రింద ఘోరమైన తపస్సు చేశాడు - అన్న పానీయాలు లేకుండా చేసే ఈ తపస్సువల్ల అతని శరీరం శుష్కించసాగింది - సుజాత అనే ఒక పల్లెటూరి పడతి ఆయనకు ఆవు పాలతో చేసిన పాయసాన్ని తెచ్చి ఇవ్వడం వల్ల ఆయన కోలుకున్నాడు - మధ్యేమార్గం యొక్క విలువను తెలుసుకున్నాడు. నిర్వాణాన్ని సంపాదించుకున్నాడు- 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని గోవుయొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నాడు.

**గోన్యాయం :** గోవు త్యాగానికి ప్రతీక, ధర్మానికి స్వరూపం. పంచగవ్యాలను మనకిచ్చి, తన బ్రతుకునంతా త్యాగం చేసి మనల్ని కాపాడుతుంది - గోమాత - భూమాత- దేవమాత. గోవు మాతగా ప్రసిద్ధి చెందింది. ఏ పుణ్యకార్యానికైనా ముందుగా, దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠకు ముందుకూడా గోమాతను పూజించాలి.

గతంలో పెళ్లయి అత్తవారింటికి వెళ్లే ఆడపడుచుకు నగలు, వస్త్రాలు, సారెతో పాటు ఆవును కూడా కానుకగా ఇచ్చేవారు- కాలగమనంలో ధనం, చీరలు, సారెలు నష్టపోయినా, గోవు దాని సంతతిమాత్రం నష్టపోవవని, దాని సంతానా భివృద్ధి ఆడపడుచుకు జీవనోపాధిగా ఉంటుందని చెప్పేవారు. గోవు పాడి, పంట, ధనధాన్య సౌభాగ్యాలను ఇస్తుంది.

**పరిశ్రమకు ఉపయోగం :** చర్మం, కండ, మాంసం : గ్లిసరిన్, వస్త్ర పరిశ్రమకు, క్రొవ్వు సోపుతయారీకి, బొచ్చు, జుట్టు: బూట్లకు, గృహోపకరణములైన మెత్తలకు, రక్తం : ఎరువులు, కొమ్ములు దువ్వెనలు, బటన్స్, కత్తులపిడి, బంక, పర్షియన్ బ్లూ, ఎముకలు: బటన్స్, బ్రష్ హ్యాండిల్స్, ఎముకల పొడి, ఛస్ పావులు, డెక్కలు : బటన్స్, దువ్వెనలు, బంక, 'గోవు' భారతప్రభుత్వ వాణిజ్యానికి వెన్నెముక వంటిది. భూమిలేని వారికి, పల్లెల్లో స్థిరనివాసం ఏర్పరచుకునే వారికి ఆవులను సంరక్షించే బాధ్యతను ఒప్పగించి 'పశుక్రాంతి' పథకాన్ని విస్తృతం చెయ్యాలి.

**Animal Welfare Board** వర్క్‌షాపులను, సెమినార్స్‌ని నిర్వహించి గోసంతతి మన దేశానికి సంపదనిచ్చేవని బడి, కాలేజీ విద్యార్థులకు దానిపై అవగాహన కల్పించాలి.

**గోవును జాతీయ జంతువుగా పరిగణించాలి :**

జంతువులను పూజించడం అవసరమని విష్ణుపురాణంలో చెప్ప బడింది. ఏనుగు, కుక్క, పాము, కోతులను పూజించడం 'సర్వభూతదయ'



కోసమే. గోబ్రాహ్మణ రక్షణ చెయ్యాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆవు ఒక మతం కాదు. మత ఉన్మాదం కాదు. హిందు, ముస్లిం, క్రిష్టియనులు అంతామెచ్చే జంతువు ఆవు. త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగాలలో దీన్ని పూజించారు. తిరుమల శ్రీనివాసుడు పుట్టలో గోక్షీరం త్రాగి ఆకలి దప్పులు తీర్చుకున్నాడు.

నాసిక్‌లో గోముఖాన్నుంచే గోదావరి పుట్టింది-

ఇండియాలోని 'ఆవుల'లోని రకాలు : 45 దేశాల్లో కూడా వ్యాపించాయి. (1) హాలీకర్, (2) పొన్‌వార్, (3) మాల్వీ, (4) షహివాల్ (5) కంగాయమ్, (6) హరియానా, (7) గిర్.

గోవు మట్టిలోని, గాలిలోని, నీటిలోని, పంటలలోని కాలుష్యాన్ని నివారణ చేస్తుంది.

ట్రాక్టర్లు మొదలగు యంత్రపరికరాలతో వ్యవసాయం మాని ఎడ్లను, నాగళ్లను ఉపయోగించి వ్యవసాయం చేస్తే అన్నివిధాలా మంచిది. గడ్డి వాముల సంపత్తి లేనపుడు, ఇళ్లల్లో గోవులను సంరక్షణ చేయలేకపోయినపుడు మఠాల్లో, దేవాలయాల్లో గోసంరక్షణ చేసి ధేనువులను పూజించాలి.

రోజూ 50 వేల ఆవులను వధిస్తున్నారు. 25-30 వేల ఆవులను దొంగతనంగా ఎగుమతి చేస్తూ, 5-6 లక్షల ఆవులను బక్రీద్ సందర్భంగా బంగ్లాదేశ్‌కు పంపి బలి చేస్తున్నారు. గోవధను Non-Bailable Offenceగా పరిగణించి గోహంతకులను అతికఠినంగా శిక్షించాలి. తిండిపెట్టక వాటి కడుపుమాడ్చి తమిళనాడు నుండి కేరళకు పంపి వధిస్తున్నారు. చట్టాలను అమలుచేసే విధానాల్లో లోపం వల్ల పోలీసువ్యవస్థకు రూల్సు, చట్టాలు తెలియకపోవడం వల్ల గోసంరక్షణ జరగడం లేదు. కనుక Animal Welfare Board, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం జాగ్రత్త వహించి గోవధ నిషేధాన్ని ఖచ్చితంగా అమలుపరచవలసి ఉంది.

"ఓంతత్సంయో రావృణీ మహే- గాతుం యజ్ఞాయ - గాతుం యజ్ఞపతయే- దైవీస్వస్తురస్తునః - గాతుం యజ్ఞాయ స్వస్తిర్మానుషేభ్యః ఊర్ధ్వంజి గాతు భేషజం - శం నో అస్తు ద్విపదే - చంచతుష్పదే ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః".

**గోఆధారిత వ్యవసాయం :**

గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశం - పంచభూతాల సమ్మేళనం. గోజీవకణాల్లో పంచభూతాలు సమానంగా ఉన్నాయి. అందుకే గోవును తల్లిగా భావిస్తాము. గోవు కామధేనువుగా మనకు అన్ని కోరికలను నెరవేరుస్తుంది.

ఆధునిక వ్యవసాయం కంటే, సంప్రదాయ వ్యవసాయం చాలా ఉత్తమం. అధిక దిగుబడుల నాశించి, విచక్షణ లేకుండా రసాయనాలను, విషపూరితములైన పురుగు మందులను వాడి సారవంతమైన భూమిని నిర్వీర్యం చేస్తున్నాం. దానివల్ల సహజ రోగనిరోధకశక్తి క్షీణించి, పంటల మీద చీడ, పీడ వ్యాపించి దిగుబడి తగ్గడమే గాక, పండిన పంటలో నాణ్యత తగ్గిపోతుంది. వ్యవసాయం రైతులకు భారమైపోతుంది.

1) **పంచగవ్య తయారీ :** గోమూత్రం 10 లీటర్లు, గోమయం 7 కేజీలు, గోక్షీరం 4 లీటర్లు, గోవునెయ్యి 1/2 కేజీ, పెరుగు 2 లీటర్లు, తేనె 1/2 లీటరు ఒక బ్యారల్‌లో వేసి ఒకగంట సేపు కలియబెట్టి (7 రోజులు- ఉదయం, సాయంత్రం) తయారు చెయ్యాలి. ఇలా చేసిన పంచగవ్య 3 లీటర్లు, 100 లీటర్ల మంచినీటిలో కలిపి, వడగట్టి పొలాల్లో పిచికారీ చెయ్యాలి. క్రిమి, కీటకాలు చేరక అధిక దిగుబడినిస్తాయి. ఎంతో మేలయిన పంటలు పండి అధికలాభాన్నిస్తాయి.

2) **కీటినియంత్రణ్ తయారుచేయు విధానం:** గోమూత్రం 10 లీటర్లు, వేపాకు 2 కేజీలు, తులసి ఆకు ఒక కేజీ, మట్టికుండలోవేసి మూతపెట్టి దానిని భూమిలో గొయ్యి తీసి పాతిపెట్టాలి. 21 రోజుల తర్వాత పైకితీసి, ఆ ద్రావణంలోని ఆకులను పిండి, మరగపెట్టి ఆ ద్రావణాన్ని నిలువచెయ్యాలి. 1 సంవత్సరం వరకు నిలువ ఉంటుంది. ఒక లీటర్ నియంత్రణ్ 100 లీటర్ల స్వచ్ఛమైన నీటిలో కలిపి పిచికారీ చేస్తే అది పంటను కాపాడుతుంది.



3) **జీవామృతం తయారీ:** గోమూత్రం 5 లీటర్లు, గోమయం 10 కేజీలు, నల్లబెల్లం 2 కేజీలు, సెనగ పిండి 2 కేజీలు, పుట్టమన్ను 2 కేజీలు, ఒక పెద్ద బ్యారల్‌లో వేసి కలియబెట్టి (7 రోజులు ఉదయం, సాయంత్రం) తయారుచెయ్యాలి. 10 లీటర్ల జీవామృతం 100 కేజీల స్వచ్ఛమైన నీటిలో కలిపి ఉద్యానవనాలకు, పంటలకు అంటే దానిమ్మ, బొప్పాయి మొదలగు వాటికి వాడితే అధిక దిగుబడి వస్తుంది. అలాగే అరటితోటలకు వాడితే పళ్లు రుచిగా, తియ్యగా ఉంటాయి. పంటనష్టం ఉండదు. అధిక లాభాలు పొందవచ్చు.

ఇలా ప్రతిజిల్లాలోను ప్రకృతి నైసర్గిక వ్యవసాయ విధానాలను నలుదిశల వ్యాప్తిచేసే కార్యక్రమం రూపొందించి, ఒక దేశీయ గోవు ద్వారా 10 నుండి 30 ఎకరాల భూమిలో వ్యవసాయం అతి తక్కువ ఖర్చుతో లాభసాటిదిశగా జరుపుకోవచ్చు. వినియోగదారులకు విషరహిత కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యములు సరఫరా చెయ్యాలి.

ఇలా చెయ్యడం వల్ల నిర్వీర్యమైన భూమిని తిరిగి తేజోమయంగా, సజీవంగా మార్చడానికి కృషి చేస్తున్నాయి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు.

నాగపూర్‌లోని దేవళాపార్‌లో గో ఆధారిత వ్యవసాయంలోని వివరాలను, కార్యకలాపాలను తెలపడానికి డా॥ సుంకవల్లి గో-గో వ్యవసాయ విజ్ఞానకేంద్రం ప్రారంభమైంది. సేంద్రియ వ్యవసాయం సాధ్యమా అన్న అనుమానంతో రైతులు ముందుకు రావడం లేదు. దాని కోసం ఈ కేంద్రం కృషి చేస్తోంది. అలాగే ఆవులను పోషించగలమా అని భయపడుతున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, తెగుళ్ల మందులు, ట్రాక్టర్లు వాడటం వల్ల వ్యవసాయం ఖర్చులు పెరిగిపోయి రైతులు నష్టాల ఊబిలోకూరుకుపోయి

పెట్టుబడులు రాక, ఆత్మహత్యల పాలవుతున్నారు. అటువంటివారికి వివరంగా చెప్పి వారు మారడానికి కృషి చెయ్యాలి.

గో ఆధారిత సేంద్రీయ వ్యవసాయానికి భవిష్యత్ ఉంది అనేది తిరుగులేని సత్యం.

**గో ఆధారిత (ఉత్పత్తి చేయబడిన) ఫలములు: గోవు - దాని ఉత్పత్తులు:**

**అమృతసారం (బట్టీ పెట్టిన గో మూత్రం):** రోగ నిరోధక శక్తినిస్తుంది. అన్ని రకములైన రోగాలకు నివారణ కలుగజేస్తుంది. రోజూ ఉదయాన్నే సేవించిన మంచిదని ఆయుర్వేదములో చెప్పబడింది.

**సురభి (ధూపం కడ్డీ):** పర్యావరణాన్ని శుభ్రపరుస్తుంది. మనిషియొక్క మెదడును, ఆత్మను పునీతం చేస్తుంది. పూజకు పనికివస్తుంది.

**నిర్మలగంగ (సోప్):** చర్మవ్యాధులనుండి కాపాడుతుంది. తలవెంట్రుకలను రాలనివ్వదు. చర్మాన్ని, ముఖాన్ని అందంగా ఉంచుతుంది.

**సుకిష (షాంపు):** చుండ్రును పోగొట్టి, జుట్టురాలకుండా చేస్తుంది.

**లోభన (పౌడర్)** : దానినుంచి వచ్చే పొగ ఇంటిని కాపాడి, శుభ్రంగా ఉంచుతుంది.

**సుగంధి (ముఖానికి వాడే పౌడర్)** : పింపుల్స్, నల్లమచ్చలు రాకుండా ముఖాన్ని కాంతిమంతంగా ఉంచుతుంది. ప్రతిరోజు రాత్రి పాలతో కలిపి రాసుకుని ఉదయాన్నే చల్లని నీళ్లతో కడగాలి.

**త్రిగుణ (విభూతి):** పూజకు వాడవచ్చు. మందుగా కూడా వాడవచ్చు.

**శమనతైలం:** శరీరంలోని కీళ్లనొప్పులు తగ్గుటకు వాడాలి.

**శుచిస్మిత (పళ్లపొడి)** : పళ్ల శుభ్రత కొరకు వాడాలి.

**షోడశి (పళ్లపొడి)** : దంతముల రక్షణకొరకు వాడాలి. నోటిని శుభ్రపరుస్తుంది.



**అమ్రతములం:** ఫంగస్, దురదలు, అనేక చర్మ వ్యాధులకు, కాలిన గాయాలు తగ్గడానికి.

**నివేదన (ములం)** : తలనొప్పి, జలుబు తగ్గడానికి వాడాలి.

**సుచరణ** : కాలిపగుళ్లను పోగొట్టును.

**అభ్యంగతైల** : అలసటకు, ఒళ్లునొప్పులు తగ్గుటకు వాడాలి.

**హిమగిరితైల** : చుండ్రు, వెంట్రుకలు రాలుట, నిద్ర లేకపోవుట, కంటిమంటలు తగ్గుటకు వాడితే మంచిది.

**వాత్సల్యటానిక్** : 10 సంవత్సరాల్లోపు పిల్లల ఎదుగుదలకు బాగా పనిచేస్తుంది. జీర్ణశక్తినిచ్చి, గుండెకుబలం కలిగిస్తుంది. కాలేయం బాగా పనిచేయడానికి తోడ్పడుతుంది. శరీరబలం, జ్ఞాపకశక్తినిచ్చును.

**పంచగవ్యగ్రాత** : బి.పి., టెన్షన్ తగ్గించును.

**క్షరవటి (బిళ్లలు)** : అతిమూత్రవ్యాధిని తగ్గిస్తుంది.

**నేత్రసార (కళ్ల-చుక్కలు)** :కంటి వ్యాధులకు వైద్యుల సలహాతో వాడవచ్చును.

**గోమయాది తైలం** : చెవి, కంటి జబ్బులకు.

**జీవామృత** : వ్యవసాయమునకు ఎరువుగా వాడాలి.

**అమృతజల** : కొబ్బరి, కూరగాయలు పండించుటకు దీనిని ఎరువుగా వాడితే - దిగుబడి బాగా ఉంటుంది.

**సమృద్ధి** : పంటలకు హాని కలిగించే క్రిములను తరిమిగొడుతుంది.

**ఫలవటి** : మంచి రసాయన ఎరువుగా పనిచేస్తుంది.

**గో సేవచే బ్రహ్మాజ్ఞానం :**

గౌతమమహర్షి తన శిష్యులలో ఒకడైన సత్యకాముని పిలిచి, ఇలా అన్నాడు. నీ కొక సేవా కార్యక్రమాన్ని అప్పగిస్తున్నాను. నా ఆశ్రమంలో 400

ఆవులున్నాయి. వాటిని సుదూరంలో ఉన్న అడవికి తోలుకొనిపోయి మేపి, అవి వెయ్యి పశువులయిన తర్వాత తోలుకొనిరా !

సత్యకాముడు గురువు ఆజ్ఞను శిరసావహించి బయలుదేరాడు. కీకారణ్యం, క్రూరమృగముల బాధ, వాటిని అదుపులో ఉంచడం మొదలైన బాధలను లెక్కచేయక గురువుగారి ఆశీర్వాదంతో ఈ కార్యం సాధించగలనని అనుకున్నాడు.

పచ్చటి మైదానాలు, నిర్మల జలాశయాలు, జలపాతాలు నెలకొన్న వనంలో గురుధ్యానం చేసుకుంటూ, త్రికరణశుద్ధిగా గోసేవ చేశాడు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి. ఆవుల సంఖ్య అసంఖ్యాకంగా వృద్ధి చెందింది. ఒక రోజున ఆ మందలోని ఒక వృషభం ఇలా అంది - 'సత్యకామా! ప్రస్తుతం మా సంఖ్య వెయ్యి అయింది. కాబట్టి మమ్మల్ని గురువు గారి దగ్గరకు తోలుకుపో'. మర్నాడు ఆవుల మందను తోలుకుని గురువుగారిని చేరుకున్నాడు. శిష్యుని గురుభక్తి, వ్రతం, సేవానిరతి, కార్యసఫలతను అభినందించి 'నీకు అరణ్యంలో ఎవరైనా జ్ఞానోపదేశం చేశారా?' అని అడిగారు.

"గురుదేవా! నాకు మార్గంలో వృషభం, అగ్ని, హంస, నీటికోడి అనే మానవేతరాలు బ్రహ్మం యొక్క నాలుగు పాదాలను ఉపదేశించాయి. మీరు నాకు పూర్ణోపదేశాన్ని చెయ్యండి" అని అడిగాడు.

"పుత్రా! బ్రహ్మాన్ని గురించి నువ్వెంత ఉపదేశాన్ని గ్రహించావో అదే దాని పరతత్త్వం. ఇక నీకు ఈ చరాచరప్రపంచంలో తెలియవలసిందేమీ లేదు. ఇదంతా గోసేవాఫలం. ఆ సేవ వల్లనే నీకు బ్రహ్మ జ్ఞానసిద్ధి కలిగింది."

బ్రహ్మవర్చస్సుతో ధగధగలాడుతున్న అతణ్ణి మిగిలిన శిష్యులందరూ చుట్టుముట్టి కొనియాడారు. శిష్యులకు, లోకానికి సత్యకాముని గురుభక్తి, గోసేవ గురించి గౌతమమహర్షి తెలియజేశాడు.



**గోవిందుడు** :

ఇంద్రుడు హోమహవిస్సులు ఇవ్వలేదనే కోపంతో గోకులంలో రాళ్లవాన కురిపిస్తాడు. దాంతో అందరూ భయభ్రాంతులవుతారు. అప్పుడు కృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని తన చిటికెన వ్రేలితోనెత్తి గొడుగుగా పట్టి, అందరికీ ఆశ్రయం కల్పిస్తాడు. వారం రోజుల తర్వాత ఇంద్రుడు తనతప్పును తెలుసుకొని కామ ధేనువుతో కృష్ణుని సమీపించి క్షీరాభిషేకం చేస్తాడు. గోవులను గోపాలురను ఆనందింపజేసినవాడుగా శ్రీకృష్ణుడికి గోవింద పట్టాభిషేకం జరుగుతుంది - దాంతో గోవిందు డయ్యాడు శ్రీకృష్ణుడు. అందుకనే ద్రౌపదికూడా కృష్ణుణ్ణి 'గోవిందా' యని పిలిచి, కృష్ణుని నుంచి రక్షణ పొందుతుంది. గోవిందనామం ద్వాపరయుగం నుంచే ఉంది.

గో భక్తుడైన వ్యక్తికి కోరినవన్నీ లభిస్తాయి. స్త్రీలకు కూడా మనోవాంఛలు నెరవేరుతాయి. పుత్ర సంతానాభిలాషికి పుత్రుడు, విద్యార్థికి విద్య, సుఖార్థికి సుఖము లభిస్తాయి. గో భక్తులకు దుర్లభమైనదేదీ లేదు.

అందుకే స్వామి దయానందసరస్వతి 1880- 1894 మధ్య గోవర్ధన సభలను ఏర్పాటు చేసి గోవధ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే పశువుల పరిరక్షణ, అభివృద్ధి కమిటీని సర్దార్ దాతర్ సింగ్ నేతృత్వంలో నెలకొల్పబడింది. కేంద్ర గోవర్ధనమండలి 1960లో వట్టిపోయిన పాడిపశువుల, దూడల పరిరక్షణ గురించి చర్చించింది. 1976 లో జాతీయ వ్యవసాయ కమీషన్ పశుసంవర్ధనపై సూచనలు చేసింది.

పశుఅభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాల్ని 'పశుయజ్ఞం'లా భావించి 'గోసంరక్షణ-అభివృద్ధికి' అంకితభావంతో కృషి చేద్దాం.

❀ ❀ ❀